తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.APTEL / 2013 /50370

25.2.2024 ఆదివారం | సంపుటి : 10 సంచిక : 226 | పేజీలు : 12 వెల : రూ. 4/- | Follow :

తెలంగాణ | Simultaneously Published from Karimnagar & Hyderabad. | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

రైతుల వివరాలు విదేశీ కంపెనీల చేతుల్లో..

రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన ఉత్తర్వులను త్వరలో జారీచేయాలని ఆదేశించారు. భూ సమగ్ర సర్వేతోనే కొత్త చిక్కులు వచ్చాయని కమిటీ సీఎంకు తెలిపింది. పాత రికార్డులనే గత ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకోవటంతో భూముల సమస్యలు, భూముల రికార్డుల వివాదాలు ఎక్కువయ్యాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ధరణి పోర్టల్ నిర్వాహణ ఏజెన్సీపై విచారణకు సీఎం ఆదేశం

హడావుడిగా భూ సమగ్ర సర్వే

- కొత్త ఆర్ఓఆర్ చట్టం తెచ్చేందుకు సర్కారు యోచన

హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :

శనివారం సచివాలయంలో ధరణి కమిటీతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2018లో టెక్నికల్, ఫెనాన్సియల్ బిడ్డింగ్, అర్హతల ఆధారంగా ఐఎల్ ఎఫ్ఎస్ అనే కంపెనీకి అప్పటి ప్రభుత్వం ధరణి పోర్టల్ డిజైన్ డెవెలప్‌మెంట్‌ను అప్పగించిందని అధికారులు బదులిచ్చారు. ఆ కంపెనీ దివాళా తీసిందని, తర్వాత టెర్రాసిస్ అని పేరు మారటం, డైరెక్టర్లు అందరూ మారిపోవటం, తర్వాత వాటాలు అమ్ముకొని ఫాల్కాన్ ఇన్వెస్టెమెంట్ కంపెనీగా చేతులు మారటంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. బిడ్ దక్కించుకున్న కంపెనీ తమ ఇష్టానుసారంగా పేర్లు మార్చుకొని, ఏకంగా కంపెనీలనే మార్చితే ప్రభుత్వం ఎలా అంగీకరించిందని ముఖ్యమంత్రి ఆరా తీశారు. భూముల రికార్డుల డేటాను ఎవరికి పడితే వారికి, విదేశీ కంపెనీలకు కూడా అప్పగించే బంధనలున్నాయా.. అని అధికారులను ముఖ్యమంత్రి ప్రశ్నించారు. 2018లో రూ.116 కోట్లకు ధరణి టెండర్ దక్కించుకున్న కంపెనీ తమ వాటాలను దాదాపు పన్నెండు వందల కోట్లకు » మిగితా 2లో

ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న ఏజెన్సీపై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సీసీఎల్ఏ అధ్వర్యంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన ఈ పోర్టల్‌ను ప్రైవేటు ఏజెన్సీలకు ఎందుకు అప్పగించారని సీఎం ప్రశ్నించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల భూముల రికార్డులు మొత్తం విదేశీ కంపెనీల చేతుల్లో ఉన్నాయని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. అత్యంత గోప్యంగా ఉండాల్సిన భూముల డేటాను, ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలన్నీ ఏజెన్సీ దగ్గర ఉంచటాన్ని ముఖ్యమంత్రి తప్పు బట్టారు. భూముల రికార్డుల డేటాకు భద్రత ఉందా.. సురక్షితంగా ఉన్నట్టా.. లేనట్టా.. అని అనుమానాలు వ్యక్తం చేశారు.

లక్షలాది దరఖాస్తులు ఇప్పటికే తిరస్కరణకు గురయ్యాయని, ఒక్కో తప్పును సవరించుకోవాలంటే వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించాల్సి ఉండడం రైతులకు భారంగా మారిందని తెలిపారు. ధరణి డేటాను వ్యవసాయ శాఖ ప్రామాణికంగా తీసుకొని రైతు బంధుఖాతాలో జమ చేయటంతో ఇప్పటికే కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగమైందని చర్చ జరిగింది.

స్టేట్ ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా చిన్నారెడ్డి

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్ : తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల కోలాహలం కొనసాగుతోంది. తాజాగా ప్రణాళిక సంఘాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డికి స్టేట్ ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్ బాధ్యతల్ని అప్పగించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో చోటే దక్కని వారికి నామినేటెడ్ పోస్టులను ఖరారు చేస్తుంది కాంగ్రెస్ పార్టీ. వనపర్తి నియోజకవర్గం నుంచి ముందుగా చిన్నారెడ్డి పేరును ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ బీఫామ్ ఇచ్చే సమయంలో ఆ సీటును మేఘా రెడ్డికి కేటాయించింది. చిన్నారెడ్డికి రాజ్యసభ సీటు ఇస్తారని జోరుగా ప్రచారం సాగింది. కానీ అనూహ్యంగా స్టేట్ ప్లానింగ్ కమీషన్ వైస్ ఛైర్మన్ బాధ్యతల్ని కట్టబెట్టింది కాంగ్రెస్ పార్టీ.మూడు రోజుల క్రితమే ఆర్థిక సంఘాన్ని కూడా నియమించింది సీఎం రేవంత్ సర్కార్. తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను ప్రభుత్వం నియమించింది. కమిషన్ సభ్యులుగా ఎం. రమేశ్, సంకేపల్లి సుధీర్ రెడ్డి, మాలోత్ నెహ్రూ నాయక్‌లను నియమించారు. వీరు రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు
- రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన 2.45 లక్షల దరఖాస్తులు
- మెరుగైన రెవిన్యూ రికార్డుల నిర్వహణకు చట్ట సవరణ

2

థాంక్యూ ప్రవీణ్..

యువత సమస్యలు ప్రభుత్వం దృష్టికి తెచ్చినందుకు..

ఆర్ఎస్‌పీకి సీఎం రేవంత్ రెడ్డి ధన్యవాదాలు

హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :

'ఆర్ఎస్ ప్రవీణ్ గారూ.. మన తెలంగాణ యువతకు సంబంధిం చిన సమస్యని ప్రజా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలనే మీ ప్రయత్నానికి నా ధన్యవాదాలు' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రవీణ్ కుమార్ ట్వీట్‌నుద్దేశించి ఆయన సమాధానం ఇచ్చారు. 'గడిచిన పదేళ్లలో తెలంగాణ యువత ఎంత దగా పడిందో, వారి భవిష్యత్తు మీద గత ప్రభుత్వం ఏ విధంగా కోలుకోలేని దెబ్బ తీసిందో మనందరం చూసాం. ఆ దశాబ్ద కాల విషాదాన్ని సాధ్యమైనంత త్వరగా అధిగమించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, మన యువత భవితను పునర్నిర్మించాలనే సంకల్పంతో మా ప్రభుత్వం నిర్విరామంగా పని చేస్తోంది. గురుకుల టీచర్ల రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి మీరు లేవనెత్తిన విషయాలను, ఇచ్చిన సూచనలను నిశితంగా పరిశీలించి, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తాం' అని పేర్కొన్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా తెలంగాణ పునర్నిర్మాణానికి ఎవరు కలిసొచ్చినా వారి విలువైన సూచనలు, సహకారం తీసుకోవడానికి, వారితో కలిసి పనిచేయడానికి ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. 'మా ప్రయత్నం.. మా తాపత్రయం అంతా.. తెలంగాణ ప్రజల మంచి కోసమే తప్ప, గుర్తింపు కోసం కాదని మీకు సవినయంగా మనవి చేస్తూ, మీరు మున్ముందు కూడా ప్రజా సమస్యలేమైనా సరే మా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరుకుంటున్నాను' సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

బీజేపీ సొంతగా 370 సీట్లు సాధించలేదు

12

వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్

ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు

4 రోజులు.. కోటి 40 లక్షల జనం హాజరు

మేడారం జాతరకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలు, అధికారుల సహకారం గొప్పది

విజయవంతానికి కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు : మంత్రి సీతక్క

7

మేడారం మహా జాతర విజయవంతమైంది. నాలుగు రోజుల్లో కోటి నలభై లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం వరకు మరింత పెరిగే అవకాశం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. మేడారం జాతర ముగియ నుండడంతో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు.

యాదాద్రి పవర్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి

ప్రారంభించే దిశగా రాష్ట్ర సర్కారు ప్రణాళికలు

సెప్టెంబరు నాటికి రెండు యూనిట్లు సిద్ధం

ఇప్పటికే జాప్యం వల్ల విపరీత భారం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :

తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి ప్రారంభించే దిశగా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. వైటీపీఎస్‌లో కీలకమైన ప్రజాభిప్రాయసేకరణ కూడా పూర్తవడంతో పనులు వేగవంతం చేయాలని జెన్‌కో ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ లో సెప్టెంబరు నాటికి రెండు యూనిట్లు సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత బీఆర్ఎస్ » మిగితా 2లో

ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

- భక్తులతో నిండిన ట్రాక్టర్ ట్రాలీ బోల్తా
- 7మంది చిన్నారులు సహా 15 మంది మృతి

9

ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్ జిల్లాలో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. పాటియాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని దర్యాగంజ్‌లోని చెరువులో భక్తులతో నిండిన ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 7 మంది చిన్నారులు సహా 15 మంది మరణించారు. ట్రాక్టర్ ట్రాలీలో 30 మందికి పైగా భక్తులు ప్రయాణిస్తున్నారు. ఈ భక్తులందరూ మాఘ పౌర్ణమి సందర్భంగా కదర్‌గంజ్ ఘాట్‌లో గంగాస్నానం చేసి తిరిగి వస్తున్నారు. ట్రాక్టర్ ట్రాలీ ఒక్కసారిగా బోల్తా పడడంతో పెను ప్రమాదం జరిగింది. ఘటన అనంతరం డీఎం, ఎస్పీ సహా సీనియర్ పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు ప్రారంభించారు. పోలీసులు, స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రమాద స్థలం నుంచి మృతదేహాలను బయటకు తీశారు. సహాయక చర్యలు చేపట్టారు.

స్పెయిన్‌లో భారీ అగ్నిప్రమాదం

- 14 అంతస్తుల భవనంలో అంటుకున్న మంటలు
- నలుగురు మృతి, మరో 20 మంది గల్లంతు

2

జీఓ 317పై కమిటీ

- ఉద్యోగుల సర్దుబాటులో ప్రభుత్వం కీలక నిర్ణయం
- మంత్రి రాజనర్సింహా నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :

రాష్ట్రంలోని కొత్త జోన్లు, కొత్త జిల్లాలకు అనుగుణంగా ఉద్యోగుల సర్దుబాటు కోసం ఉద్దేశించిన జిఒ 317పై ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల అభ్యంతరాల దృష్ట్యా మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్‌గా మంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యులుగా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఉన్నారు. 2021లో ఇచ్చిన జిఒ 317, జిఒ 46పై వివాదాలు, ఉద్యోగుల అభ్యంతరాలపై కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి సిఫార్సులు చేయనుంది. దామోదర రాజనర్సింహ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలు మరో ఇద్దరు మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉండనున్నారు. వీరు జీవో 317తో తలెత్తిన సమస్యలు, ఉద్యోగులు-ఉపాధ్యాయుల అభిప్రాయాలు, గతంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలు, ఇకపైన ఆ సమస్యలను అధిగమించ డానికి తీసుకోవాల్సిన చర్యలు.. ఇలాంటి అనేక అంశాలను స్టడీ చేసి తగిన సిఫారసులతో పాటు నివేదిక సమర్పించాలని ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం జారీ చేసిన జీవో (నెం. 292)లో పేర్కొన్నారు. ఈ కమిటీకి సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి » మిగితా 2లో

దేశానికి కాంగ్రెస్ చేసిందేమి లేదు

భాజాపా ప్రభుత్వం వల్లే దేశాభివృద్ధి

కాంగ్రెస్ అంటేనే బంధుప్రీతి, అవినీతి

- ఛత్తీస్‌ఘడ్‌లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఘాటుగా విమర్శలు చేసిన ప్రధాని మోడీ
- ప్రారంభానికి సిద్ధమైన మంగళగిరి ఎయిమ్స్
- నేడు జాతికి అంకితం చేయనున్న ప్రధాని మోడీ

రాయ్‌పుర్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :

కాంగ్రెస్ అంటేనే బంధుప్రీతి, అవినీతి, బుజ్జగింపులకు కేరాఫ్ అని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశాభివృద్ధి ఆ పార్టీ అజెండాలోనే లేదని తూర్పార బట్టారు. ఆ పార్టీ విధానాల్లో మార్పు రాలేదన్నారు. విక్షిత్ భారత్, విక్షిత్ ఛత్తీస్‌గఢ్ కార్యక్రమంలో భాగంగా మోదీ రాయ్‌పుర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రూ.34,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'స్వాతంత్ర్యం వచ్చాక చాలా ఏళ్లు కాంగ్రెస్ పాలించింది. ఆ పార్టీ దృష్టి ఎప్పుడూ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం పైనే ఉండేది. దేశ » మిగితా 7లో

వీఐపీల డ్రైవర్లకు ఫిట్‌నెస్ పరీక్ష

డ్రైవ్ టెస్ట్ చేస్తాం.. రవాణాశాఖనే సుమోటో

ప్రజాప్రతినిధుల రక్షణ ప్రభుత్వ బాధ్యత

మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన

2

కాంగ్రెస్‌తో 'ఆప్'గ్రేడ్

- ఢిల్లీ, గుజరాత్‌లలో కలిసి పోటీకి అంగీకారం
- ఢిల్లీలో 3 సీట్లకు కాంగ్రెస్ పోటీ
- గుజరాత్‌లో ఆప్‌కు రెండు సీటు కేటాయింపు
- యూపీలో ఎస్పీ 63, కాంగ్రెస్ 17 చోట్ల పోటీ

7

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
25 ఫిబ్రవరి 2024

రైతుల వివరాలు విదేశీ కంపెనీల చేతుల్లో..

అమ్ముకోవటం విస్మయం కలిగించిందని సీఎం అన్నారు. మన రికార్డులన్నీ వాళ్ల దగ్గరే ఉన్నందున.. విలువైన భూములను పేర్లు మార్చుకోలేదని గ్యారంటీ ఏముందని ప్రశ్నించారు. కొన్ని సందర్భాల్లో అర్ధరాత్రి కూడా భూముల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయని, ధరణి పోర్టల్ నిర్వహణపై నియంత్రణ, అజమాయిషీ లేదా.. అని సీఎం రెవిన్యూ అధికారులను ప్రశ్నించారు.

ఆర్ఓఆర్ చట్టంలోనే లోపాలు..

2020లో అమల్లోకి వచ్చిన ఆర్వో ఆర్ చట్టంలోనే లోపాలున్నాయని ధరణి కమిటీ ముఖ్యమంత్రికి నివేదించింది. గత ప్రభుత్వం మూడు నెలల్లో హడావుడిగా చేపట్టిన రెవిన్యూ రికార్డుల నవీకరణతో నే కొత్త చిక్కులు వచ్చాయని చెప్పారు. ఆ రికార్డులనే ధరణికి ప్రామాణికంగా తీసుకోవటంతో భూముల సమస్యలు, భూముల రికార్డుల వివాదాలు ఎక్కువయ్యాయని అన్నారు. దీంతో లక్షలాది సమస్యలు ఉత్పన్నమయ్యాయని, కనీసం పేర్లలో చిన్న అక్షర దోషాలున్నా సరిదిద్దుకునేందుకు జిల్లా కలెక్టర్ దాకా వెళ్లాల్సి వస్తుందని వివరించారు. దాదాపు 35 మాడ్యుల్స్ ద్వారా ధరణి డేటాలో ఉన్న తప్పులను సవరించుకునేందుకు రెవిన్యూ శాఖ అవకాశం ఇచ్చిందని, కానీ ఏ మాడ్యుల్లో దేనికి దరఖాస్తు చేసుకోవాలనే అవగాహన

లేకపోవటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని కమిటీ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. లక్షలాది దరఖాస్తులు ఇప్పటికే తిరస్కరణకు గురయ్యాయని, ఒక్కో తప్పును సవరించుకోవాలంటే వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించాల్సి ఉండటం రైతులకు భారంగా మారిందని తెలిపారు. అటు రిజిస్ట్రేషన్ల శాఖ, ఇటు రెవిన్యూ శాఖల మధ్య సమన్వయం లోపంతో నిషేధిత జాబితాలో ఉన్న భూముల క్రయ విక్రయాలు కూడా జరుగుతున్నాయని చర్చ జరిగింది.

అవసరమైతే కొత్త చట్టం : సీఎం రేవంత్ రెడ్డి

ధరణి డేటాను వ్యవసాయ శాఖ ప్రామాణికంగా తీసుకొని రైతు బంధు ఖాతాలో జమ చేయటంతో ఇప్పటికే కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగమైందని చర్చ జరిగింది. ఇప్పుడున్న ధరణి లోపాలను సవరించాలంటే చట్ట సవరణ చేయటం లేదా కొత్త ఆర్వోఆర్ చట్టం చేయటం తప్ప గత్యంతరం లేదని కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి నివేదించారు. కమిటీ ఇచ్చే తుది నివేదిక ఆధారంగా రైతుల భూముల రికార్డుల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ముఖ్యమంత్రి అన్నారు. అవసరమైతే చట్ట సవరణ చేయటం లేదా.. కొత్త చట్టం తీసుకు వచ్చే అంశాలను పరిశీలిద్దామని చెప్పారు. ధరణిలో ఇప్పుడున్న లోపాలు, సమస్యలన్నీ మరింత లోతుగా అధ్యయనం చేయాలని కమిటీకి సూచించారు. ఎలాంటి భూవివాదాలు, కొత్త చిక్కులు లేకుండా దోషరహితమైన భూముల రికార్డులను నిర్వహించాలని సీఎం అన్నారు. అందుకు అవసరమైన పరిష్కారాలను కూడా అన్వేషించాలని కమిటీని కోరారు. ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలతో ఇప్పుడున్న లోపాలకు అడ్డుకట్ట వేయటంతో పాటు కొత్త సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. ఇప్పుడున్న పెండింగ్ దరఖాస్తుల్లో సాధ్యమైన వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :

ధరణిలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మార్చి మొదటి వారంలోనే అన్ని మండల తహసీల్దార్ ఆఫీసుల్లో వీటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. ధరణి కమిటీ చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకొని, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన విధి విధానాలను రూపొందించాలని రెవిన్యూ శాఖను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ధరణిలో 2.45 లక్షల పెండింగ్ కేసులున్నాయి. వీటిని వెంటనే పరిష్కరించేందుకు ఏమేం మార్గాలున్నాయని ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే వీటిని పరిష్కరించేందుకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని, మార్చి మొదటి వారంలోనే అందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులకు సూచించారు. శనివారం సచివాలయంలో ధరణి కమిటీతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ధరణి కమిటీ సభ్యులు ఎం. కోదండరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ రేమండ్ పీటర్, అడ్వకేట్ సునీల్, రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ బి.మధుసూదన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శేషాద్రి, ప్రాజెక్టు డైరెక్టర్ సీఎంఆర్వో వి.లచ్చిరెడ్డి, ఉన్నతాధికారులు సమావేశంలో ఉన్నారు. 2020లో అమల్లోకి వచ్చిన ఆర్వో ఆర్ చట్టంలోనే లోపాలున్నాయని ధరణి కమిటీ ముఖ్యమంత్రికి నివేదించింది. అప్పుడు కేవలం మూడు నెలల్లో హడావుడిగా చేపట్టిన భూ సమగ్ర సర్వేతోనే కొత్త చిక్కులు వచ్చాయని చెప్పారు. ఆ రికార్డులనే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకోవటంతో భూముల సమస్యలు, భూముల రికార్డుల వివాదాలు ఎక్కువయ్యాయని అన్నారు. దీంతో లక్షలాది సమస్యలు ఉత్పన్నమయ్యాయని, కనీసం పేర్లలో చిన్న అక్షర దోషాలున్నా సరిదిద్దుకునేందుకు జిల్లా కలెక్టర్ దాకా వెళ్లాల్సి వస్తుందని వివరించారు. భూముల రికార్డులపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలతో ఇప్పుడున్న లోపాలకు చెక్ పెట్టడంతో పాటు కొత్త సమస్యలు రాకుండా ఉండాలని సీఎం కమిటీ సభ్యులను అప్రమత్తం చేశారు. కమిటీ ఇచ్చే తుది నివేదిక ఆధారంగా శాశ్వత పరిష్కారానికి నిర్ణయం తీసుకుందామని చెప్పారు. అప్పటివరకు తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలపై దృష్టి పెట్టాలని సీఎం అన్నారు.

వీఐపీల డ్రైవర్లకు ఫిట్ నెస్ పరీక్ష నిర్వహిస్తాం

డ్రైవ్ టెస్ట్ చేస్తాం.. రవాణాశాఖనే సుమోటో
ప్రజాప్రతినిధుల రక్షణ ప్రభుత్వ బాధ్యత
మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన

హైదరాబాద్,ఫిబ్రవరి24 (జనంసాక్షి)

ఎమ్మెల్యే లాస్య నందిత యాక్సిడెంట్ కేసు నేపథ్యంలో, రాష్ట్రంలో వీఐపీల వద్ద పనిచేసే డ్రైవర్లకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. ప్రముఖ వ్యక్తులకు సంబంధించిన డైవర్లకు డ్రైవ్ టెస్ట్ చేస్తామని, దీనికి సంబంధించి రవాణాశాఖనే సుమోటోగా తీసుకుని చేస్తుందన్నారు. లాస్య నందిత మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన.. వీఐపీల దగ్గర ఉన్న డ్రైవర్లకు ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రజాప్రతినిధుల రక్షణ ప్రభుత్వ బాధ్యత అని ఆయన చెప్పుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో పాటు.. ప్రజాప్రతినిధుల దగ్గర ప్రస్తుతం ఉన్న డ్రైవర్లుగా పని చేస్తున్న వారికి ఫిట్‌నెట్ పరీక్షలు నిర్వహించినున్నట్లు ఆయన వెల్లడించారు. మహాలక్ష్మి పథకం కింద కండక్టర్లు అనవసరంగా టికెట్లు కొడితే.. కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో రెగ్యులర్‌గా 44లక్షల ప్రయాణాలు జరిగితే.. ఇప్పుడు 55లక్షల మందికి పైగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆటో డ్రైవర్లుగా పని చేస్తున్న వారికి రూ. 12వేల హామీ ఇచ్చామని మంత్రి పొన్నం గుర్తు చేశారు. దాన్ని ఖచ్చింగా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మరో వైపు కులగణనపై అధికారులకు శిక్షణ ఇస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిహార్ లో 2.5 లక్షల మంది అధికారులను కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్కొక్కరికి 150 ఇండ్లు అప్పజెప్పాలరని పేర్కొన్నారు. ఇక్కడ కూడా ఇళ్లను బట్టి.. అధికారులను నియమిస్తామన్నారు. నోడల్ ఆఫీసర్ గా బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంటు ఉంటుందన్నారు.

ఆ టైంలో నా మైండ్ బ్లాంక్‌అయ్యింది : డ్రైవర్ ఆకాశ్

ఎమ్మెల్యే లాస్య నందిత డ్రైవర్, పీఏ ఆకాష్ నుంచి పటాన్ చెరు పోలీసులు స్టేట్ మెంట్ తీసుకున్నారు. మెజిస్ట్రేట్ ముందు స్పృహలో ఉన్న ఆకాశ్ వాగ్మూలం ఇచ్చాడు. దానిలో ఏముందుంటే.. " దర్గా నుంచి హైదరాబాద్ చేరుకుని.. లాస్య కారులో ఉన్న అక్క కూతుర్ని వేరే కారులోకి ఎక్కించాం. లాస్య తినడం కోసం వెళ్తామని చెప్పడంతో హోటల్స్ వెతుక్కుంటూ వెళ్లాం. ప్రమాదం ఎలా జరిగిందో అర్థం అవ్వట్లేదు. ఆ టైంలో నా మైండ్ బ్లాంక్‌అయ్యింది." అని ఆకాష్ పేర్కొన్నారు. నిద్ర మత్తులోకి జారిపోవడం వల్లనే ప్రమాదం జరిగినట్లు ఆకాష్ చెప్తున్నప్పటికీ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఢిల్లీ శివారులోనే రైతుల మకాం

వంటావార్పూ అక్కడే

న్యూఢిల్లీ,ఫిబ్రవరి24(జనంసాక్షి) :దేశ రాజధాని ఢిల్లీలో రైతుల ఆందోళన కొనసాగుతున్నది. తమ డిమాండ్లు నెరవేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని రైతులు తెగేసి చెబుతున్నారు. ఈ మేరకు ఢిల్లీ, పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోనే వారు మకాం వేశారు. కావాల్సిన సరుకు సరంజామా అంతా వెంట తెచ్చుకుని బార్డర్‌లో తిష్టవేశారు. అక్కడే వండుకుతిని గుడారాల్లో తలదాచుకుంటున్నారు. తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, గత ఆందోళనల సందర్భంగా తమపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని రైతులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. రైతుల డిమాండ్లపై చర్చకు సిద్ధమంటూనే ప్రభుత్వం తాత్సారం చేస్తూ వస్తున్నది. గతంలోలా రైతులు రాజధానిలోకి చొచ్చుకురాకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. పంజాబ్-హర్యానా నడుమగల శంభు సరిహద్దులో రైతులు వాహనాలపైనే వంట చేసుకుంటున్న దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

మావోయిస్టు మృతి

కొత్తగూడెం : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య శనివారం ఉదయం ఎదురు కాల్పులు జరిగాయి. ఘటనలో ఓ మావోయిస్టు మృతిచెందాడు సుక్మా ఎస్పీ కిరణ్ చౌహాన్ తెలిపిన వివరాల ప్రకారం.. దండకారణ్యంలోని బుర్కలంక అటవీప్రాంతంలో డీఆర్జీ భద్రతా దళాలు శుక్రవారం రాత్రి నుంచి మావోయిస్టుల కోసం సెర్చింగ్ ఆపరేషన్ చేపడుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం జవాన్లకు మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులు ప్రారంభించారు. ఇరువర్గాల మధ్య సుమారు 20 నిమిషాల పాటు భీకర పోరు జరిగింది. జవాన్ల ధాటికి తాళలేని మావోయిస్టులు కాల్పులు జరుపుతూ దట్టమైన అటవీప్రాంతంలోకి పరారయ్యారు. అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో ఓ మావోయిస్టు మృతదేహాన్ని గుర్తించారు..

పాక్‌పై ఇరాన్ సైనిక దాడి

రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం

బలూచిస్తాన్,ఫిబ్రవరి24(జనంసాక్షి) :ఇరాన్ పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాకిస్థాన్ భూభాగంలో ఇరాన్ మరోసారి సైనిక దాడిని నిర్వహించింది. ఇరాన్ సైనిక బలగాలు ప్రముఖ 'జైష్ అల్ అదిల్' మిలిటెంట్ గ్రూప్ కమాండర్ ఇస్మాయిల్ షాబక్ష్ పాకిస్తాన్ భూభాగంలో హత్య చేశారు. 2012లో ఏర్పాటైన 'జైష్ అల్ అదిల్'ని ఉగ్రవాద సంస్థగా ఇరాన్ గుర్తించింది. గత కొన్ని సంవత్సరాలుగా 'జైష్ అల్ అదిల్' ఇరాన్ భద్రతా దళాలపై అనేక దాడులు జరిపింది. డిసెంబరులో సిస్తాన్-బలూచిస్తాన్‌లోని ఒక పోలీసు స్టేషన్‌పై దాడి చేయగా. దాదాపు 11 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయినందుకు జైష్ అల్-అద్ల్ బాధ్యత వహించాడు. ఉగ్రవాద సంస్థకు చెందిన రెండు ప్రధాన కార్యలయాలపై డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ పాకిస్థాన్‌లు పరస్పరం దాడులు జరిపాయి. పాకిస్తాన్, ఇరాన్‌ల భద్రతా సహకారాన్ని విస్తరించడానికి పరస్పరం అంగీకరించాయని ఓ మీడియా సంస్థ నివేదించింది. ఈ ఒప్పందాన్ని పాక్ విదేశాంగ మంత్రి జలీల్ అబ్బాస్ జిలాండ్ అతని ఇరాన్ కౌంటర్ హొస్సేన్ అమీర్-అబ్దొల్లాహియాన్ పాక్ విదేశాంగ కార్యాలయంలో ప్రకటించారు. ఇరు దేశాలు తమ తమ ప్రాంతాల్లో ఉగ్రవాదంపై పోరుకు, పరస్పరం ఆందోళనలు తగ్గించుకునేందుకు అంగీకరించాయని ఆయన తెలిపారు. హమాస్-ఇజ్రాయెల్ ఘర్షణలతో ఇప్పటికే ఉద్రిక్త సమయంలో ఇరాన్-పాక్ ఘర్షణపై ఆందోళన వ్యక్తమవుతోంది.

తెలంగాణ ప్రభుత్వము
రోడ్లు & భవనాల శాఖ కార్యాలయము
ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

NIT No : DB/BNG/13/2023 -24/1 to 3 Dt:22-02-2024

అత్యవసర మరమ్మత్తులు మరియు RSIతో కూడిన 5 పనులకు రూ. 79.70 లక్షల అంచనా విలువతో చేపట్టుటకు ఆసక్తి కలిగిన వారి నుంచి దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. తేదీ 24-02-2024 నుంచి 02-03-2024 మ. 3-30 గంటల వరకు e- ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు. సాంకేతిక టెండర్ షెడ్యూలు తెరుచు తేదీ మరియు సమయం 02-03-2024 మ.3-30లకు. టెండర్ షెడ్యూల్ తెరచు తేది మరియు సమయం 02-03-2024 మ. 4-00 గంటలకు.

పూర్తి వివరములకు https //tender.telangana. gov. in వెబ్సైట్ చూడండి.

సం/- కార్యనిర్వహణ ఇంజనీర్ (ఆర్ & బి) సెంట్రల్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్.
DIPR No.2806-DP/CL/ADVT/1/2023-24

చైనాలోని భవనంలో అగ్నిప్రమాదం

- **15 మంది మృతి, 44 మంది గాయాలు**

నాన్జింగ్,ఫిబ్రవరి24(జనంసాక్షి)

:చైనాలోని నాన్జింగ్ నగరంలో ఓ బహుళ అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 15 మంది చనిపోగా.. 44 మందికి కాలిన గాయాలయ్యాయి. నివాస సముదాయంలోని మొదటి అంతస్తులో మంటలు చెలరేగినట్టు ప్రాథమిక సమాచారం. ఆ అంతస్తులో ఎలక్ట్రిక్ బైక్‌లు ఉన్నట్టు తెలుస్తోంది. 80 లక్షల మంది జనాభా కలిగిన నాన్జింగ్ షాంఘైకి 260 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. చైనాలో స్నైసాపర్ అగ్నికీలల్లో చిక్కుకోవడం, దట్టమైన నల్లటి పొగ కమ్మేయడం వంటి దృశ్యాలతో కూడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.మంటలు పై అంతస్తులకు కూడా వ్యాపించాయి. ఎట్టకేలకు అగ్నిమాపక సిబ్బందిని ఆ మంటలను అదుపు చేయగలిగారు. చైనాలో తరచూ అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భద్రతా ప్రమాణాలు లోపించడం, అధికారుల అజమాయిషీ లేకపోవడమే ఇందుకు కారణాలుగా చెబుతున్నారు. సెంట్రల్ సిటీ జిన్యులోగత నెలలో ఓ స్టోర్ తగలబడి పదుల సంఖ్యలో చనిపోయారు. బేస్‌మెంట్‌లో కార్మికులు నిబంధనలకు విరుద్ధంగా మంట రాజేయడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అంతకు కొన్నిరోజుల ముందే హెనన్ ప్రావిన్స్‌లో ఓ స్కూల్‌లో మంటలు రేగి 13 మంది విద్యార్థులు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఎలక్ట్రిక్ హీటింగ్ పరికరం వల్ల ఆ మంటలు వ్యాపించినట్టు అప్పట్లో వార్తలొచ్చాయి. నవంబర్ 26న షాంక్జి ప్రావిన్స్‌లో ఓ బొగ్గు కంపెనీ ఆఫీసులో అగ్నిప్రమాదంలో డజన్ల సంఖ్యలో కాలిబూడిదయ్యారు. అక్టోబర్ నెలలో బార్బిక్యూ రెస్టారెంట్‌లో సంభవించిన పేలుడు 31 మందిని బలి తీసుకుంది. నిరుడు ఏప్రిల్‌లో బీజింగ్‌లో అగ్నిప్రమాదానికి 29 మంది బలయ్యారు

రాజకీయాల్లో ఈశ్వరీబాయి ముద్ర

- **ఆమె చిత్రపటానికి సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు**

హైదరాబాద్ (జనంసాక్షి) : అంబేద్కర్ స్ఫూర్తిగా ఆ రోజుల్లోనే రాజకీయాల్లో ఈశ్వరీబాయి తనదైన ముద్ర వేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ, ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో శనివారం జె. ఈశ్వరీబాయి 33వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈశ్వరీబాయి రాజకీయాల్లో రాణిస్తూనే గీతారెడ్డిని డాక్టర్ చదివించారని అన్నారు. ప్రతీ పురుషుడి విజయం వెనకాల ఒక మహిళ ఉన్నట్లు, గీతక్క ప్రతీ విజయంలో డాక్టర్ గారి సహకారం ఉందన్నారు.

ఈ కార్యక్రమానికి హాజరు కావడం నేను బాధ్యతగా భావించానన్నారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ గా గీతారెడ్డి క్రియాశీలకంగా పనిచేశారని, ఆరోగ్య సమస్యలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్ గా పనిచేశారని అందుకే గీతక్క ఇంచార్జిగా ఉన్న నల్లగొండ జిల్లాలో అత్యధిక సీట్లు గెలిచామని ముఖ్యమంత్రి అన్నారు. గీతక్క లాంటి వారు మంత్రివర్గంలో లేక పోవడం ఒక లోటు అని, మంచికి, చెడుకు ఎప్పటికీ మాకు అండగా ఉండే అక్క.. గీతక్క అని అన్నారు. ఏ అవకాశం ఉన్నా వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామినిచ్చారు. అంతకు ముందు సిఎం, మంత్రులు ఈశ్వరీబాయి చిత్రపటానికి నివాళు లర్పించారు.

యాదాద్రి పవర్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి

ప్రభుత్వం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్ల పాలెంలో చేపట్టిన యాదాద్రి అల్ట్రా మెగా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్తు కేంద్రం' ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలోనే వైటీపీఎస్ పనుల పురోగతిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటించి పరిశీలించారు. వైటీపీఎస్‌లో ఉన్నతాధికారులతో ముగ్గురు మంత్రులు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్లాంటులో యూనిట్ల నిర్మాణం ఏ స్థాయిలో ఉంది? బొగ్గును తరలించడానికి రైల్వే ట్రాక్ నిర్మాణం పురోగతి, గతంలో చేసిన పనుల్లో బిల్లుల చెల్లింపులు, రానున్న కాలంలో జరగాల్సిన పనులు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో అక్రమాలు, ఇంకా ఎంత మందికి పరిహారం ఇవ్వాల్సి ఉంది.. తదితర అంశాలపై మంత్రులు జెన్‌కో అధికారులతో సమీక్షించారు. ప్రపంచ వ్యాప్తంగా గ్రీన్ పవర్, రెనేవబుల్ ఎనర్జీ వైపు వెళ్తుంటే గత పాలకులు థర్మల్ పవర్ వైపు దృష్టిసారించారనీ మంత్రులు చెప్పారు. పలు కారణాలతో ఇప్పటికే జాప్యం చేయడం మూలంగా రాష్ట్ర ఖజానాపై మోయలేని భారం పడిందని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. ప్లాంట్ లో ఉన్న స్కిల్ అండ్ స్కిల్డ్ కలిగిన వారికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులు ఆదేశించారు. ప్లాంట్ కు అవసరమైన మెటీరియల్ సరఫరా, రైల్వే, రోడ్డు రవాణా వ్యవస్థలు శరవేగంగా అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైతే ప్రత్యేక పాలసీ తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గ్రీన్ పవర్ ప్రాజెక్టు పూర్తయి అందుబాటులోకి వచ్చేటప్పటికీ యాదాద్రి థర్మల్ స్టేషన్‌లో విద్యుత్ ఉత్పత్తి జరగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్లాంట్ పనులు చేపట్టిన ప్రభుత్వరంగ సంస్థ బీహెచ్ఈఎల్ తొలి దశ పూర్తి చేయకపోతే సంస్థకు చెడ్డ పేరు వస్తుందని విషయాన్ని ఆ సంస్థ అధికారులు గుర్తించాలని అన్నారు. ప్రాజెక్టు పనులకు సంబంధించి నిర్లక్ష్యం, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే ఉపేక్షించేది లేదని భట్టి హెచ్చరించారు.

జీవో 317పై కమిటీ

కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు జీవో 317 ద్వారా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారితోనూ, వారు పనిచేస్తున్న హెచ్ఓడీలతోనూ, సంబంధిత డిపార్టుమెంట్ల సెక్రటరీలతోనూ చర్చించనున్నది. కేబినెట్ సబ్ కమిటీ నిర్వహించే సమావేశాలకు ఆయా డిపార్టుమెంట్ల సెక్రటరీలు, హెచ్ఓడీలు హాజరై సహకారం అందించాల్సిందిగా చీఫ్ సెక్రటరీ తాజా జీవోలో స్పష్టం చేశారు. దాదాపు రెండున్నరేండ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సబ్ కమిటీ పరిగణనలోకి తీసుకుని వాటికి పరిష్కారం చూపడం లక్ష్యంగా పనిచేయనున్నది. ఈ కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చే నివేదికకు
అనుగుణంగా ప్రభుత్వం తదుపరి కార్యాచరణపై దృష్టి పెట్టనున్నది.

ముస్లిం వివాహ చట్టం రద్దు..

- **యూసీసీ అమలు దిశగా అసోం ప్రభుత్వం**
- **అసోం ముస్లిం వివాహ, విడాకుల నమోదు చట్టం-1935'ని రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయం**
- **రాష్ట్రంలో రద్దు కానున్న 94 ముస్లిం రిజిస్ట్రార్లు..**
- **ఒక్కొక్కరికి రూ.2 లక్షల పరిహారం ఇస్తామని ప్రభుత్వం వెల్లడి**

తిరుపతి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి): యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) అమలు దిశగా అడుగులు వేస్తున్న బీజేపీ పాలిత అసోం సంచలన నిర్ణయం తీసుకుంది. 'అసోం ముస్లిం వివాహ, విడాకుల నమోదు చట్టం-1935'ని ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు అసోం క్యాబినెట్ శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం హిమంత బిస్వ శర్మ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. యూసీసీని సాధించే దిశగా ఇదొక ముందడుగు అని ఆ రాష్ట్ర మంత్రి జయంత మల్లబారువా వ్యాఖ్యానించారు. కేబినెట్ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. యూసీసీ అమలు దిశగా అడుగులు వేస్తున్నామని సీఎం బిశ్వశర్మ ఇటీవలే ప్రకటించారని, ఈ ప్రయత్నంలో చాలా ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నామని ఆయన వ్యాఖ్యానించారు.అసోం ముస్లిం వివాహ, విడాకుల నమోదు చట్టం-1935ని రద్దు చేశామని, ఈ చట్టం కింద రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికీ 94 రిజిస్ట్రార్లు పనిచేస్తున్నారని మంత్రి జయంత మల్లబారువా తెలిపారు. వారంతా శుక్రవారం నుంచే రద్దు అయ్యారని వెల్లడించారు. ఇకపై ముస్లింల వివాహాలు, విడాకుల నమోదును జిల్లా కమిషనర్, జిల్లా రిజిస్ట్రార్ చేపడతారని మంత్రి వివరించారు. 94 మంది ముస్లిం రిజిస్ట్రార్లకు ఒక్కొక్కరికి ఏకమొత్తంలో రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇచ్చి విధుల నుంచి తొలగిస్తామని ప్రకటించారు. కాగా ముస్లిం వివాహ చట్టం రద్దుతో సంబంధిత అంశాలు ప్రత్యేక వివాహ చట్టం పరిధిలోకి రానున్నాయి.

స్పెయిన్‌లో భారీ అగ్నిప్రమాదం

వాలెన్సియా, ఫిబ్రవరి24(జనంసాక్షి) : స్పెయిన్‌లోని వాలెన్సియాలో 14 అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందినట్టుగా తెలిసింది. మరో 20 మంది గల్లంతయ్యారు.. వారందరి పరిస్థితి ఎలా ఉందోనని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. నివేదికల ప్రకారం, గురువారం సాయంత్రం 5.30 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో దాదాపు 350 మంది భవనంలో చిక్కుకుపోయారు. మంటల నుండి తప్పించుకోవడానికి చాలా మంది అనేక అంతస్తుల నుండి దూకారు. ఈ క్రమంలో భవనం కింద నెట్‌లను ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే టవర్ అంతటా మంటలు వ్యాపించినట్టుగా సమాచారం. ఆ బిల్డింగ్ నుంచి మరో బిల్డింగ్‌కు మంటలు వ్యాపించాయి. ప్రస్తుతం ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వైరల్ అవుతున్న వీడియోలో ఒక వ్యక్తి బహుళ అంతస్తుల నుండి కిందకు దూకడం కనిపించింది. అతనిని రక

రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండేలా
దీవించండి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్
- మేడారంలో వనదేవతలకు నిలువెత్తు బంగారం సమర్పణ

మేడారం, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండేలా దీవించాలని ఆదివాసీ వనదేవతలను కోరినట్లు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ జాతర తెలంగాణ కుంభమేళా మేడారంలో శనివారం సమ్మక్క-సారలమ్మల గద్దెలను దర్శించుకుని నిలువెత్తు బంగారం సమర్పించారు. బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే దేశం గర్వించదగ్గ స్థాయిలో మేడారం జాతరను నిర్వహిస్తామని అన్నారు. మేడారం జాతరలో బీఎస్పీ జిల్లా నాయకులు, ఆదివాసీ పూజారులు గిరిజన సాంప్రదాయ పద్ధతిలో ఆయనకు కండువా కప్పి ఘన స్వాగతం పలికారు. అనంతరం గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల వద్దకు వెళ్లి మొక్కులు సమర్పించారు.

తహసీల్దార్ శైలజపై విచారణేదీ?

- అక్రమాల పై చర్యలు మరిచారా..?
- 58, 59 జీవో అక్రమాల్లో సూత్ర ధారిని వదిలేస్తారా..?
- బీఆర్ఎస్ తొత్తుకు మళ్లీ పోస్టింగ్
- సీఐకి ఓ న్యాయం.. తహసీల్దార్‌కు మరో న్యాయమా?

ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌గా పని చేసి అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిన మేదరమెట్ల శైలజపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం మరిచింది. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కు తొత్తుగా వ్యవహరిస్తూ అనేక భూ కబ్జాలకు అక్రమ పద్ధతిలో అనుమతులు ఇచ్చిన శైలజాపై చర్యలు తీసుకోవాలని నగరంలోని అనేక మంది ప్రజలు డిమాండ్ చేసారు. శైలజా చేసిన అనేక తప్పుల వల్ల సామాన్య ప్రజలు నష్టపోయారు.

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):

డబుల్ బెడ్ రూంల నుంచి మొదలుకొని అన్ని అంశాల్లో అవినీతికి పాల్పడిన శైలజపై సీబీసీఐడీ విచారణ జరిపించాలనే డిమాండ్ ఉంది. అనేక మంది భూములకు తప్పుడు రికార్డులు సృష్టించడమే కాకుండా వివాదాస్పదంగా మార్చి వాటిని పరిష్కరిస్తానని లక్షల్లో వసూళ్లకు పాల్పడ్డారు. అల్లీపురం రోడ్డులో ఒక ప్రముఖ డాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా వేసిన వెంచర్లో అనుమతులు ఇవ్వడం కోసం భారీగా ముడుపులు తీసుకున్న విషయం అందరికి తెలిసిందే. బీఆర్ఎస్‌లోని కొందరు కార్పోరేటర్లు భూ ఆక్రమణలు చేయడానికి తహసీల్దార్ శైలజనే కారణం. 58, 59 జీవో కింద కోట్లు విలువ చేసే భూములను అక్రమంగా కట్టబెట్టింది. విచారణ అధికారిగా ఉండి తప్పుడు సమాచారమిచ్చి ఉన్నతాధికారులను బురిడీ కొట్టించింది. ఏసీబీ అధికారుల హిట్ లిస్ట్‌లో శైలజ పేరు ఉండటం గమనార్హం. ఓటరు లిస్ట్ తప్పుల తడకగా మార్చిందీ శైలజనే అని సమాచారం. దొంగ ఇంటి నంబర్లు వేసి భూములు రెగ్యులరైజ్ చేసింది. జిల్లా కలెక్టర్‌కు ఉన్నంత స్థాయిలో తనకూ పవర్స్ ఉన్నాయని పైరవీలు చేసింది. మాజీ మంత్రికి బంధువని చెప్పుకుంటూ చేయని తప్పు లేదు. మాజీ మంత్రి అండతో జిల్లా కలెక్టర్ ని ఎదిరించే స్థాయికి ఎదిగింది. ఎన్ని తప్పులు తన దృష్టికి వచ్చినా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోకుండా మాజీ మంత్రి అడ్డుకున్నారని సమాచారం. శైలజ విధుల్లో కంటే బీఆర్ఎస్ పార్టీ నాయకుల భూములు క్రమబద్ధీకరణ చేయడం కోసం వీధుల్లో ఎక్కువ సమయం గడిపేది. శైలజ నిర్లక్ష్యం వల్ల అనేక మంది లోకల్ ఏరియా, క్యాస్ట్, ఇన్‌కం, క్రిమిలేయర్‌తోపాటు తదితర సర్టిఫికెట్ల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటనలు అనేకమున్నాయి. శైలజ రమణ గుట్ట ప్రాంతంతో పాటుగా తన బంధుగణానికి క్రమబద్ధీకరణ చేసి వారిని బినామీగా పెట్టిందని సమాచారం. తన సమీప బంధువులు ఖమ్మంలో ఉన్న అనేక విలువైన భూములను కబ్జా చేసారని ఆరోపణలున్నాయి. శైలజా పై చర్యలు తీసుకోవాల్సిన సమయంలో ఆమెకు ఇనుగుర్తి తహసిల్దార్ గా పోస్టింగ్ ఇవ్వడం తీవ్ర వివాదస్పదంగా మారింది. ఇనుగుర్తి చిన్న మండలం అయ్యిందని, గార్లకు బదిలి చేయాలని నాయకులు, జిల్లా కలెక్టర్ వద్దకు తరుచూ వెళ్లి కలిసేది. ఎన్నికల సమయంలో ఆమెను జిల్లా నుంచి బదిలీ చేయకుండా జిల్లా ఎన్నికల అధికారి బాధ్యతలు నిర్వహించిన జిల్లా కలెక్టర్‌పై మాజీ మంత్రి పువ్వాడ ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. శైలజను ఆర్డీఓ కార్యాలయంలో ఉంచి షాడో ఆర్డీఓ బాధ్యతలు అప్పగించారు. ఆర్డీఓ ఏదైనా సంతకం పెట్టాలన్న శైలజా అనుమతి తప్పనిసరిగా మారింది. అనేక మంది ఆర్డీఓని కలవకుండా శైలజని ఇంటి వద్ద కలిసి ప్రసన్నం చేసుకుంటేనే పనులు సాఫీగా సాగేవని సమాచారం. శైలజా ఆర్డీఓకు తల నొప్పిగా మారిందని ఫిర్యాదులు రావడంతో కలెక్టరేట్‌కు బదిలీ చేసారు. ఆ తర్వాత 58, 59 జీవోల ద్వారా అక్రమ పద్ధతిలో క్రమబద్ధీకరణ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైన సమయంలో క్రమబద్ధీకరణకు విచారణ అధికారిగా ఉన్న శైలజ పాత్ర పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేసారు. ఈ మధ్య కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నాయకులపై అనేక కేసులు నమోదు చేసిన ఖాకీ గా పేరున్న వ్యక్తికి కాకతీయ యూనివర్సిటి పోస్టింగ్ లభించింది. అతని బాధితులుగా ఉన్న కాంగ్రెస్ కార్పోరేటర్లు ఇద్దరు విదేశాల్లో ఉన్న మంత్రి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లడంతో ఆగ్రహానికి లోనైన మంత్రి వెంటనే ఫోన్ కాల్ చేసి ఇచ్చిన పోస్టింగ్ ని నిలిపి వేసారు. అతను నమోదు చేసిన కేసుల పై పునర్విచారణ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. సిఐకి ఆ విధమైన శిక్ష విధించి కాంగ్రెస్ నాయకులకు న్యాయం చేసినప్పుడు, తప్పుడు నివేదికలు ఇచ్చి అక్రమ మార్గంలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కట్టబెట్టిన శైలజా పై చర్యలు తీసుకోకుండా వదిలేస్తే ఆమె చేసిన తప్పులు క్షమించి వేసినవారవుతారు. శైలజపై సిబీసిఐడి విచారణ జరిపి, ఆమె అక్రమ ఆస్తులపై , బినామీల పై విచారణ చేపట్టాలని కాంగ్రెస్ కార్యకర్తలు కోరుతున్నారు.

యూట్యూబర్ షణ్ముఖ్‌కు
నోటీసులు జారీ

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : డ్రగ్స్ కేసులో యూట్యూబర్ షణ్ముఖ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. షణ్ముఖ్ తీసుకున్న డ్రగ్ టెస్ట్‌కు సంబంధించిన నివేదిక పదిరోజుల్లో రానుంది. నివేదిక ఫలితం ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. షణ్ముఖ్ యూట్యూబ్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్, సూర్య వంటి వెబ్ సిరీస్‌లతో మంచి గుర్తింపు పొందాడు. బిగ్ బాస్ తెలుగు 5 రన్నరప్‌గా నిలిచారు. షణ్ముఖ్ జస్వంత్‌పై డ్రగ్స్ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలని నార్సింగి పోలీసులు సీఆర్‌పీసీ 41 కింద నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా.. షణ్ముఖ్ తీసుకున్న డ్రగ్ టెస్ట్ రిపోర్టు పదిరోజుల్లో రానున్నాయి. రిపోర్టు ఫలితాల ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గంజాయితో పట్టుబడిన షణ్ముఖ్ జస్వంత్ న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాడు. ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతని సోదరుడు సంపత్ వినయ్‌ని పట్టుకునేందుకు పోలీసులు అతని ఇంటికి వెళ్లగా ఈ ఘటన చోటుచేసుకుంది. సోదాల్లో షణ్ముఖ్ వద్ద 16 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతని సోదరుడితో పాటు అతడిని అరెస్టు చేశారు.

సెల్లార్ నిర్మాణాలపై అనుమతి తీసుకోవాలి

- స్పష్టం చేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి24 (జనంసాక్షి) : అపార్ట్‌మెంట్‌లోని బేస్‌మెంట్‌లో 2012 భవన నిబంధనల ప్రకారం వాచ్‌మెన్ గదితోపాటు రెండు మరుగుదొడ్లు నిర్మించుకోవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో వీటి నిర్మాణం చేపట్టవచ్చని, అయితే ముందస్తు అనుమతి తప్పనిసరి అని తేల్చింది. హైదరాబాద్‌లోని మోహన్ నగర్‌లోని సీటీఓ కాలనీలోని అన్నపూర్ణ అపార్ట్‌మెంట్ బిల్డర్ కె.రమేష్ సెల్లార్‌లో వాచ్‌మెన్ గది నిర్మాణంపై ఈ నెల 7న జీహెచ్ఎంసీ జారీ చేసిన పోకాజ్ నోటీసును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ అంశంపై జస్టిస్ టి.వినోద్ కుమార్ విచారణ చేపట్టారు. 500 చదరపు గజాల విస్తీర్ణంలో 15 ప్లాట్లు ఉన్నాయని, భద్రత కోసం సెల్లార్‌లో వాచ్‌మెన్ గదిని నిర్మించామని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. దీన్ని కూల్చివేయాలని జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. భవన నిబంధనల ప్రకారం వాచ్‌మెన్ గది నిర్మాణాన్ని చేపట్టవచ్చు. కేవలం షోకాజ్ నోటీసు మాత్రమే ఇచ్చామని, దీనిపై వివరణ ఇచ్చేందుకు పిటిషనర్ కు అవకాశం ఉందని మున్సిపల్ శాఖ తరపు న్యాయవాది తెలిపారు. వాచ్ మెన్ గది నిర్మాణానికి అనుమతి తీసుకోవాలన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. నిబంధనల ప్రకారం వాచ్‌మెన్ గది నిర్మాణానికి నిబంధనల ప్రకారం అనుమతి ఉన్నప్పటికీ ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఇక్కడ పిటిషనర్ ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టారని, ఈ నెల 24లోగా షోకాజ్ నోటీసుకు వివరణ ఇవ్వాలని పిటిషనర్ ను ఆదేశించింది. అంతే కాకుండా వాచ్‌మెన్ గది నిర్మాణాన్ని క్రమబద్ధీకరించేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. షోకాజ్ నోటీసుపై వివరణతో పాటు, పిటిషనర్ క్రమబద్ధీకరణ దరఖాస్తు (అప్లికేషన్స్) చేస్తే, దానిపై నిర్ణయం తీసుకునే వరకు ఎటువంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించారు. క్రీడాభివృద్ధిలో భాగంగా ఐఎంజీకి అప్పగించిన భూమిని రిజిస్ట్రేషన్ రద్దు చేయడంపై బాధ్యులైన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారని మరో కేసులో హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రయివేటు కంపెనీకి అప్పగించిన భూమికి బాధ్యులైన వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు. ఏకపక్షంగా భూముల బదలాయింపు కేసులో ప్రభుత్వమే దోషి అని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందన్నారు. చట్టం తెచ్చే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. వాదనల అనంతరం తదుపరి విచారణను ధర్మాసనం 28కి వాయిదా వేసింది.

జీవో నెంబర్ 317 సమీక్షకు సబ్‌కమిటీ ప్రకటన పట్ల హర్షం

కరీంనగర్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 మేరకు జీవో నెంబర్ 317 ద్వారా నూతన జిల్లాలకు ఉద్యోగుల కేటాయింపులో సమస్యలను పరిష్కరించేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ నూతన ప్రజాసర్కార్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త మహమ్మద్ ఫయాజ్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే ప్రభుత్వం అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించాలని కోరారు. 317 జీవో ద్వారా నష్టం జరిగిన ఉద్యోగుల నుండి కూడా అప్పీల్స్ స్వీకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే కమిటీకి జోనల్ వ్యవస్థపై రివ్యూ జరిపేందుకు అధికారం కల్పించాలని కోరారు. ఉమ్మడి 10 జిల్లాల ప్రాతిపదికను జోనలను రూపొందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఢిల్లీకి తెలంగాణ
బిజెపి నేతలు

- సీట్ల కేటాయింపుపై పెద్దలతో చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : ఢిల్లీకి తెలంగాణ బీజేపీ నేతలు వెళ్లనున్నారు. సీట్ల కేటాయింపులపై చర్చించనున్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల తదితరులు సాయంత్రం బీజేపీ అగ్రనేతలతో సమావేశం కానున్నారు. పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికపై అధిష్టానంతో బీజేపీ నేతలు చర్చించనున్నారు. మార్చి రెండో వారంలో అభ్యర్థుల ప్రకటన చేయాలని బీజేపీ భావిస్తోంది. హైకమాండ్ వద్ద ఒక్కో నియోజకవర్గం నుంచి మూడు పేర్లతో లిస్ట్ రెడీ చేయనున్నారు. సిట్టింగ్‌లు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, సోయంకు మళ్లీ అవకాశం లభించనుంది. మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి బీజేపీలో తీవ్ర పోటీ నెలకొంది. మల్కాజ్‌గిరి సీటును ఈటల, చాడా సురేష్ రెడ్డి, పన్నాల హరీష్ రెడ్డి, వీరేందర్ గౌడ్, కూన శ్రీశైలం గౌడ్ తదితరులు ఆశిస్తున్నారు. మహబూబ్‌నగర్ స్థానంలో డీకే అరుణ, శాంతికుమార్, జితేందర్ రెడ్డి మధ్య పోటీ నెలకొంది. ఖమ్మం సీటును పీవీ రమేష్, గల్లా సత్యనారాయణ, రంగా కిరణ్‌లు ఆశిస్తున్నారు. చేవెళ్ళ నుంచి కొండా విశ్వేశ్వరెడ్డి, భువనగిరి నుంచి బూర నర్సయ్య గౌడ్ పోటీ దాదాపు ఖరారు అయ్యారు. బీఆర్ఎస్‌తో పొత్తుపై హైకమాండ్ నుంచి క్లారిటీ తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ నేతలు భావిస్తున్నారు.

కొమరం భీమ్ ఆశ సాధనకు
బీఆర్ఎస్ ప్రభుత్వ కృషి

- మాజీ మంత్రి జోగు రామన్న

బేల, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : జల్, జంగల్, జమీన్ నినాదంతో పోరాడిన ఆదివాసి పోరాటయోధుడు కొమరం భీం ఆశయాలకు అనుగుణంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదివాసి సంక్షేమానికి తొలి ప్రాధాన్యతను ఇచ్చిందని మాజీ మంత్రి, బీ.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జోడే ఘాట్ కు వచ్చి కొమరం భీంకు నివాళి అర్పించిన తొలి ముఖ్యమంత్రిగా కెసిఆర్ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. బేల మండలం మసాలా గ్రామంలో ఏర్పాటు చేసిన కొమరం భీం విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. మారుమూల గిరిజన గ్రామాల్లోనూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేసిన విషయాన్నీ గుర్తు చేశారు. పదవి ఉన్నా, లేకపోయినా చేసిన మంచి పనులు ఎప్పటికీ నిలిచిపోతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, గంబీ ర్ టాక్రె,సతీష్ పవార్, తన్వీర్ ఖాన్,ఆడే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్
నియామకం పట్ల హర్షం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్‌గా జి.చిన్నారెడ్డి నియామకం పట్ల రాష్ట్ర గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థల తెలుగు రాష్ట్రాల చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ వాది అయిన చిన్నారెడ్డి రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ పదవికి చిన్నారెడ్డి తగిన వ్యక్తి అని, రాష్ట్ర అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించి.. రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డికి చేదోడు వాదోడుగా చిన్నారెడ్డి ఉంటారని రాజేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

జాతర వేళ దొంగల బీభత్సం

చెన్నూర్, ఫిబ్రవరి, 24 (జనం సాక్షి) : పట్టణంలో విశ్వకర్మ కాలనీలో మేడారం జాతరకు ఇంటికి తాళాలు వేసి వెళ్లడంతో అదును చూసి దొంగలు బీభత్సాన్ని సృష్టించారు. కాలనీకి చెందిన బ్రహ్మయ్య అనే వ్యక్తి ఇంట్లో తాళాలు వేసి ఎవరూ లేకపోవడంతో ఇంటి తాళాలు పగలగొట్టి సుమారు రెండు తులాల బంగారం, 40,000 నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం పట్టణంలోని ఆదర్శ నగర్ కాలనీకి చెందిన ముల్కల వీరారెడ్డి తన పక్కింటి వారితో కలిసి మేడారం జాతరకు వెళ్ళగా దొంగలు పక్క ఇంటి తో సహా తన ఇంట్లో దొంగతనాలకు పాల్పడి విలువైన వెండి సామాగ్రి కొంత డబ్బులు ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించే బాధ్యత కాంగ్రెస్ సర్కారుదే..

- పునరుద్ధరణ కమిటీ చైర్మన్ దుద్దిల్ల శ్రీధర్ బాబు

బోధన్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలిపిన విధంగా చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించే బాధ్యత కాంగ్రెస్ సర్కారు తీసుకుంటుందని నిజాం చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ చైర్మన్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శనివారం నిజామాబాద్ జిల్లా బోధన్ చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరణ కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబుతో పాటు కమిటీ మెంబర్లు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, కమిషనర్ రంజన్ తో కలిసి ఫ్యాక్టరీని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, 2014వ సంవత్సరంలో ఫ్యాక్టరీ ప్రారంభ విషయంలో వేసిన రత్నాకర్ కమిటీలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మెంబర్ గా ఉండడం జరిగిందని అయితే కమిటీ ఫ్యాక్టరీని ప్రభుత్వమే నడిపించాలని స్పష్టం చేయడం జరిగిందన్నారు. 10 సంవత్సరాల కాలంలో ఫ్యాక్టరీని తెరిపించని బీఆర్ఎస్ నాయకులు రెండు నెలల కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారం చేపట్టిన వెంటనే రెండు హామీలను నిర్వహించడం జరిగిందని ఈ నెలాఖరులో సైతం మరో రెండు హామీలు ఒకటి 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ మరోది 200 లోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత కరెంటును అందించే పథకాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ సర్కారు అడ్డగోలు నిర్ణయాల వల్ల చక్కెర ఫ్యాక్టరీ మూతపడిందని అయితే కాంగ్రెస్ సర్కారు హయాంలో నిపుణులతో చర్చించి కార్మికులు కర్షకుల సమిష్టి నిర్ణయంతో ముందుకు పోవడం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఫ్యాక్టరీ కి సంబంధించిన రుణాల విషయంలో తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని, ఫ్యాక్టరీ ఆస్తులన్నీ బ్యాంకులో తాకట్టు ఉన్నాయన్నారు. దాంతోపాటు మేలు రకమైన విత్తనాల పంపిణీ విషయంలో వ్యవసాయశాఖ మంత్రితో పాటు నిపుణులతో మాట్లాడి విత్తనాల పంపిణీపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఫ్యాక్టరీని లాభాల బాటలో పైనుంచి విధంగా చర్యలు తీసుకున్నప్పుడే రైతులకు న్యాయం చేసిన వారు అవుతామన్నారు. బోధన్ చక్కెర ఫ్యాక్టరీ విషయంలో బిజెపి నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన ఆరోపించారు. చెరుకు పంటకు కనీసం అందుదర విషయంలో బిజెపి సర్కారు రైతులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కనీస మద్దతు ధర టన్నుకు 4000 పెంచినట్లయితే చెరుకు రైతులకు ఊరట కలుతుందన్నారు. నిజామాబాద్ జిల్లా రైతాంగం గొంతును కేంద్రంలో వినిపించాలంటే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి లక్ష్యం సంకల్పం చక్ర ఫ్యాక్టరీలను ప్రారంభించడమేనని మంత్రి స్పష్టం చేశారు. రాఖీ ప్రారంభించే విషయంలో రైతుల సహకారం పూర్తిగా కావాలని అందరి సహకారంతో ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్ రెడ్డి, ఈరవత్రి అనిల్, బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, డిసిసి అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, టిపిసిసి డెలిగేట్ గంగాశంకర్, అర్కెల నర్సారెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మాణిక్ రజిత యాదవ్, బోధన్ ఆర్డిఓ రాజా గౌడ్, తహశీల్దార్ గంగాధర్, అర్ఐ ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు మందర్న రవి, ఖాజాపూర్ అశోక్, షేక్ ఫరాన్, నరేందర్ రెడ్డి, శ్రవణ్, పాష, గణపతి రెడ్డి, సంజీవరెడ్డి, తలారి నవీన్, చెరుకు రైతులు, అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
25 ఫిబ్రవరి 2024

మార్చి 10న అఖిలభారత ఫాసిస్టు వ్యతిరేక ప్రజాసదస్సు

ఫాసిస్ట్ ఆర్ఎస్ఎస్ భాజపా ని ఓడించండి!.. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, రిజర్వేషన్ లను, లౌకికవాదాన్ని కాపాడుకుందాం! సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్ ఆధ్వర్యంలో, 10 మార్చి 2024న నాగ్‌పూర్ (మహారాష్ట్ర)లో కార్పోరేట్- ఆర్ఎస్ఎస్ ఫాసిజానికి వ్యతిరేకంగా అఖిలభారత ఫాసిస్టు వ్యతిరేక ప్రజా సదస్సును ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్ నిర్ణయించింది. ఈ సదస్సుదేశంలోనే అన్ని విప్లవ వామ పక్ష లౌకికవాద ప్రజాస్వామ్య పార్టీలను ఆహ్వానిస్తున్నాం. "ఆర్ఎస్ఎస్-బీజేపీని ఓడించండి", "ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను, లౌకికవాదాన్ని కాపాడుకుందాం" వంటి కేంద్ర నినాదాలతో సదస్సు/సమ్మేళనం నిర్వహించబడుతున్నది. బారిస్టర్ రాజాభౌ ఖోబ్రగడే హాల్, సిద్ధార్థ్ నగర్, కమతి రోడ్, నాగ్‌పూర్, మహారాష్ట్రలో సదస్సు నిర్వహించబడుతుంది.

ప్రపంచంలోనే అతిపెద్ద, పురాతనమైన సుదీర్ఘ చరిత్ర కలిగిన ఫాసిస్ట్ సంస్థ ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వంలో, రెండు నెలల తర్వాత జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో భాజపా గెలిస్తే, అదానీ వంటి అత్యంత అవినీతిపరులైన కార్పొరేట్ సంస్థల దోపిడీతో హిందూ రాష్ట్రాన్ని సృష్టించబోతోన్నది.ఇక్కడ అమానుష మను స్మృతిని అమలు చేయడం, బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగాన్ని రద్దు చేయడం ద్వారా మనుస్మృతిని భారత రాజ్యాంగంగా ప్రకటించబడుతుంది. మనుస్మృతి ప్రకారం, పేద శ్రామికులు, దళితులు, అణగారిన, గిరిజనులు, మహిళలు, ఇతర వెనుకబడిన తరగతులు మరియు మైనారిటీలందరికీ అవమానమీయమైన ఉప మానవ హోదా ఇవ్వబడుతుంది.

కార్పొరేట్ల ప్రయోజనాల కోసం హిందూ రాష్ట్ర ప్రాజెక్టును ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్–భాజాపా నిర్విరామంగా కొనసాగిస్తున్నప్పుడు, దేశ ప్రజలకు నేడు కొన్ని ప్రశ్నలు మిగిలి ఉన్నాయి. ఉదాహరణకు, 75 ఏళ్ల భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా పేదరికం, ఆకలి, నిరుద్యోగం మరియు ద్రవ్యోల్బణం గత 10 సంవత్సరాలలో బిజెపి విశ్వ గురువు నరేంద్ర మోడీ అమృత్‌కాల్‌లో ఎందుకు పెరిగిపోయాయని దేశ ప్రజలు అడగకూడదా?. హర్యానాలోని నూహ్ నుండి మణిపూర్ వరకు ద్వేషం మరియు విభజన యొక్క విషపూరిత కలుపు మొక్కలను ఎందుకు నాటారు? ప్రజల జీవనోపాధి సమస్యలను విస్మరించి, రామమందిరం పేరుతో దేశవ్యాప్తంగా ఎందుకు మత ఉన్మాదం సృష్టించారు? దేశంలోని సామాన్య శ్రామిక ప్రజలు కరోనా కాలంలో ఎలాంటి ఉపశమనం లేకుండా వీధుల్లో పురుగుల లాగా చనిపోతుంటే, దేశ ప్రజల జీవన విధానం నాశనమవుతున్నప్పుడు, అదానీ అంబానీ వంటి కార్పొరేట్ల ఖజానా ఎలా పొంగిపొర్లుతుందో తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందా? లేదా? రైతులు, యువకులు, మహిళల సంక్షేమం గురించి మాట్లాడే బీజేపీ ప్రభుత్వం తిండి, బట్టలు, నివాసం వంటి సమస్యలపై పోరాడుతున్న రైతులు, కూలీలు, దళితులు, గిరిజనులు, విద్యార్థులు, మహిళలు, మైనార్టీల పట్ల ప్రత్యేకించి ముస్లింల పట్ల ఎందుకు వివక్షగా వ్యతిరేకంగా వ్యవహరిస్తోన్నది? మైనార్టీలు దళితులు గిరిజనులు మొత్తం దేశానికి శత్రువులా? ఆర్ఎస్ఎస్/ భాజపా మహిళలపై అణచివేతలకు పాల్పడే అనేక మంది మైసోజెనిక్ మరియు నేరస్థులకు ఎందుకు రక్షకుడుగా వ్యవహరిస్తున్నారు? బిజెపి నకిలీ జాతీయవాదం యొక్క మత్తుమందుని ఎందుకు వ్యాపింపజేస్తున్నారు? మరియు ప్రజాస్వామ్య ఉద్యమానికి చెందిన వ్యక్తులను దేశద్రోహం పేరుతో తప్పుడు ఆరోపణలు చేసి జైలులో ఎందుకు పెడుతున్నారు? దేశం మొత్తం మీద నలుగురిలో ముగ్గురికి సరిపడా ఆహారం దొరకడం లేదు. భావ ప్రకటనా స్వేచ్ఛ, జర్నలిస్టుల భద్రత విషయంలో భారతదేశం ప్రపంచంలోనే చివరి స్థానంలో ఉంది, ఎందుకు ఈ విధంగా భారతదేశం ఉంది? కానీ ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానంగా, బీజేపీ ఒక వైపు రామ మందిరం/కృష్ణ జన్మభూమి పేరుతో హిందూ మత ఉన్మాదం సృష్టిస్తూనే మరోవైపు మానవ హక్కులు, రాజ్యాంగం, రిజర్వేషన్ హక్కులు, లౌకికవాదం మొదలైన వాటిని తుంగలో తొక్కడంలో నిమగ్నమై ఉంది.

మొత్తమ్మీద చూస్తే స్వాతంత్ర్య పోరాట వారసత్వం నుంచి సంక్రమించిన విలువలు అంతరించిపోతున్నాయి.చరిత్రలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి తొత్తులుగా, తొత్తులుగా పనిచేసిన వారి పాలనలో దేశంలోని సామాన్య ప్రజలు మూలుగుతున్నారు. ఇలాంటి ఉక్కిరిబిక్కిరి పరిస్థితిలో, ప్రజాస్వామ్యం, శాంతి, రాజ్యాంగం, రిజర్వేషన్ మరియు లౌకికవాదం కోసం, మతపరమైన మతోన్మాదానికి, మతోన్మాదానికి, ద్వేషానికి మరియు విభజనలకు వ్యతిరేకంగా మనమందరం కలిసి మంచి భవిష్యత్తు కోసం మన గళాన్ని పెంచుదాం. షాహిద్ భగత్ సింగ్, అష్ఫాఖుల్లా, బిస్మిల్ మరియు ప్రీతిలతా వడ్డేదార్‌ల అమరవీరుల ఉమ్మడి వారసత్వాన్ని గుర్తుచేసుకుంటూ అమరవీరులకు మరోసారి నివాళులర్పిద్దాం. సంఘీ మనువాది ఫాసిస్ట్ శక్తులను, కార్పొరేట్ సంస్థలకు చెందిన పెద్దలు మరియు సాధారణ శత్రువులను పెకిలించి వేయడానికి సన్నద్ధం అవుదాం. ఇందుకోసం ప్రజలు మార్చి 10వ తేదీన నాగ్‌పూర్‌లో నిర్వహించే అఖిల భారత ఫాసిస్ట్ వ్యతిరేక ప్రజా సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు మనస్ఫూర్తిగా సహకరించాలని మీ అందరికి విజ్ఞప్తి చేస్తున్నాం.

మన్నవ హరిప్రసాద్,
పాలిట్ బ్యూరో సభ్యుడు సిపిఐ (ఎం.ఎల్)
రెడ్ స్టార్
9346508846
email: mannavahariprasad@gmail.com

బీజేపీకి భయం పట్టుకుంటున్నదా?



పీఎం నరేంద్ర మోడీ వారణాసి కి వెళ్లి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మీద, పరోక్షంగా,కాంగ్రెస్ యువ రాజు ఆగం అవుతున్నారని,అంటూ వ్యాఖ్యలు చేసారు.తనని తిడుతున్నారని అన్నారు.యూపీ లో రాహుల్ గాంధీ న్యాయ యాత్ర విజయవంతం గా కొనసాగుతున్న నేపథ్యంలో, పీఎం హడావిడిగా తన నియోజకవర్గం లో పర్యటించారు.సహజం గా పీఎం మాట్లాడే ధోరణిలో మార్పు కనిపిస్తున్నది. ఇండియా కూటమి బలపడుతుండడం, యూపీ లో కాంగ్రెస్, సమాజ్ వాది మధ్యన పార్లమెంట్ ఎన్నికల లో సీట్ల షేరింగ్ జరుగడం, అటు ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ తోనూ కాంగ్రెస్ పొత్తు కుదరడం లాంటి వి పీఎం కు మింగుడు పడడం లేదు! దీనితో పీఎం ఏమి మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదు.అక్కడి యువత ను రాహుల్ మత్తు కు అలవాటు పడ్డారని, ఘోరంగా మాట్లాడారు అని పీఎం యువతను,రెచ్చగొట్టే మాటలు మాట్లాడారు.తన బిడ్డలను తాగుబోతులు అంటారా!అన్నారు.యువ బిడ్డలకు పీఎం ఇస్తానన్న ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి? యువ బిడ్డలు పేపర్ లీక్ మీద యూపీ డి ప్యూటీ సీఎం మౌర్య ఇంటి వద్దకు వెళితే లాఠీ ల తో కొట్టిన సంగతి గురించి మోడీ చెప్పలేదు! నిజానికి పీఎం మాటలు, ఆయన రాహుల్ అంటే ఎంత భయపడుతున్నారో స్పష్టం చేస్తున్నాయి.రాహుల్ చెప్పిన మాటల ను పీఎం వక్రీకరించి మాట్లాడడం పట్ల కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు రాహుల్ న్యాయ యాత్ర యూపీ లో కొనసాగుతున్న నేపథ్యంలో నిరుద్యోగం, అవినీతి, అసమానతలు, బీజేపీ కి కార్పొరేట్ ల ఫండింగ్, పేదరికం, అధిక ధరలు, రైతుల ఆందోళన, వారి మీద కాల్పులు లాంటి విషయాలను మాట్లాడుతూ మొత్తంగా పీఎం మోడీ ప్రభుత్వం లోటు పాట్లను జనం లో సరళమైన భాషలో, ఉదాహరణ ల తో రాహుల్ జనంలోకి తీసుకెళ్లడం కూడ ఇప్పుడు బీజేపీ కి పార్లమెంట్ ఎన్నికల ముందు క్లిష్టం అయిపోయింది, అంటే అతిషయోక్తి కాదు. ఇండియా కూటమి బల పడడం, ఆమ్ ఆద్మీ పార్టీ ఇండియా కూటమిలో ఉండడం, కాంగ్రెస్ తో పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తు పెట్టుకోవడం ఏమాత్రం ఇష్టం లేని బీజేపీ, పీఎం మోడీ ఢిల్లీ సీఎం కేజీరీ వాల్ ను వేధిస్తున్నారని, సిబిఐ ద్వారా అరెస్ట్ చేసి, ఈడీ కి అప్పజేప్పి జైలుకు పంపుతారని ఆమ్ పార్టీ నేతలు చెబుతున్నారు!తాము భయపడేది లేదు అని వారు పేర్కొన్నారు. మొత్తంగా అటు ఝార్ ఖండ్ లో మాజీ సీఎం హేమంత్ సొరెన్ ను కేసులో ఇరికించి జైలుకు పంపారు. బీహార్ లో ఆర్జెడి నేతలు లల్లూ ప్రసాద్ కుటుంబాన్ని, తేజస్వి యాదవ్ సహా ఈడీ విచారణల పేరిట వేధిస్తున్నారు. అటు టిఎంసి నేత బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సహచరులను ఇబ్బంది పెడుతున్నారు. మాజీ సీఎం ఉద్ధవ్ టాక్రే ప్రభుత్వం ను మహారాష్ట్ర లో కూల్చారు.

అవినీతి పరులు బీజేపీ లో చేరితే!

అవినీతి పరులు బీజేపీ లో చేరితే శుద్ధ పూసలు అయి పోతారు. బీజేపీ వాషింగ్ మిషన్ లో పాడిన మహారాష్ట్ర సీఎం ఎక్ నాథ్ షిండే శివసేన ను చీల్చారు!అంతే సీఎం అయ్యాడు, ఆయన తో సహా ఆయన అనుచరులు మొత్తం శుద్ధ పూసలు అయిపోయారు. అక్కడనే శరద్ పవార్ ఎన్సీపీ ని చీల్చి, పీఎం స్వయంగా 70,000 కోట్ల అవినీతి ఆరోపణలు ఉన్నాయని ఆరోపించిన ఎన్సీపీ నేత అజిత్ పవార్ ను డిప్యూటీ పీఎం చేశారు. అస్సాంలో శారదా చిట్, తదితర కుంబకోణాల కేసులలో ఉన్న హేమంత్ బిస్వ శర్మ ను బీజేపీ లో చేర్చుకుని సీఎం చేశారు. ఇలా పలు రాష్ట్రాల్లో బీజేపీ ఆరోపణలు చేసి, ఈడీ, ఐటి, సిబిఐ కేసులలో ఉన్న విపక్ష పార్టీ ల నేతలను బీజేపీ లో చేర్చుకుని వారిని మంత్రులను చేశారు. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉన్నది. విపక్షాల ను, ముఖ్యంగా కాంగ్రెస్ ను భూ స్థాపితం చేసే పనిని, వ్యూహం ను పీఎం మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా చాలా విచ్చలవిడిగా అమలు చేస్తున్నారు.

రెండు కోట్ల రిజిస్టర్డ్ నిరుద్యోగులు

దేశంలోని ఒక యూపీ లోనే 2 కోట్ల మంది రిజిస్టర్డ్ నిరుద్యోగులు ఉన్నారు.60 వేల పోలీస్ తదితర ఉద్యోగాలకు 69 లక్షల మంది దరఖాస్తు చేసుకున్న పరిస్థితులు ఉన్నాయి. అన్ని ఉద్యోగాల నియామకాల టెస్ట్ ల పేపర్ లీకులు, దీనికి వ్యతిరేకంగా లక్షల మంది ఉద్యోగుల ఆందోళన లు కొనసాగుతున్న పరిస్థితులు ఉన్నాయి. పీఎం పర్యటన సందర్భంగా కూడ ఈ ఆందోళనలు ఉన్నాయి. యూపీ నుంచి ప్రతీ రోజు వలస కూలీలు ట్రైన్లలో హైదరాబాద్, కేరళ, ఆంధ్రప్రదేశ్ కు ఉపాధి కోసం వేలాదికి వెళుతున్న దృశ్యాలు పీఎం కు కనపడవు!

ఆ 335 కోట్ల సంగతి ఏమిటీ?

మొత్తం 30 కంపెనీల మీద ఐటి, దాడులు జరిగాయి. కేసులు అయ్యాయి. అనంతరం వారి నుంచి 335 కోట్ల రూపాయల ఫండింగ్ బీజేపీ కి జరిగింది. ఆ కంపెనీల పేర్లు వివరాలను కాంగ్రెస్ నేత జైరాం రమేష్ బయట పెట్టారు. దీనిని హఫ్తా వసూల్ అంటున్నది, కాంగ్రెస్! పీఎం మోదీజీ దీనిని ఏమంటారు. ఇప్పటికే ఇటీవల సుప్రీం కోర్ట్ రద్దు చేసిన ఎలక్ట్రాల్ బాండ్స్ ద్వారా ఫండింగ్ లో 6 వేల కోట్లు బీజేపీ క ా జమా అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతా నుంచి ఐటి పేరిట 65 కోట్లు సీజ్ చేస్తారు! కాంగ్రెస్ సహా అన్ని విపక్షాల ను ఆర్థికంగా దెబ్బ తీయాలి, ఎన్నికల నాటికి వారి వద్ద ఒక్క పైసా ఉండకూడదు! ఇదీ వ్యూహం! బీజేపీ విధానాలను ఇప్పుడు ఒక్కొక్కటిగా కాంగ్రెస్, ఇండియా కూటమి బయట పెట్టడం పీఎం మోడీ కి నచ్చడం లేదు!రాహుల్ అంటే, కాంగ్రెస్ అంటే, ఇండియా కూటమి అంటే భయం!

రైతులంటే భయం పట్టు కుందా?

పీఎం గా మన్మోహన్ సింగ్ ఉన్నప్పుడు కూడ రైతు ఆందోళనలు జరిగాయి. అప్పుడు మన్మోహన్ సింగ్ రైతు నాయకులను తన పక్కన కూర్చుండబెట్టుకుని మాట్లాడారు. పీఎం మోడీ మాత్రం అప్పుడు 750 మంది రైతులు ఊపిరి వదిలినప్పుడు కాని, ఇప్పుడు ముగ్గురు మరణించినప్పుడు కూడ కనీసం విషయం మీద మాట్లాడలేదు.రైతులు అంటేనే పీఎం కు గిట్టదు! ఎందుకో తెలియదు?రైతుల మీద టియర్ గ్యాస్ ను, రబ్బర్ బుల్లెట్ లను ప్రయోగిస్తున్నారు. పైలెట్ గన్స్ ఉపయోగిస్తున్నారు. ముగ్గురు తమ కండ్లు కోల్పోయారు. బల్వేందర్ సింగ్ అనే రైతుకు మెటల్ బుల్లెట్ ల గాయాలు 50 దాకా ఉన్నాయి,10 మంది తీవ్రంగా,50 మంది స్వల్పంగా గాయ పడ్డారు. శు భ కరణ్ సింగ్ అనే 23 ఏండ్ల యువ రైతు పోలీస్ కాల్పుల్లో మరణించాడు. ఖనోరి బోర్డర్ లో గుండె పోటు తో దర్శన్ సింగ్ అనే రైతు మరణించాడు. రైతుల, కొందరు స్వతంత్ర పాత్రికేయుల, ట్విట్టర్, పేస్ బుక్ అకౌంట్స్ ను బంద్ చేయించారు. వారి పేరు మీదే నకిలీ అకౌంట్స్ ను ఓపెన్ చేయించి, రైతు ఉద్యమం మీద తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు, అని రైతు సంఘాల నేతలు పేర్కొన్నారు. గ్రామాలకు వెళ్లి రైతు కుటుంబాలను బెదిరిస్తున్నారని, ఆర్థికంగా బ్యాంకు అకౌంట్స్ బంద్ చేయిస్తాము, అని, ట్రాక్టర్లు సీజ్ చేస్తామని, ఎన్ఎస్ఏ కింద కేసులు పెడతామని అంటున్నారని, వారు పేర్కొన్నారు. మరో వైపు పుల్వమా సంఘటనకు సంబంధించి నిజాలు చెప్పిన మాజీ గవర్నర్ సత్యపాల్ మల్లిక్ అనారోగ్యం తో ఆసుపత్రి లో ఉంటే ఆయన ఇంటి మీద సిబిఐ దాడులు జరుగుతున్నాయి. ఇదంతా దేనికి? మరో సారి ఎన్నికల్లో గెలువడానికే కదా!దేశానికీ పట్టెడు అన్నం పెడుతున్న రైతుల మీద దాడులు ఏంటి?మదర్ అఫ్ డెమోక్రసీ లో ఈ ఫాదర్ ఆఫ్ పవర్ డాష్టికం ఏమిటి?రైతులు ఎమ్మెస్పి అడగడం, రుణ మాఫీ చేయమనడం ఎలా తప్పు అవుతుంది?ఇంత భయం ఎందుకు?

ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

అంకెల్లో సున్న మిన్న

అక్షరాల్లో అచ్చులు మిన్న
ఇవేమో కాని
మనిషి జ్ఞానమే మిన్న...

ఆవిష్కరణకు ఆయువు
జ్ఞానమే ప్రాణ ఆయువు
నాగరికతకు పునాది రాళ్లు

నవచరిత్రకు మైలు రాళ్లు
జ్ఞాన దీపాలు వెలగాలి
కాంతిని పంచకపోతే
వాడొక పెద్ద దద్దమ్మ

రేడియమ్
9291527757

మాయలమారి..

వాడిని చూస్తే నాకు భయమేస్తుంది
శవాల గుట్టల మీదుగా సింహాసనం ఎక్కిన
వాడిని చూస్తే నాకు నిజంగానే చాలా
భయమేస్తుంది
వాడు
నీ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ
ఏ మాత్రం తడబడకుండా
వెయ్యి అబద్ధాలు ఆడతాడు
నీ తల మీద నిలబడి
నీ సేవకుణ్ణి అంటాడు
ఇల్లు గుల్ల చేస్తూ
నీ ఇంటికి కాపలా ఉన్నానంటాడు
చేతికీ నోటికీ సంకెళ్ళు తగిలించి
ఎంత స్వేచ్ఛగా ఉన్నావో చూడు అంటాడు
నీ కొంపకు నిప్పెట్టి
చలిమంట వేశాను అంటాడు
నాకు భయమేస్తుంది
ఈ గోముఖ వ్యాఘ్రాన్ని చూస్తే
నాకు నిజంగానే చాలా భయమేస్తుంది.
నాకు జాలేస్తోంది
బంగారు లేడి ఉండదని తెలిసినా
మాయలేడి వెంట పడిన రాముడు
మళ్ళీ మారీచుడి మాయలో చిక్కి
బంగారు గుళ్ళో బందీ అయిపోతుంటే
నాకు జాలేస్తోంది
అయోధ్య రాముడిని చూస్తే
నాకు నిజంగానే చాలా జాలేస్తోంది
నాకు ఆశ్చర్యంగా ఉంది
మాయల ఫకీరు బాలనాగమ్మను బంధించినట్లు
ఈ జంగం దేవర భారతమాతను బంధిస్తుంటే
అందరూ శిలలై శక్తిహీనులై
ఏమీ చెయ్యలేని స్థితిలో
నిస్సహాయంగా నిలబడిపోవడం చూస్తుంటే
నాకు నిజంగానే చాలా ఆశ్చర్యంగా ఉంది
నాకు దిగులుగా ఉంది
కసాయి వాడి వెంట నడిచినట్లు
ముందూ వెనుకా, అటూ ఇటూ, ఎటూ చూడక
మంత్రించినట్లు వాడి అడుగులో అడుగు వేస్తూ
రామ నామం జపించే నోరునే తప్ప
వాడి చేతిలోని కత్తి నుంచి జారుతున్న
రక్తపు చుక్కలను చూడలేని ఈ దేశాన్ని చూస్తే
నాకు నిజంగానే చాలా దిగులుగా ఉంది
అయినా.....
ఈ భయాలు, దిగుళ్ళ అట్టడుగున
నాకు ఒక నమ్మకం కూడా ఉంది
ఈ చీకటి శాశ్వతం కాబోదనీ
సమాధిలోంచి లేచిన గతం
భవిష్యత్తుని ఎంతో కాలం శాసించలేదనీ
నాకు లోలోపల ఒక ధృఢమైన నమ్మకం కూడా
ఉంది

- తోలేటి జగన్మోహనరావు

అక్రమార్కులకు ఓ గుణపాఠం

చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవికి జనవరి 30న జరిగిన ఎన్నికల ఫలితాలను సుప్రీంకోర్టు రద్దు చేసి గతంలో ప్రకటించిన బీజేపీ అభ్యర్థికి బదులు ఆప్-కాంగ్రెస్ అభ్యర్థిని విజేతగా సుప్రీంకోర్టు ప్రకటించడం అన్యాయంపై న్యాయం మరోసారి గెలిచింది అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పాచ్చు. చారిత్రాత్మకమైన తీర్పు అక్రమార్కులకు ఓ గుణపాఠం లాంటిది. ప్రధాన న్యాయమూర్తి డి వై చంద్రచూడ్, న్యాయమూర్తులు జెబి పార్దివాలా మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయకుండా కుతంత్రాలను నిరోధించడం తమ కర్తవ్యాన్ని నొక్కి చెప్పింది. ఈ ప్రక్రియలో కూటమి అభ్యర్థికి వచ్చిన ఎనిమిది ఓట్లను ప్రిసైడింగ్ అధికారి ఉద్దేశపూర్వకంగా తారుమారుచేసి అని వాటిని చెల్లుబాటు చేయకుండా చేశారని అత్యున్నత న్యాయస్థానం నమ్మింది.

ఎన్నికల ప్రజాస్వామ్యం ప్రాథమిక ఆదేశం పరిరక్షించబడుతుందని నిర్ధారించడానికి అసాధారణమైన పరిస్థితులు ఏర్పడే చోట కోర్టు అడుగు పెట్టాలని ధర్మాసనం పేర్కొంది. ఆమ్ ఆద్మీ పార్టీ –కాంగ్రెస్ అభ్యర్థి కుల్దీప్ కుమార్‌కు అనుకూలంగా పోలైన ఎనిమిది బ్యాలెట్‌లను ప్రిసైడింగ్ అధికారి అనిల్ మాసిహ్ ఉద్దేశపూర్వకంగా చెల్లుబాటు చేయలేదని తేల్చిన తర్వాత చండీగఢ్ మేయర్ ఎన్నికల ఫలితాలను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం బ్యాలెట్ ట్యాంపరింగ్‌కు ప్రిసైడింగ్ అధికారిని బాధ్యులను చేస్తూ షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించింది. పి. ఒ చట్టవిరుద్ధంగా మేయర్ ఎన్నికల మార్గాన్ని మార్చాడని మరియు ఫిబ్రవరి 19న ఈ కోర్టు ముందు గంభీరమైన ప్రకటన చేయడంలో అబద్ధాన్ని వ్యక్తం చేశాడు అని కోర్టు రెండు స్థాయిలలో పి. ఓ యొక్క ప్రవర్తనను ఎత్తి చూపింది. సెక్షన్ 340 సిఆర్‌పిసి కింద అతనిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో కారణం చూపడానికి అనిల్ మసీహ్‌కు నోటీసు జారీ చేయాలని రిజిస్ట్రార్ జ్యుడిషియల్‌ని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి ప్రకటించిన ఫలితం స్పష్టంగా చట్టాన్ని ఉల్లంఘించిందని పేర్కొంటూ, "పూర్తి న్యాయం" ఉండేలా రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద కోర్టు తన ప్లీనరీ అధికారాన్ని ప్రయోగించింది. భారత సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం "పూర్తి న్యాయం" చేయడానికి మరియు ఎన్నికల ప్రజాస్వామ్యం యొక్క పవిత్రతను రక్షించడానికి తన అధికారాన్ని ఉపయోగించింది. ఫలితాలను రద్దు చేస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం కోర్టుకు అందించబడిన అధికారాలను సుప్రీంకోర్టు అమలు చేసింది. ఆర్టికల్ 142(1) అనేది భారత ప్రభుత్వ చట్టం 1935 లేదా మరే ఇతర ప్రపంచ రాజ్యాంగంలో లేని విలక్షణమైన అధికారాన్ని మంజూరు చేస్తుందని కోర్టు పేర్కొంది. జనవరి 30న మేయర్‌గా ప్రకటించిన బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకర్ సుప్రీంకోర్టు విచారణకు ముందే రాజీనామా చేశారు. అందువల్ల ఖాళీగా ఉన్న మేయర్ పదవికి మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సిందేనన్న వాదనను ప్రతివాదులు లేవనెత్తారు. అయితే కౌంటింగ్ ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారి దురుసుగా ప్రవర్తించడమే ఏకైక లోపం కాబట్టి మొత్తం ఎన్నికలను పక్కన పెట్టడం సరికాదని పేర్కొంటూ తాజా ఎన్నికలను కోర్టు తిరస్కరించింది. భాజపా నేత ఎన్నిక చెల్లదని ఆమ్‌ఆద్మీ పార్టీ మరియు కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి కుల్దీప్ కుమార్ ఎన్నికైనట్లుగా ప్రకటించింది. కౌంటిగ్ వీడియోని అందరూ చూడాలని, జీవితంలో వినోదం మంచిదే అని సరదాగా వ్యాఖ్యానించింది.

ఆర్టికల్ 142 ప్రాధాన్యం

ఆర్టికల్ 142 పార్టీల మధ్య పూర్తి న్యాయం చేయడానికి సుప్రీంకోర్టుకు ఒక ప్రత్యేక అధికారాన్ని అందిస్తుంది, కొన్నిసార్లు చట్టం లేదా శాసనం పరిహారం అందించకపోవచ్చు. అటువంటి సందర్భాలలో కేసు యొక్క ప్రత్యేకతలకు సరిపోయే విధంగా వివాదాన్ని పరిష్కరించడానికి కోర్టు తన సాధారణ పరిమితులను దాటి వెళ్ళవచ్చు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 అనేది తన ముందు పెండింగ్‌లో ఉన్న ఏదైనా కేసు లేదా విషయంలో పూర్తి న్యాయం చేయడానికి అవసరమైన ఏదైనా డిక్రీ లేదా ఆర్డర్‌ను ఆమోదించడానికి సుప్రీంకోర్టుకు అధికారం ఇస్తుంది. ఇది భారతదేశ భూభాగం అంతటా అటువంటి డిక్రీ లేదా ఆర్డర్‌ను అమలు చేయగలదు. ఆర్టికల్ 142 సుప్రీంకోర్టు ప్రజా ప్రయోజనం ,మానవ హక్కులు, రాజ్యాంగ విలువలు లేదా ప్రాథమిక హక్కుల విషయాలలో జోక్యం చేసుకోవడానికి అనుమతిస్తుంది మరియు ఏదైనా ఉల్లంఘనల నుండి వారిని కాపాడుతుంది మరియు ఇది రాజ్యాంగం యొక్క సంరక్షకుడిగా సుప్రీంకోర్టు పాత్రను పెంచుతుంది. ఇంతకు మునుపు ఈ ఆర్టికల్ ప్రకారం కొన్ని తీర్పులను ఇవ్వడం జరిగింది. యూనియన్ కార్బైడ్ కేసులో భోపాల్ గ్యాస్ విపత్తు బాధితులకు నష్టపరిహారం అందించడానికి 1989లో సుప్రీంకోర్టు ఆర్టికల్ 142ను ఉపశమనానికి ఉపయోగించింది. బొగ్గు బ్లాకుల కేటాయింపు కేసులో 1993 నుంచి అక్రమార్కులకు కేటాయించిన బొగ్గు బ్లాకుల కేటాయింపులను రద్దు చేసేందుకు, చట్టవిరుద్ధంగా ఉత్పత్తి చేసిన బొగ్గుపై జరిమానా విధించేందుకు సుప్రీంకోర్టు 2014లో రాజ్యాంగంలోని ఈ క్లాజ్‌ని ఉపయోగించింది. ఇదే నిబంధనతో 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాలని కూడా సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. హైవేలపై మద్యం అమ్మకాలపై నిషేధం కేసు 2016లో సుప్రీంకోర్టు ఆర్టికల్ 142 ప్రకారం హైవే వెలుపలి అంచు నుండి 500 మీటర్ల లోపు మద్యం విక్రయించడాన్ని చట్టవిరుద్ధం చేసింది. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. 2017లో సుప్రీం కోర్ట్ బాబ్రీ మసీదు కేసును బదిలీ చేయడానికి ఆర్టికల్ 142ని ఉపయోగించింది. దాని అధికార పరిధిని విస్తృతంగా నిర్వచించింది. దీనికి విస్తారమైన అధికారం ఉన్నప్పటికీ ఆర్టికల్ 142 విశ్వవ్యాప్తంగా వర్తించదని మరియు ప్రతి సందర్భంలోనూ అమలు చేయబడదని సుప్రీంకోర్టు 2023లో ఒక తీర్పులో స్పష్టం చేసింది.

ఆర్టికల్ 142 చరిత్ర : ముసాయిదా కమిటీ అభివృద్ధి చేసిన రాజ్యాంగ ముసాయిదాలో ఆర్టికల్ 142 నిజానికి ఆర్టికల్ 118గా లెక్కించబడింది, మే 27, 1949న చర్చ కోసం రాజ్యాంగ సభకు సమర్పించబడింది. కానీ అదే రోజు చర్చ లేకుండా ఆమోదించబడింది. బహుశా హామీ ఇవ్వడానికి అందరూ అంగీకారం తెలిపి ఉండొచ్చు.

జనకమోహన్‌రావు దుంగ
అధ్యాపకులు, శ్రీకాకుళం
8247045230

మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించడం తక్షణ కర్తవ్యం

జాతర వచ్చినప్పుడే ఏ ప్రభుత్వాలు అయిన హడావిడి చేసి తీరా జాతర ముగియగానే షరామాములే. ఈ సంత్సరం ఒకవంద10 కోట్లుకేటాయించినట్లు ప్రస్తుత ప్రభుత్వం చెప్పిం ది. తెలంగాణ ప్రభుత్వం 2014 లో ప్రభుత్వ పండుగగా ప్రకటిం చింది.ఈ జాతర తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచింది ప్రపంచంలోనే ,ఆసియా ఖం డం లొనే ఒక అటవీప్రాంతంలో ఉన్న ప్రాంతంలోగిరిజన జాతర ఇది ప్రతి రెండుసంత్సరాలకు ఒక్కసారి జరిగే ఈజాతరగిరిజ నబిడ్డలుఅయినసమ్మక్కసరక్క త్యాగాలకు ప్రతీక ఈ జాత ర.బి.జె.పి ప్రభుత్వం ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తా ము అనిఎన్నికలముందుహడా

పారిశుద్ధ్య కార్మికుల కృషితోనే

నగరానికి జాతీయస్థాయి

- **గార్బేజ్ ఫ్రీ సిటీగా చేయడమే ప్రధాన లక్ష్యం**
- **జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

హైదరాబాదు, ఫిబ్రవరి 24 (జనం సాక్షి):

హైదరాబాద్ నగరాన్ని గార్బేజ్ ఫ్రీ సిటీగా చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని, పారిశుద్ధ్య కార్మికుల కృషితోనే హైదరాబాదు నగరానికి జాతీయస్థాయిలో అవార్డులు అందుకున్నామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. అందుకు వారందరిని ఆమె అభినందించారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్‌ను విజయవంతంగా తొలగించడం లో విశేష కృషి చేసిన పారిశుధ్య కార్మికులు, సంబంధిత అధికారులకు శనివారం జిహెచ్ఎంసిలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ..నగరంలోని 30 సర్కిళ్ళలో 492 జీవీపీలను ఎలిమినేట్ చేసారని తెలిపారు. జిహెచ్ఎంసిలో రెస్ట్ లేకుండా పని చేయాలని, అందుకు ఆర్పీల సహకారం తీసుకుంటున్నామన్నారు. అవార్డులు ఇచ్చి కార్మికులను ప్రోత్సహిస్తున్నట్లే, ఆర్పీలను కూడా ఇన్సెంటివ్స్ఇచ్చి ప్రోత్సహించాలని కమిషనర్‌ను కోరారు. కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ.. నగరంలో మొత్తం 3400 జివిపిలను గుర్తించామని, జివిపిల వద్ద అపరిశుభ్రత పెరిగిపోవడంతో జివిపి ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టామని తెలిపారు. దీంతో చెత్త ఎవరు వేస్తున్నారన్నది గమనించి వారికి అవగాహన కల్పించడంతోపాటు చెత్తను స్వచ్ఛ ఆటోలకు ఇవ్వని వారి ఇంటికి వెళ్ళి మెప్మా మహిళలు వారికి అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఎస్ఎఫ్ఏలను ఢిల్లీ వరకు తీసుకెళ్ళి అవార్డ్ లను తీసుకున్నామని గుర్తు చేశారు. డిప్యూటి కమిషనర్ లు ఉదయం ఆరు గంటలకు క్షేత్ర స్థాయిలో ఉంటూ, పూర్తిస్థాయి దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి బస్తీలో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యం, అన్ని విభాగాల సమన్వయ సహకారం కృషితోనే వంద శాతం జివిపి ఎలిమినేషన్ సాధ్యమవుతుందన్నారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్‌ను విజయవంతంగా తొలగించడంలో విశేష కృషి చేసిన (298) మంది పారిశుధ్య కార్మికులు, సిబ్బందిని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ రోనాల్డ్ రోస్ శాలువా, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుసిడీ హెల్త్ అడిషనల్ కమిషనర్లు ఉపేందర్ రెడ్డి, చంద్ర కాంత్ రెడ్డి, రవి కిరణ్, జోనల్ కమిషనర్లు అభిలాష అభినవ్, వెంకన్న డిప్యూటీ కమిషనర్లు, సఫాయి కార్మికులు, ఎస్ ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్, కాంగ్రెస్‌కు

ఓటేస్తే మూసీలో వేసినట్టే

మాజీ మంత్రి ఈటల రాజేందర్

ఎల్బినగర్, ఫిబ్రవరి 24 (జనం సాక్షి)

కాంగ్రెస్, బిఆర్ఎస్ కు ఓటు వేస్తె రాష్ట్ర అభివృద్ధి కుంటూ పడుతుందనీ మాజీ మంత్రి బీజేపీ జాతీయ నాయకులు ఈటల రాజేందర్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి ఎల్బినగర్ నియోజకవర్గంలో విజయ సంకల్ప యాత్ర జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే ఎంపీ సిట్స్ ఎక్కువ గెలిపించి పంపియాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. కాంగ్రెస్ ఢిల్లీలో వచ్చే అవకాశం లేదని ఈటల పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ నిధులు లేకున్నా హామీలు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఓటర్లు కాంగ్రెస్, బిఆర్ఎస్ మాయమాటలు నమ్మవద్దనీ అన్నారు. బిఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల ఉబిలోకి నెట్టిందనీ విమర్శించారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు మురళీధర్ రావు, యేమ్మెల్యే రాకేష్ రెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, సురేష్రెడ్డి జిల్లా అధ్యక్షులు సామరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

111 జీవోకు విరుద్ధంగా, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్‌కి కాంగ్రెస్ నాయకుల వినతి

శంషాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి)

మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ సంజయ్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్లపల్లి నరేందర్, బొబ్బిలి కృష్ణయ్యతో కలిసి శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 111 జీవోకు విరుద్ధంగా కమిషనర్ సుమన్ రావును కలిసి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి, అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని వినతి పత్రం సమర్పించారు. 111 జీవోకు విరుద్ధంగా రాల్లగూడలోని దోసికుంట చెరువుని ఆక్రమించి భారీ సెల్లార్ నిర్మాణం చేపడుతున్నారు. రాల్లగూడ రోడ్ లో ఓ కౌన్సిలర్ అక్రమంగా సెల్లార్ తీసి నిర్మాణం చేపడుతున్నారు. వీటన్నిటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్మగిరి వెళ్లే దారిలో పేరుతో భారీ సెల్లార్ తీసి నిర్మాణం చేపడుతున్నారు. గతంలో కమిషనర్ కు ఎన్నోమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులు ఇప్పుడు ఇచ్చిన ఫిర్యాదులతో కలెక్టర్ ను కలిసి శంషాబాద్ మునిసిపాలిటీ సందర్శించాలని కోరుతామన్నారు. శంషాబాద్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను, చెరువులకు సంబంధించిన ఎఫ్టిఎల్ ల్యాండ్ లో కబ్జాలను పరిశీలించాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల గణేష్, వెంకటేష్ గౌడ్, శ్రీధర్ యాదవ్, సుధాకర్ రెడ్డి, అర్జున్ యాదవ్, జయమ్మ ,భాస్కర్ రెడ్డి, భాషా భాయ్, దత్తు, పెంటయ్య యాదవ్, శేఖర్, అభిషేక్ యాదవ్, ఇమ్రాన్, రాహుల్, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

హత్య చేసిన కొన్ని గంటల్లోనే హర్యా నాయక్ కేసును చేధించిన చేవెళ్ళ పోలీసులు

సీఐ లక్ష్మా రెడ్డిని అభినందించిన సీపీ మహంతి

చేవెళ్ల, ఫిబ్రవరి 24, (జనంసాక్షి)

విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్‌ని హత్య చేసిన నలుగురిని అరెస్టు చేసి శనివారం రిమాండ్ కు తరలించారు. చేవెళ్ల సిఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూరు గ్రామంలో ఫాస్టుఫుడ్ ఫ్రైడ్‌రైస్ దుకాణంలో నేపాలికి చెందిన సాగర్ మాన్ సింగ్ మాస్టర్ గా పనిచేస్తున్నాడు. అదే దేశానికి చెందిన స్నేహితులు బిందు తాప, రమేష్ ధమీ, భగవాన్ జి బండారిలు ఈ నెల 21న సాగర్ వద్దకు వచ్చారు. రాత్రి దుకాణం మూసిన తర్వాత వారందరినీ దుకాణం యజమాని శ్రీనివాస్ సబ్ స్టేషన్ లో పడుకోమని చెప్పడంతో ఆపరేటర్ హర్యానాయక్ అనుమతి ఇవ్వడంతో అక్కడే బస చేశారు. 22న మధ్యాహ్నం వరకు పనిచేసే ఫ్రైడ్ రైస్ దుకాణం మూసివేసిన అనంతరం నలుగురు స్నేహితులు కల్లు, మద్యం సేవించారు. రాత్రి 12 గంటల సమయంలో సబ్ స్టేషన్లో పడుకునేందుకు వెళితే ఆపరేటర్ హర్యా నాయక్ వద్దని వారించాడు. మాట మాట పెరగడంతో నలుగురు కలిసి అతనిపై కర్రలతో దాడి చేశారు. కింద పడిపోగానే రాళ్లతో తలపై బాదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య చేసిన అనంతరం అక్కడి నుండి పారిపోయారు. విద్యుత్ శాఖ ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సిఐ లక్ష్మారెడ్డి, ఎస్సైలు వీరబ్రహ్మం ప్రదీప్ కుమార్‌లు బృందాలుగా వెళ్లి హత్య చేసిన నలుగురిని అదుపులోకి శనివారం రిమాండ్ కు తరలించారు. హత్య చేసిన కొన్ని గంటల్లో నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించడంతో సిపి అవినాష్ మహంతి, డిసిపి శ్రీనివాసులు సిఐ లక్ష్మారెడ్డిని, ఎస్ఐ వీరబ్రహం, ప్రదీప్ కుమార్లను స్టేషన్ సిబ్బందిని అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

విద్యారంగానికి 10 లక్షల మంజూరు

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 24(జనం సాక్షి)

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం యాలాల మండల పరిధిలోని ఎన్కేపల్లి, అగ్గనూర్, చెన్నారం, అక్కంపల్లి, జుంటుపల్లి, యాలాల్, నాగసముందర్‌తో పాటు పలు గ్రామాలలో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పంచాయతీలను పట్టించుకోలేదని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే ప్రతి పంచాయతీకి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అతి త్వరలో మరో రెండు గ్యారంటీలని అమలు చేయడంతో పాటు అక్కంపల్లి ప్రాథమిక పాఠశాలకు 6 లక్షల రూపాయలు, జుంటుపల్లి ప్రాజెక్టు కు 4 లక్షల రూపాయలు మౌలిక సదుపాయాలు, అసంపూర్తి భవనాల నిర్మణనికై మంజూరు చేస్తున్నట్లుగా హామీ ఇస్తూ విద్యారంగానికి ప్రత్యేక చొరవ చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ స్థలాన్ని పరిశీలించిన సైబరాబాద్ సీపీ

చేవెళ్ళ, ఫిబ్రవీరి 24 (జనంసాక్షి)

ఈ నెల 27న చేవెళ్లలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాలలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారంటీల్లో భాగంగా రూ. 500, 200 యూనిట్ ఫ్రీ విద్యుత్ పథకాలను ఏఐసిసి అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. శనివారం సభ స్థలాన్ని హైదరాబాద్ సిపి అవినాష్ మహంతి పరిశీలించారు. ఆయన వెంట రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ బంటు కిషన్, సిఐ లక్ష్మా రెడ్డి, చేవెళ్ల ఎమ్మార్వో కృష్ణ మరియు విద్యుత్ సిబ్బంది ప్రభుత్వ అధికారులు ఉన్నారు.

ప్రభుత్వ విద్యతోనే అద్భుత ఫలితాలు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) :

కార్పొరేట్ విద్యాసంస్థలు ఎన్ని ఉన్నా... ఎంతో నైపుణ్యం కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులు బోధించే ప్రభుత్వ విద్యనే అద్భుత ఫలితాలను ఇస్తుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికె పూడి గాంధీ, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు డివిజన్ పరిధి జిల్లా పరిషత్ హై స్కూల్ ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే, కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ హై స్కూల్, మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ లో చదువుతున్న విద్యార్థులకు సినాప్సిస్ సాఫ్ట్ వేర్ సంస్థ సౌజన్యంతో నిర్మాణ్.ఆర్గ్ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ వ్యవస్థ, 3 అదనపు తరగతుల గదులు, సైన్స్ ల్యాబ్ పరికరాలు, గ్రీన్ బోర్డ్‌లు తదితర పాఠశాల సామాగ్రిని ఎమ్మెల్యే అరికపూడి, కార్పొరేటర్ శ్రీ ఉప్పలపాటి పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మాట్లాడుతూ సినాప్సిస్ సంస్థ ప్రతినిధులు సామాజిక బాధ్యతలో భాగంగా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టి కొనసాగిస్తున్నారని కొనియాడారు. సినాప్సిస్ సంస్థ ప్రధాన లక్ష్యం పేద విద్యార్థులకు, పేద ప్రజలకు సామజిక సేవ కార్యక్రమాలు అందించడమేనని, ఇది ఎంతైనా అభినందనీయమని పేర్కొన్నారు. సినాప్సిస్ ఔదార్యం చాలా గొప్పదని, ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థుల చదువుకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశ్యంతో పేద విద్యార్థులకు మేలు కలిగే విధంగా శనివారం పాఠశాల ప్రాంగణంలో సోలార్ వ్యవస్థను 3 అదనపు తరగతుల గదుల నిర్మాణం చేపట్టడంజరిగి ందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గ్రీన్ బోర్డులను ఆయా తరగతి గదిలో ఏర్పాటు చేయడం, పాఠశాల వాతావరణాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతుందని, పాఠశాలలో చదువుతున్న ప్రతి నిరుపేద విద్యార్థి వీటిని చక్కగా సద్వినియోగ పర్చుకొని మంచిగా చదివి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతోపాటు సినాప్సిస్ సంస్త వారు ఎంతో సహృదయంతో సామాజిక దృక్పథంతో సిఎస్ఆర్ ఫండ్ కింద పేదవిద్యార్థులకు చక్కటి మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. ఇందులో భాగంగా సినాప్సిస్ సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే, కార్పొరేటర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సినాప్సిస్ సంస్థ సైట్ డైరెక్టర్ శ్రీ నరేంద్ర, సీనియర్ మేనేజర్ నర్సింహ, నిర్మాణ్ సంస్థ కో ఆర్డినేటర్ అనురాధ, భార్గవ రామ్, భగవాన్, ప్రధానోపాధ్యాయురాలు వసుంధర దేవి, ఉపాధ్యాయులు బాల్ రెడ్డి, మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సున్నితమైన పోలింగ్ స్టేషన్ల విషయంలో శిక్షణ

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు సున్నితమైన పోలింగ్ స్టేషన్లుగా గుర్తించబడిన ఆయా పోలింగ్ స్టేషన్లవద్ద వ్యవహరించాల్సిన తీరుతెన్నులను గురించి శనివారం ఒకరోజు శిక్షణా తరగతులను సైబరాబాద్ పోలీసులకు, సిబ్బందికి అందించారు. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆయా పోలీస్ స్టేషన్లో స్టేషన్ హౌస్ ఆఫీసర్స్, సీనియర్ పోలీసు అధికారులు తదితరులు సైబరాబాద్ కమీషనరేట్ పరిధి కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇందులో భాగంగా రానున్న లోక్సభ ఎన్నికల నేపథ్యంలో సున్నితమైన పోలింగ్ స్టేషన్లుగా ముద్రపడిన పోలింగ్ స్టేషన్ల యొక్క పరిస్థితులను సమీక్షించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను ముందుగా గుర్తించి ఆ పోలింగ్ స్టేషన్ల పోలీసు సెక్టార్ అధికారులు రెవెన్యూ విభాగం సెక్టార్ అధికారులతో సమన్వయ పరుచుకోవాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ముద్రపడిన ఆయా పోలింగ్ స్టేషన్ల వివరాలను డిఇఓ అధికారికి పంపించాలని సిపి సూచించారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా ఓటు వేసే విధంగా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఆయా పోలీసు అధికారులు తప్పకుండా కృషి చేయాలని సిపి అవినాష్ మహంతి ఆదేశించారు. ఆయా క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల వద్ద అదనపు బలగాలను మోహరించి శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో నిర్మోమాటంగా వ్యవహరించాలని పోలీస్ అధికారులకు ఈ సందర్భంగా సిపి సూచించారు.

ఎస్‌జిఎఫ్ నిధులు తిరిగి మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీలకు అప్పగించాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 24 (జనం సాక్షి)

ఎస్‌జిఎఫ్ నిధులు తిరిగి మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీలకు అప్పగించాలని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో సాధారణ సర్వసభ్య సమావేశంలో మాజీ మంత్రివర్యులు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌరవ మాజీ ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ మంజూరు చేసిన నిధులు మీర్పేట మున్సిపల్ కార్పొరేషన్ 50 కోట్లు, బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 50 కోట్లు, జలపల్లి మున్సిపాలిటీ 25 కోట్లు, తుక్కుగుడ మున్సిపాలిటీ 25 కోట్లు, ఇట్టి నిధులు తిరిగి మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీలకు అందించాలని ప్రజల కోసమే పని చేసే ప్రభుత్వమైతే నియోజకవర్గానికి నిధులు అడ్డుకోవద్దని గత ప్రభుత్వ హయాంలో మీర్పేట మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కొరకు 122 కోట్ల రూపాయలు నిధులు తీసుకురావడం జరిగిందని నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవద్దని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీపులాల్ చౌహాన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, కమిషనర్ కార్పొరేటర్లు కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా సిద్ధం

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి): జిల్లాలోని మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓటరు జాబితాలను పారదర్శకంగా తయారు చేయడం జరిగిందని నారాయణపేట జిల్లా కలెక్టర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాకు చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో డబుల్ డబుల్ ఓటర్లను పూర్తిగా తొలగించడం జరిగిందని, అలాగే పేరు, చిరునామా, పుట్టిన తేది వివరాలను సరి చేయడం జరిగిందని చెప్పారు.ఒకే ఓటరు పేరు రెండు పోలింగ్ కేంద్రాలలో ఉండ కుండా జాగ్రత్త చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్ల గురించి కలెక్టర్ వివరించారు. పార్లమెంట్ ఎన్నికలకు ఈవీఎంలు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు.నారాయణపేట నియోజకవర్గంలో 977 మంది, మక్తల్ నియోజకవర్గంలో 950 డబుల్ ఓటర్లను తొలగించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మక్తల్ నియోజక వర్గంలో తొలగించిన ఓటర్ల లిస్టు ఇవ్వాలని ఆ నియోజకవర్గానికి చెందిన రాజకీయ పార్టీ నాయకుడొకరు కలెక్టర్ ను కోరారు. మక్తల్‌తో పాటు నారాయణపేట నియోజకవర్గంలోనూ తొలగించిన డబుల్ ఓటర్ల లిస్టులను వచ్చే సమావేశంలో ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు బొదిగల శ్రీనివాస్, రఘురామయ్య గౌడ్, యూసుఫ్ తాజ్, వెంకట్రాంరెడ్డి, శ్యామ్ చౌద్రి, ఎన్నికల విభాగానికి చెందిన రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు నోడల్ అధికారులు

నిబద్ధతతో విధులు నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి బ్యూరో ఫిబ్రవరి 24 (జనంసాక్షి)

రానున్న పార్లమెంటు ఎన్నికలకు నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను నిబద్ధతతో బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పార్లమెంటు ఎన్నికల సంసిద్ధతపై అదనపు కలెక్టర్ యం. నగేశ్ తో కలిసి నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి విధుల పట్ల దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నోడల్ అధికారులందరూ వారికి కేటాయించిన విధులను, బాధ్యతలను ఎన్నికల నిబంధనల ప్రకారం బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. ప్రతి ఒక్క అధికారి ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి పేజిని తప్పనిసరిగా చదవాలని సూచించారు. ఎన్నికల విధులు సక్రమంగా పూర్తి చేసేందుకు నోడల్ అధికారులు అవసరమైన సిబ్బందిని ముందుగానే

ఎంపిక చేసుకొని వారికి సరైన శిక్షణ ఇవ్వాలని తెలియజేశారు. ఎన్నికల విధుల్లో అధికారులు ఎలాంటి పక్షపాతం, నిర్లక్ష్యం లేకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు. వచ్చే వారం రోజుల్లో సెక్టర్ అధికారులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎన్నికల సమయంలో పోస్టల్ బ్యాలట్ కు సంబంధించి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. అధికారులంతా సమన్వయం చేసుకొని ఎన్నికల విధులు నిర్వహించాలని, అప్పుడే సమస్యలు రాకుండా చేయవచ్చని చెప్పారు. ఓటు ప్రాధాన్యత, ఓటు హక్కుపై కళాశాలల్లో స్వీప్ యాక్టివిటీ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, సీ విజిల్, ఫిర్యాదుల స్వీకరణ, పోస్టల్ బ్యాలెట్ అలాగే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు పలు అంశాలపై నియమింపబడిన నోడల్ అధికారులు వారి విధులు జగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఈవీఎంల తరలింపు, అదేవిధంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే సెక్టర్ అధికారులకు వాహనాల కేటాయింపు, పోలింగ్ సిబ్బందికి కావల్సిన వాహనాలు పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. జీపీఎస్ ట్రాకింగ్ మానిటరింగ్ వాహనాలు కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. నోడల్ అధికారులందరినీ జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి పర్యవేక్షిస్తారని, ఎన్నికల సంబంధిత కార్యకలాపాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూసు కోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ యం. నగేష్, ఆర్డీవో పద్మావతి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడమే

ప్రజా సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశం

ఉమ్మడి మహబూబ్ నాగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి

కల్వకుర్తి ఫిబ్రవరి 24(జనం సాక్షి)

కల్వకుర్తి మండలంలోని బిజెపి ప్రజాసంకల్పయాత్ర సందర్భంగా మార్కండేయ ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి, బంగారు శృతి, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయటమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ముఖ్యంగా విద్య వైద్యం ఉపాధి రంగాలలో అభివృద్ధి సాధించిందని అన్నారు. పేదరికం గణనీయంగా తగ్గి వ్యవసాయం అభివృద్ధి చెందిందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ట ప్రధాని మోడీ నాయకత్వంలో పెరిగిందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వంటి సమర్తుడి నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో సుస్థిర ప్రభుత్వం అందించి సుపరిపాలన ఫలితమే అభివృద్ధికి నాంది అని అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వంలో 500 ఏళ్ల అయోధ్య రామ మందిరం స్వప్నం

సహకారం అయ్యిందని ఉజ్వల పథకం కింద 18.75 లక్షల మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ అందించిన ఘనత ఒక మోడీ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. పీఎం గరీబ్ కళ్యాణ్ యోజన కింద 80 లక్షల మందికి ఉచిత రేషన్ అందించి పేద ప్రజలకు కడుపు నింపిన ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది బిజెపి ప్రభుత్వమే అని అన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా 29 లక్షల కుటుంబాలకు 5 లక్షల వైద్య భీమా అందించిన ఘనత బిజెపి ప్రభుత్వానికి దక్కిందని ఇలా ఎన్నో కార్యక్రమాలకు శిఖరం చుట్టి అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీపడుతున్న దేశంగా భారతదేశ నిలుస్తుందని ప్రధాని మోడీ నాయకత్వంలో చంద్రయాన్ 3 ఆదిత్య ఎల్ 1, మంగళయాన్, గగన్ యాను అంతరిక్ష అద్భుతాలు సృష్టించిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు ఒకటే అని ఈ రెండు పార్టీలు రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేదని పేద ప్రజలకు ఎలాంటి న్యాయం చేయలేదు అని అన్నారు. కోవిడ్ సమయంలో ఆర్థికంగా ఎంతో నష్టపోయినప్పటికీ వ్యాక్సిన్ అందించి ప్రపంచ దేశాలు కూడా నువ్వేరా పోయే విధంగా వ్యాక్సిన్ అందించిన ఘనత ప్రధాని మోడీ ప్రభుత్వానికి దక్కిందని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో 400లకు పైచిలుకు సీట్లను గెలిపించుకొని ముచ్చటగా మూడోసారి మోడీని ప్రధానమంత్రిగా ఎన్నుకోవాలని కార్యకర్తలకు సూచించారు.

మంత్రి జూపల్లి పైన నిప్పులు చెరిగిన తల్లోజు ఆచారి

పొద్దు తిరుగుడు పువ్వలే మంత్రి జూపల్లి కృష్ణారావు ఏ పార్టీ అధికారంలో వస్తుందో ఆ పార్టీలో చేరి మంత్రి పదవి దకించుకున్నా జూపల్లి బిజెపిపై అసత్య ఆరోపణలు మానుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలను వంద రోజులో అమలు చేయకపోతే ప్రజలే కర్రు కాల్చి వాత పెడతారని మాపై ఆరోపణలు మాని ఇచ్చిన 6 గ్యారెంటీలపై శ్రద్ధ చూపి ప్రజలకు ఎప్పుడు నెరవేరుస్తారో చెప్పాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు దుర్గ ప్రసాద్, దిలీప్ చారి, కృష్ణయ్య, బండేలా రామచంద్ర రెడ్డి, శేఖర్ రెడ్డి, కృష్ణ గౌడ్, హరి ప్రసాద్, నరసింహ, అభిలాష్, చందు, శివ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):

జిల్లాలో మెడికల్ కళాశాల నిర్వహణ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పరిశీలించారు. శనివారం నారాయణపేట మండలంలోని అప్పక్ పల్లి వద్ద నిర్మిస్తున్న నూతన జిల్లా ఆస్పత్రి భవనంలో కొనసాగుతున్న మెడికల్ కళాశాల వసతి,సౌకర్యాల పనులను పరిశీలించారు. నూతన జిల్లా ఆస్పత్రి భవనంలోని రెండో అంతస్తులో 50 మంది విద్యార్థులతో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి ప్రారంభించాలని నిర్ణయించిన కలెక్టర్ అందుకు కావాల్సిన తరగతి గదులు, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ ,ఉపన్యాసకుల గదులు, లైబ్రరీ, ల్యాబ్ లు, అడ్మిన్ బ్లాక్, అనాటమీ డిపార్ట్మెంట్, ఫిజియాలజీ, బయోకెమిస్ట్, ల్యాబ్ లు, లెక్చర్ హాల్స్, ప్రొఫెసర్స్ రూమ్స్,ట్యూటర్ రూమ్స్, డెమో రూమ్స్‌ను పనులు ఎంత వరకు వచ్చాయని అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గదులన్నింటిని తిరిగి పనులను చూశారు. నిర్మాణ పనులను మరింత వేగిరం చేయాలని ఆదేశించారు

ఉపాధ్యాయుడు అందరివాడు

ప్రధానోపాధ్యాయులు మోహన్

వీపనగండ్ల, ఫిబ్రవరి 24 (జనం సాక్షి).

వీపనగండ్ల మండల పరిధిలోని తూముకుంట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుక జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒక్కరోజు ప్రభుత్వ అధికారులుగా ఉపాధ్యాయులుగా విద్యార్థులు చక్కటి ప్రదర్శన చేయడం జరిగింది. ప్రధానోపాధ్యాయులుగా ప్రమీల, విద్యాశాఖ మంత్రిగా చంద్రకళ, జిల్లా కలెక్టర్ గ శైలజ, డిప్యూటీ కలెక్టర్ గ సాయికుమార్, జిల్లా విద్య అధికారిగా భవాని, డిప్యూటీ విద్య అధికారిగా పావని, మండల విద్యాధికారిగా శృతి, వ్యాయామ ఉపాధ్యాయులుగా ఆంజనేయులు, వినోద్, ప్రశాంత్ లు ఒకరోజు అధికారులుగా, ఉపాధ్యాయులుగా అద్భుతమైన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మోహన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడు అనే వ్యక్తి ప్రతి ఒక్కరి జీవితాన్ని మంచి మార్గంలో తీర్చిదిద్దే విధంగా విరామం లేకుండా శ్రమిస్తారని అన్నారు. అందుకే ఉపాధ్యాయుడు అందరివాడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు తిరుమలేష్, కేశవులు, రాజు గౌడ్, పరశురాముడు హుస్సేన్, రమేష్ ,వెంకటేశ్వర్లు, సిఆర్పి నాగరాజు కృష్ణమ్మ, ఆద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గట్టుకాడిపల్లి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న

మాజీ మంత్రి, మాజీ ఎంపి రావుల

వనపర్తి బ్యూరో ఫిబ్రవరి 24 (జనంసాక్షి)

ఘనపూర్ మండలానికి చెందిన గట్టుకాడిపల్లి అలివేలు మంగ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ బ్రహ్మోత్సవాలలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ,మాజీ ఎం.పి రావుల. చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. వీరికి ఆలయ కమిటీ,పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ మంత్రివర్యులు నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ..గట్టుకాడిపల్లి వేంకటేశ్వర స్వామి మహిమానితులని ఈ ఆలయ అభివృద్ధికి సహకారం అందించామని రాబోవు రోజులలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని అన్నారు.అనంతరం జాతరలోరావుల మిఠాయిలు పంచి నాయకులను, కార్యకర్తలను ఉత్సహపరిచారు. ఈకార్యక్రమంలో పురోహితులు శేషచారి, ఎంపిపి కృష్ణ నాయక్, సర్పంచులు వెంకట రమణ, దేవేందర్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, సింగిల్ విండో ఛైర్మెన్ మురళిదర్ రెడ్డి, సత్యం, పెద్ద ఆంజనేయులు గౌడ్, చిన్న ఆంజనేయులు గౌడ్, బాలస్వామి, అమరేందర్, మల్లేష్ గౌడ్, ప్రతాప్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

వక్స్ బోర్డు చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

తెలంగాణ రాష్ట్ర వక్స్ బోర్డు నూతన చైర్మన్ గా ఎన్నికైన సయ్యద్ అజ్మత్లుల్లా హుస్సేన్‌ను శనివారం హైదరాబాద్ లోని హజ్ హౌస్‌లో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, మహబూబ్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు ఆజ్మత్ అలి, గులాం జహీర్, షా ఫైసల్, మూసా జాఉష్, ఫకృద్దీన్, ఖాధర్, జహీద్, మహ్మద్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

స్వీప్ క్యాంపస్ అంబాసిడర్లకు ఓటుహక్కుపై అవగాహన

నోడల్ అధికారి రామమహేశ్వర్

వనపర్తి బ్యూరో ఫిబ్రవరి 24 (జనం సాక్షి)

ప్రతి ఒక్క విద్యార్థి ఓటు హక్కు ప్రాధాన్యతను తెలుసుకుని, ఎన్నికల్లో దాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి రామమహేశ్వర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాలతో విద్యార్థుల్లో ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసేందుకు స్వీప్ క్యాంపస్ అంబాసిడర్స్ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులకు శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటర్, డిగ్రీ కాలేజీ నుంచి ఇద్దరు విద్యార్థులను క్యాంపస్ అంబాసిడర్లుగా ఎంపిక చేసి వారికి ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఇక్కడ అవగాహన పొందిన క్యాంపస్ అంబాసిడర్లు తిరిగి వారి కళాశాలల్లోని విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేస్తారని రామ మహేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పద్మావతి, డీసీపీవో రాంబాబు, డీహెచ్ఈడబ్ల్యూవో భాస్కర్, తహసీల్దార్ యాదగిరి, ఈడీఎం తదితరులు పాల్గొన్నారు.

ఆటోలలో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదు

సిఐ భగవంత్ రెడ్డి

నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):

ఆటోలలో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోరాదు పేట సీఐ భగవంత్ రెడ్డి అన్నారు.శనివారం ఉదయం నారాయణపేట జిల్లా పరిధిలో ఉన్న స్కూలు కళాశాలల బస్సు, ఆటో డ్రైవర్లను పిలిపించి పోలీస్ స్టేషన్ ఆవరణలో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ భగవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తమ ఆటోలలో పరిమితికి మించి విద్యార్థులను, కూలీలను ఎక్కించుకోరాదని ఆటోలలో కెపాసిటీ ఉన్నంతవరకే ప్యాసింజర్ ఎక్కించుకోవాలని ఎక్కువ మొత్తంలో ఎక్కించుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, ఒకవేళ పరిమితికి మించి ప్యాసింజర్ ఎక్కించుకుంటే పట్టుకొని ఆర్టీవో గారికి అప్పగించడం జరుగుతుందని సిఐ తెలిపారు. ముఖ్యంగా స్కూల్ విద్యార్థులను రవాణా చేసే ఆటోలలో విద్యార్థులను ఎక్కువ మొత్తంలో ఎక్కించుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడరాదని ఆటో డ్రైవర్లకు హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు తప్పకుండా యూనిఫాం ధరించాలని సూచించారు. అలాగే వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు ఆర్‌సి ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని తెలిపారు. డ్రైవర్లు మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని, రాష్ డ్రైవింగ్ చేయరాదని స్కూల్ ముందల రోడ్లపైనే వాహనాలు ఆపి ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులను క్షేమంగా తమ ఇంటికి చేర్చాలని విద్యార్థులను ఇంటికి చేర్చే సమయంలో అసభ్యంగా ప్రవర్తించిన ఇబ్బందులకు గురిచేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ గ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు,ఏ ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది వాహన డ్రైవర్లు మొదలవారు పాల్గొన్నారు.

ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కోహెడ ఫిబ్రవరి 24 జనం సాక్షి:

కోహెడ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ కొక్కుల కీర్తి-సురేష్ ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా వివిధ శాఖల పనితీరుపై సమావేశం చర్చించారు. ఎంపీపీ మాట్లాడుతూ అదేవిధంగా గ్రామాల్లో దోమలకు సంబంధించిన మందులు పిచికారి చేయాలని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వచ్చే వేసవికాలంలో అన్ని గ్రామాలలో ప్రజలకు ఎలాంటి నీటి కొరత లేకుండా స్పెషల్ ఆఫీసర్ అందరూ అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందించాలని అన్నారు. పోలియో చుక్కల పై అధికారులకు పంచాయతీ సెక్రెటరీ లకు, ఎంపీటీసీలకు తెలియజేశారు. ప్రతి గ్రామంలో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. కరెంటు అధికారులు ప్రజలకు 24 గంటల సౌకర్యం అందించాలని తెలిపారు. అదేవిధంగా కోళ్లకు ,మేకలకు గొర్రెలకు బర్డ్ ఫ్లూ వస్తున్న సందర్భంగా వాటికి మందులు సహకారం వెటర్నరీ డాక్టర్లను సంప్రదించాలని అన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి వెంటనే పరిష్కరించాలని కోరారు. వివిధ శాఖలో జరుగుతున్న అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిష్టయ్య తాహాసిల్దార్ సురేఖ, ఎంపీటీసీలు వివిధ గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలనకు ఆకర్షితులై రిటైర్డ్ ఉద్యోగులు కాంగ్రెస్‌లో చేరిక

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులతో పాటు రిటైర్డ్ ఉద్యోగులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని సి డబ్ల్యూ సి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి జి.హర్షవర్ధన్ రెడ్డిలు అన్నారు. మహబూబ్ నగర్ పట్టణ కేంద్రం లో రిటైర్డ్ ఉద్యోగులు వారిరువురి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది ఏళ్లుగా టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులకు గురైన పలు పార్టీల నాయకులతో పాటు రిటైర్డ్ ఉద్యోగులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఇన్నాళ్లు గత ప్రభుత్వ అరాచకాలను భరించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలోని అరాచకాలకు కళ్లెం వేసినట్లు అయిందని భావించి తమ ప్రభుత్వ పాలనను చూసి నమ్మకం కలిగి కాంగ్రెస్లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, టీజేఏసీ చైర్మన్ కె .రాజేందర్ రెడ్డి, మహబూబ్ నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మహబూబ్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు కోట్ల నర్సింహ రావు, సాయిదాస్ తదితరులు పాల్గొన్నారు.

4 రోజులు.. కోటి 40 లక్షల జనం హాజరు

మేడారం జాతరకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలు, అధికారుల సహకారం గొప్పది

విజయవంతానికి కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు : మంత్రి సీతక్క

ములుగు ప్రతినిధి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి)

మేడారం మహాజాతరకు నాలుగు రోజుల్లో కోటి నలభై లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. మేడారం జాతర ముగియ నుండడంతో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. తక్కువ సమయంలోనే జాతరకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. శుక్రవారం వరకు 10వేల బస్ ట్రిప్పులు నడిచాయి. గుండె సమస్యతో వృద్ధురాలు, మరో యువతి జాతరలో మృత్యువాత పడ్డారని, మద్యం సేవించి జంపన్న వాగులో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు వివరాలను వెల్లడించారు. చిన్నచిన్న ఘటనలు మినహా జాతర విజయవంత మైందన్నారు. అమ్మవార్ల వన ప్రవేశం కాసేపట్లో జరుగనుంది. వనప్రవేశం పూర్తయినా భక్తుల రద్దీ కొనసాగుతుందని చెప్పారు. ఆదివారం వరకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. 4వేల మంది పారిశుధ్య సిబ్బంది విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. జాతరకు నిధులిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, క్యాబినెట్ మంత్రులకు, సహకరించిన భక్తులకు ధన్యవాదాలు తెలిపారు. మూడు రోజుల్లో దాదాపు కోటి మందికి పైగా భక్తులు సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్నారని అంచనా. అడవి బిడ్డల జాతరలో అన్నీ తానై నిర్వహించిన మంత్రి సీతక్క జాతర సక్సెస్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. చివరిరోజు సమ్మక్క, సారలమ్మలు వన ప్రవేశానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మేడారం మహాజాతరలో నాలుగోరోజు సమ్మక్కను చిలుకల గుట్టకు, సారలమ్మను కన్నెపల్లికి, గోవింద రాజును కొండాయికి, పగిడిద్ద రాజును పూనుగొండ్లకు కాలనడకన తీసుకెళ్తారు. ఇలా దేవతలు వన ప్రవేశం చేయడంతో మహాజాతర ముగిసింది.

మేడారంలో వైద్య శిబిరాలు

మేడారంలో ఎండవేడిమికి కొందరు నీరసించడం, కొందరికి వాంతులు విరేచనాలు కావడంతో వైద్యసిబ్బంది అప్రమత్తం అయ్యింది. సామూహిక స్నానాలు ఆచరించడంతో వ్యాధులు ప్రబలే అవకాశముందని అలాంటి వారి కోసం మేడారంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారు. కుంభమేళాను తలపించే మేడారంలో భక్తులు సదుపాయాలు అందించడం ఎంతో కీలకం. అత్యవసర ప్రాథమిక చికిత్స సత్వరం అందించకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. అందుకే తెలంగాణ ప్రభుత్వం పెద్దఎత్తున వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. మేడారంలోని టీటీడీ కల్యాణమండంపలో 50 పడకల ఆస్పత్రిని సిద్ధం చేసింది. అయితే జాతరకు వచ్చే భక్తుల్లో ఎక్కువ మంది అశుభ్రమైన తినుబండారాలు, నీరు తాగి డయేరియాకు గురయ్యారని వైద్య బృందాలు వెల్లడించాయి. ఎక్కువ మంది విరోచనాలతో బాధపడ్డారని తెలిపారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని వైద్యశాఖ పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. జాతర జరిగినన్ని రోజులు నిరంతర వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారులు తెలిపారు, ఒక్కో షిఫ్ట్ లో 50మంది చొప్పున విధులు అందించారు. ఎమర్జెన్సీ వైద్యం అవసరమైన వారిని ములుగు ఏరియా ఆస్పత్రితోపాటు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చిన్నపాటి వైద్య సేవలను వైద్య శిబిరంలోనే అందించినట్లు వైద్యధికారులు తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలతో వచ్చిన తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవుడి దయతో ఎలాంటి విపత్తులు సంభవించలేదని వారు వెల్లడించారు.

జనసంద్రంగా మేడారం జాతర

అమ్మవార్ల వనప్రవేశంతో దర్శనానికి పోటెత్తిన జనం

ములుగు, ఫిబ్రవరి 24 (జనంసాక్షి): సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజులు శనివారం వన ప్రవేశం చేయనుండడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. . మధ్యాహ్నం 3 గంటల నుంచి గ్దదెల శుద్ది పక్రియ మొదలై 5 నుంచి 6 గంటల మధ్య జరుగుతుంది.... ఈ కార్యక్రమం అయిపోగానే మేడారం మహాజాతర పూర్తయినట్లు గిరిజన పూజారులు అధికారికంగా ప్రకటిస్తారు. బుధవారం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు రాకతో మొదలైన మహాజాతర వన ప్రవేశంతో ముగుస్తుంది. సమ్మక్క, సారలమ్మను వనం నుంచి జనంలోకి తీసుకొచ్చిన పూజారులే తిరిగి వన(ప్రవేశం చేయిస్తారు. ఇందుకోసం శనివారం మధ్యాహ్నం నుంచే గద్దెల దగ్గర పూజలు జరుగుతాయి. ఈ క్రమంలో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మూడురోజుల్లో కోటి మందికి పైగా భక్తులు తరలివచ్చారని దేవాదాయశాఖ అధికారులు ప్రకటించారు. సారలమ్మను కన్నెపల్లి నుంచి గ్దదెలపైకి తీసుకొచ్చిన బుధవారం 20 లక్షల మంది దాకా, సమ్మక్కను తీసుకొచ్చిన గురువారం 30 లక్షల మందికిపైగా, శుక్రవారం 50 లక్ష మందికి పైగా మేడారం వచ్చారని వెల్లడించారు. గురువారం నుంచి మేడారం చుట్టూ రెడ్డిగూడెం, ఊరట్టం, నార్లాపూర్, కన్నెపల్లి ఏరియాలన్నీ పూర్తిగా భక్తులతో నిండిపోయాయి. బుధవారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు మేడారం గ్దదెలు నిమిషం కూడా ఖాళీలేకుండా భక్తులతో నిండిపోయి ఉన్నాయి. ఇలా మూడు రోజుల్లో కలిపి సుమారు కోటి మందికి పైగా మేడారానికి వచ్చారని అధికారులు ప్రకటించారు. మహాజాతరకు శనివారం చివరి రోజు కావడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

కాంగ్రెస్‌తో 'ఆప్'గ్రేడ్

ఢిల్లీ, గుజరాత్‌లలో కలిసి పోటికి అంగీకారం

ఢిల్లీలో 3 సీట్లకు కాంగ్రెస్ పోటీ

గుజరాత్‌లో ఆప్‌కు రెండు సీటు కేటాయింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):

ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీపార్టీ(ఆప్)ల మధ్య సీట్ల పంపిణీ ఖాయమైంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఢిల్లీలో రెండు పార్టీలు కలిసి పోటీ చేయనున్నాయి. ఈ మేరకు రెండు పార్టీల మధ్య సీట్ల పంపకం కూడా పూర్తయిందని ఆ పార్టీ నేతలు శనివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. పొత్తులో భాగంగా ఢిల్లీలోని 7 సీట్లలో నాలుగింటిలో ఆప్, మూడింటిలో కాంగ్రెస్ పోటీ చేయనుంది.న్యూఢిల్లీ, దక్షిణ ఢిల్లీ, పశ్చిమ ఢిల్లీ, తూర్పు ఢిల్లీల్లో ఆప్ పోటీ చేయనుండగా చాందినీ చౌక్, నార్త్ ఈస్ట్ ఢిల్లీ, నార్త్ వెస్ట్ ఢిల్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేయనున్నారు. 2014,2019 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా బీజేపీ ఢిల్లీలోని మొత్తం ఏడు సీట్లను కైవసం చేసుకోవడం విశేషం. కేవలం ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా కూడా కొన్ని సీట్లను ఆప్‌కు ఇచ్చేందుకు కాంగ్రెస్ ఓకే చెప్పింది.ఇందులో భాగంగా హర్యానాలో ఒకటి, గుజరాత్‌లో రెండు సీట్ల నుంచి కూడా పొత్తులో భాగంగా ఆప్‌కు కాంగ్రెస్ ఆఫర్ చేసింది. ఈ వారంలోనే ఇండియా కూటమిలోని మరో ప్రధాన పార్టీ సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)తో కాంగ్రెస్ సీట్ల పంపకం ఖరారైన విషయం తెలిసిందే. పొత్తులో భాగంగా యూపీలో ఎస్పీ 63, కాంగ్రెస్ 17 చోట్ల పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. అయితే కూటమిలోని మరో పార్టీ అయిన తృణమూల్ కాంగ్రెస్ మాత్రం పశ్చిమబెంగాల్‌లోని మొత్తం 42 సీట్లలో తామే పోటీ చేస్తామని చెబుతుండడం ఇండియా కూటమి నేతలను కలవరానికి గురిచేస్తోంది. కాంగ్రెస్ పార్టీ.. ప్రతిపక్షాల ఇండియా కూటమిలో భాగంగా పలు రాష్ట్రాల్లో సీట్ల పంపకంపై కసరత్తు చేస్తోంది. ఇప్పటికే.. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీతో సీట్ల సర్దుబాలు కొలిక్కి వచ్చిన విషయం తెలిసిందే. అదే విధంగా గురుజరాత్‌లో సైతం కాంగ్రెస్ పార్టీ ఆప్‌తో సీట్ల పంపకాన్ని ఫైనల్ చేసింది. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ, ఆప్ పొత్తులో భాగంగా పోటీ చేయనున్నాయ. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ.. ఆప్‌కు రెండు సీట్లను ఆఫర్ చేసింది. ఈ మేరకు ఇరు పార్టీలు అధికారి కంగా ప్రకటించాయి. అయితే కాంగ్రెస్, ఆప్ పొత్తుపై పలువురు నేతలు స్పందిస్తున్నారు. తాజాగా అహ్మద్ పటేల్ కూతురు ముంతాజ్ పటేల్ ఎక్స్ ' ట్విటర్' వేదికగా స్పందించారు. 'భారుచా జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు, పార్టీ కేడర్‌కు క్షమాపణలు తెలుపుతున్నా. కాంగ్రెస్, ఆప్ పొత్తులో భాగంగా భారు చా లోక్‌సభ స్థానం పొందలేకపోయాం. మీ నిరాశను నేను పంచుకుంటా ను. మనమంతా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం. 45 ఏళ్ల అహ్మద్ పటేల్ వారసత్వాన్ని వృథా కానివ్వం' అని ఆమె తెలిపారు. గుజరాత్‌లో పొత్తులో భాగంగా భారుచా లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ.. ఆప్‌కు కేటా యించింది. ఈ క్రమంలో మంతాజ్ ఖాన్ ఆ స్థానంపై ఆశపెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంనే ఆమె తన జిల్లా కేడర్‌కు క్షమాపణలు చెప్పినట్లు చర్చ జరుగుతోంది. మరోవైపు.. అహ్మద్ పటేల్ కుమారుడు ఫైసల్ కూడా స్పందించారు. 'నేను మరోసారి కాంగ్రెస్ అధిష్టానాన్ని కలిసి మాట్లాడుతా. నామినేషన్ వేయడానికి ఇంకా చాలా సమయం ఉంది. గాంధీ కుటుంబం నా కుటుంబంతో సమానం. భారుచా లోక్‌సభ స్థానానికి సంబంధించి.. అహ్మద్ పటేల్ కుటుంబానికి ఉన్న సెంటిమెంట్‌ను అధిష్టానం అర్థం చేసుకుంటుందని ఆశిస్తున్నా'అని తెలిపారు. 'పార్టీ నిర్ణయంపై కార్యకర్తలు, నేను సంతోషంగా లేము. ఈ నిర్ణయం తీసుకోకూడదని మేము కోరుకున్నా ము. కానీ కాంగ్రెస్ హైకమాండ్ తీసుకుంది. కావున మేము దాన్ని అనుసరి స్తాం. పార్టీ నిర్ణయాన్ని నేను, కార్యకర్తలం అనుసరిస్తాం?' అని పేర్కొన్నారు.

దేశానికి కాంగ్రెస్ చేసిందేమి లేదు

భవిష్యత్తుపై ఆ పార్టీ నాయకులకు పట్టింపు లేదు. కాంగ్రెస్ ఎప్పుడూ రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలు తీసుకుంటుంది. ఇప్పటికీ కాంగ్రెస్ దశ, దిశ మారలేదు. బంధుప్రీతి, అవినీతి, అలకలు, బుజ్జగింపులు ఇవి తప్పా వేరే విషయంపై ఆలోచించదు. కాంగ్రెస్ నేతలు వారి కుమారులు, కుమార్తెల రాజకీయ భవిష్యత్తును రూపొందించడంలో బిజీగా ఉన్నారు. పేద ప్రజల కుమారులు, కుమార్తెల గురించి వారు ఎప్పుడూ ఆలోచించరు. దేశ ప్రజలంతా మోదీ కుటుంబ సభ్యులు. అందుకే దేశ అభివృద్ధి గురించే నేను, మా పార్టీ నేతలు మాట్లాడుతుంటారు. పేదలు, యువత, మహిళా సాధికారతతోనే అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించవచ్చు. ఛత్తీస్‌గఢ్‌లో గత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పథకాన్ని నిలిపేసింది. మా ప్రభుత్వం ఆ పనుల్ని వేగవంతం చేసింది' అని మోదీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయ్, మంత్రులు పాల్గొన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా ఏపీకి కేటాయించిన ఎయిమ్స్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ ఆధునిక వైద్య దేవాలయాన్ని నేడు ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. మంగళగిరి ఎయిమ్స్‌ను ప్రధాని మోడీ జాతికి అంకితం చేయనున్నారు. అలాగే 9 క్రిటికల్ కేర్ యూనిట్లకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నారు. రూ.1618 కోట్ల వ్యయంతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కేంద్రమే ఎయిమ్స్ నిర్మించింది. ఇక్కడ వైద్యకళాశాల, మెడికల్ ల్యాబ్, నర్సింగ్ కళాశాల, ఆపరేషన్ థియేటర్లతోపాటు, ఇన్ పేషెంట్, అత్యవసర సేవలు, రెసిడెన్సియల్ బ్లాక్, గెస్ట్ హౌస్ , అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ తోపాటు ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించారు. 2019 మార్చి నుంచే రోగులకు సేవలు అందిస్తున్నారు. రోజుకు రెండున్నర వేలమంది రోగులు ఇక్కడికి వస్తున్నారు. ఇప్పటికే 15 లక్షల మందికి ఓపీ సేవలు అందగా.. మరో 20 వేల మంది ఇన్‌పేషెంట్‌గా జాయిన్ అయి చికిత్సలు పొందారు. మరో 12 వేల మందికి అత్యవసర చికిత్సలు అందించారు.

కంపుకొడుతున్న బయ్యారం

పడకేసిన పారిశుధ్యం.. పట్టించుకోని పాలకవర్గం

నెలలు గడుస్తున్నా శుభ్రపరచని డ్రైనేజీలు

కంపుతో ముక్కు మూసుకుని గడిపేస్తున్న ప్రజలు

బయ్యారం, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది బయ్యారం గ్రామ పంచాయతీ పాలకవర్గం పనితీరు.జిల్లాకేంద్రం కు పట్టుమని పది కిలోమీటర్ల దూరం కూడా లేని బయ్యారం ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. సర్పంచుల పదవీ కాలం అయిదేళ్లలో కనీసం నాలుగైదు సార్లు కూడా డ్రైనేజీలోని వ్యర్థాలను తొలగించలేని దుస్థితి.పలుమార్లు జనంసాక్షి ఇదే విషయంపై కథనాలు ప్రచురించినా అప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ కొట్టి మమ అనిపించేవారు.ప్రస్తుతం సర్పంచుల పదవికాలం ముగిసి ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్ళిపోయింది గ్రామ పంచాయతీల పర్యవేక్షణ.అయితే బయ్యారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ బాధ్యతలు వచ్చాయి.రెవిన్యూ లోని పనులతోనే సతమతమయ్యే ఎమ్మార్వో, గ్రామపంచాయతీ లో క్షేత్ర స్థాయి పనులపై దృష్టి సారించాలంటే కాస్త కష్టంతో కూడుకున్నదే.కానీ మండల కేంద్రంలో ఇల్లందు మహబూబాబాద్ ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న డ్రైనేజీ లు దుర్గంధం వెదజల్లుతుంటే ఆ కంపు జిల్లా కేంద్రానికి కొట్టేలా ఉంది.జిల్లాలోని పలు గ్రామపంచాయతీలు ఆదర్శ గ్రామపంచాయతీలుగా విరాజిల్లుతున్నాయి.మేజర్ గ్రామ పంచాయతీల్లో ఒకటైన బయ్యారంలో మాత్రం పాలక మండలి నిర్లక్ష్యంతో పారిశుధ్యం పడకేసింది. గడిచిన పదేళ్లలో బయ్యారం మండల కేంద్రంలో ఇల్లందు-మహబూబాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా నిర్మితమై ఉన్న డ్రైనేజీ వ్యవస్థపై పర్యవేక్షణ కరువైందనే చెప్పాలి. బయ్యారం గ్రామ పంచాయతీ తీరుతో పోలిస్తే కొత్తగా ఏర్పడిన జగ్గుతండా గ్రామపంచాయతీ పనితీరు కాస్త నయమనే చెప్పాలి. ప్రభుత్వాలు,ప్రజాప్రతినిధులు ఎందరు మారినా బయ్యారంలో అభివృద్ధి మాట దేవుడెరుగు...పరిశుభ్రత కరువై మెయిన్ రోడ్డు పై నిలబడాలంటే ముక్కు మూసుకోవల్సినపరిస్తితి నెలకొంది.కనీసం నెలకోసారైనా డ్రైనేజీని శుభ్రపర్చకపోవడం ఒక కారణమైతే మెయిన్ రోడ్డుకి ఇరువైపులా ఉన్న హోటల్స్, నివాస గృహాల

మరుగు దొడ్లలలోని మల,మూత్ర విసర్జనకు సంబంధించిన పైపులు డ్రైనేజీ లోకి విడుదల చేయడంతో ఇర్సులాపురం ఆటోలు నిలిపే ప్రదేశంలో ప్రజలు తీవ్ర అవస్థలుపడుతున్నారు.హోటల్స్ లోని వ్యర్థాలను డ్రైనేజీ లోకి విడుదల చేయడంపై గ్రామపంచాయతీ పాలకవర్గం చూసి చూడనట్లు వ్యవహరించడంతో దశాబ్ద కాలంగా కిరాయికి ఉండే దుకాణదారులు, ప్రజలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి.ఒకవేళ గ్రామపంచాయతీ అధికారులు డ్రైనేజీలు శుభ్రపరచాలని ఆదేశాలు జారీ చేసినా సిబ్బంది మాత్రం ఎందుకు భిన్నంగా ఉన్నారు.డ్రైనేజీల ఆక్రమణే ప్రధాన సమస్య.డ్రైనేజీల వ్యర్థాల తొలగింపుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నా డ్రైనేజీలను ఆక్రమించిన వ్యాపారస్తులు అందుకు సిద్ధంగా లేరు. హోటల్స్, కిరాణా దుకాణాలు, పండ్లు,కూరగాయల దుకాణ దారులు వంటి పలు వ్యాపారాలకు ఆటంకం ఏర్పడుతుందనే ఉద్దేశంతో ఉన్నారు.ఆటో స్టాండ్ లో ఉండలేని పరిస్థితిబయ్యారం నుండి ఇర్సులాపురం వెళ్లే ఆటో స్టాండ్ దగ్గర మురుగు కాలువలో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది.అడ్డా మీద సీరియల్ లో ఉంచిన ఆటో జనాలతో నిండేందుకు సుమారు 30 నిముషాలపైనే సమయం పడుతుంది. డ్రైనేజీ నుండి వచ్చే కంపుతో ఆటోలో ఎక్కిన ప్రయాణికులు సైతం ఊపిరి బిగబడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. రోజూ ఇక్కడే ఉంటూ ఈగలు, దోమల కారణంగా అంటువ్యాధులు,వైరల్ ఫీవర్ లు వచ్చి తాము అవస్థలుపడుతున్నామని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోని మండల కేంద్రంలోని డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రిజర్వాయర్ల బాధితులను ఆదుకోవాలి

- పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించాలి
- మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పాలకుర్తి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి)

పాలకుర్తి చెన్నూరు రిజర్వాయర్ల తో పాటు కాలువల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన బాధిత రైతులను ఆదుకునేందుకు నష్టపరిహారం అందించేందుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార , పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి హైదరాబాదులో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిపై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి పై నమ్మకంతో పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించారని తెలిపారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గం ప్రజలకు అభివృద్ధిపై అనేక హామీలు ఇచ్చామని, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ అభివృద్ధి పనులతో పాటు కాలువల క్రింద భూములు కోల్పోయిన రైతులు వందలాదిమంది నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారని మంత్రి శ్రీనివాస్ రెడ్డికి వివరించారు. రిజర్వాయర్ పనులు పూర్తి కాకపో వడంతో కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల మండలాలకు నేటికీ పూర్తి స్థాయిలో సాగునీరు అందలేదని తెలిపారు. దేవాదుల వరద కాలువతో పాటు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవడమే ధ్యేయంగా ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. పాలకుర్తి రిజర్వాయర్లో బొమ్మెర గ్రామానికి చెందిన రైతులు భూములు కోల్పోయారని, భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవడంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రిజర్వాయర్ల తోపాటు కాలువల క్రింద భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించాలని, ఆదర్శవంతమైన నియోజక వర్గంగా తీర్చి దిద్దడమే తన ముందున్న కర్తవ్యం అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై నిధులు కేటాయించాలని మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కోరడంతో స్పందిం చారని, రిజర్వాయర్లలో భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవడంతో పాటు పాలకుర్తి నియోజకవర్గం పై ప్రత్యేక అదృష్ట పెట్టి అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తానని భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలిపారు.

వన ప్రవేశం చేసిన అమ్మవారిపేట సమ్మక్క సారలమ్మ దేవతలు

వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి)

వరంగల్ నగర సమీపంలోని అమ్మవారిపేట సమ్మక్క సారలమ్మ జాతర లో భాగంగా శనివారం సాయంత్రం సమ్మక్క సారలమ్మ దేవతలను మన ప్రదేశం చేశారు, ఈనెల 21 నుంచి ప్రారంభమైన సమ్మక్క సారమ్మ జాతరలో భాగంగా శనివారంతో జాతర ముగిసింది ఈ జాతరలో భక్తులు లక్షలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు ఈ సందర్భంగా అమ్మవారిపేట సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవ కమిటీ మరియు ధర్మకర్తలు పూజారులు బొరిశెట్టి శ్యాంసుందర్ ఐత జంపాయ రాములు సంజీవ్ ఆవునూరు సమ్మయ్య తో పాటు బైరి నాగరాజు బైరి హరినాథ్ ఆవునూరి రామ్మూర్తి ఆవునూరి కుమారస్వామి పూజారి విజయ్ ఆవునూరి నాగరాజు కందికొండ రమేష్ కార్పొరేటర్ జలగం అనిత రంజిత్ రామేశ్వర్ స్వామి దాసి రాందేవ్ ఆవునూరి నాగరాజు శివసత్తులు భక్తులు పాల్గొన్నారు.

మేడారంలో ప్రబలిన డయేరియా

అప్రమత్తం అయిన వైద్యసిబ్బంది స్థానికంగానే వైద్యసేవలు అందచేత

ములుగు, ఫిబ్రవరి 24 (జనంసాక్షి):

మేడారం జనజాతరను తలపిస్తోంది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. ఈ క్రమంలో ఎండవేడిమికి కొందరు నీరసించారు. కొందరికి వాంతులు విరేచనాలు కావడంతో వైద్యసిబ్బంది అప్రమత్తం అయ్యింది. కుంభమేళాను తలపించే రీతిలో లక్షలాది జనం పోటెత్తారు. చివారి రోజు కావడంతో మేడారం వెళ్లేదారులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఇంతపెద్దఎత్తున జనం ఒకచోట గుమిగూడటంతో పాటు జంపన్న వాగులో సామూహిక స్నానాలు ఆచరిస్తుండంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.అలాగే జనం ఒత్తిడికి భక్తులు సొమ్మసిల్లిపడిపోతున్నారు. అలాంటి వారి కోసం మేడారంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారు. కుంభమేళాను తలపించే మేడారంలో భక్తులు సదుపాయాలు అందించడం ఎంతో కీలకం. అత్యవసర ప్రాథమిక చికిత్స సత్వరం అందించకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. అందుకే తెలంగాణ ప్రభుత్వం పెద్దఎత్తున వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. మేడారంలోని టీటీడీ కల్యాణమండంపలో 50 పడకల ఆస్పత్రిని సిద్ధం చేసింది. అయితే జాతరకు వచ్చే భక్తుల్లో ఎక్కువ మంది అశుభ్రమైన తినుబండారాలు, నీరు తాగి డయేరియాకు గురయ్యారని వైద్య బృందాలు వెల్లడించాయి. ఎక్కువ మంది విరోచనాలతో బాధపడ్డారని తెలిపారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని వైద్యశాఖ పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. జాతరలో వివిధ ప్రాంతాల్లో 40 ఉచిత వైద్య శిబిరాలతో పాటు ఎమ్జంగ్÷న్సీ సమయంలో భక్తుల వద్దకు వెళ్లేందుకు 40 మొబైల్ అంబులెన్సులు, ఇరవై 108 వాహనాలను జాతరలో నిరంతరం భక్తులకు అందుబాటులో ఉంచారు. వీటితో పాటు గ్దదె ల సమీపంలో అన్ని విభాగాలకు చెందిన వైద్య సిబ్బందితో నాలుగు రోజుల పాటు జరిగిన జాతరలో భక్తులకు నిరంతర సేవలందిచారు. భక్తులు సైతం నిరంతర ఉచిత వైద్య శిబిరాల వద్దకు వచ్చి సమస్యలను చెప్పుకొని మందులు తీసుకువెళ్ళారు. ఎండ వేడికి తోడు ఉక్కపోతతో మేడారంభక్తుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు

తోసుకోవడంతో పాటు...గంటల కొద్దీ క్యూలైన్ లో నిల్చుని నీరసించిపోయారు. అలాగే సమయానికి తినకపోవడం, అపరిశుభ్రవాతావరణంలో తినడం వల్ల భక్తులు విరోచనాలతో బాధపడ్డారు. కొందరు భక్తులకు ఫిట్స్ రాగా...మరికొందరు గుండెపోటుకు గురయ్యారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్న భక్తులు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. బీపీ, షుగర్ ఉన్న భక్తుల కోసం వైద్య సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జాతర జరిగినన్ని రోజులు నిరంతర వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారులు తెలిపారు, ఒక్కో షిఫ్ట్ లో 50మంది చొప్పున విధులు అందించారు. ఎమర్జెన్సీ వైద్యం అవసరమైన వారిని ములుగు ఏరియా ఆస్పత్రితోపాటు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చిన్నపాటి వైద్య సేవలను వైద్య శిబిరంలోనే అందించినట్లు వైద్యధికారులు తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తాం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

చింతలపాలెం (జనంసాక్షి) : రాష్ట్రంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడం,ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం,లిఫ్ట్ ల పునరుద్ధరణతో రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శనివారం హుజూర్నగర్ నియోజక వర్గంలోని చింతలపాలెం మండలం నక్కగూడెం లో లిఫ్ట్ పునరుద్ధరణకు రాష్ట్ర భారీ నీటి పారుదల,పౌర సరఫరా శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి,రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రితో కలసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నక్కగూడెం లిఫ్ట్ పునరుద్ధరణ ద్వారా ఈ ప్రాంతంలో 3200 ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని అన్నారు.ఈ లిఫ్ట్ మరమ్మత్తులకు దాదాపు 35 కోట్లు మంజూరు చేయడం జరిగిందని అలాగే ఈ ప్రాంత రోడ్లలు చేపట్టుటకు మరో 40 కోట్లు అందించనున్నట్లు తెలిపారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన రోడ్లు,లిఫ్ట్ లు గత పాలకుల మరమ్మత్తులు చేపట్టక పోవడం వలన ఈ ప్రాంతం పూర్తిగా ఎడారిగా మారిందని ఇకపై ఇందిరమ్మ పాలనలో అన్ని లిఫ్ట్ లు,రోడ్లు చేపడతామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు వలన రైతులకు మేలు జరగలేదని కోట్ల రూపాయల ప్రజా ధనం వృధా అయ్యిందని తెలిపారు.ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని,ఇకపై రాష్ట్రంలోని మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తాని స్పష్టం చేశారు.అర్హులైన వారందరికీ ఆరు గ్యారంటీలు పక్కాగా అందిస్తామని అలాగే రాష్ట్రంలో సంపద,వనరులు ప్రజలకే అందాలని ప్రభుత్వం ఆదిశగా దృఢ సంకల్పంతో పనిచేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చట్టం తెచ్చి గిరిజనులకు పోడు పట్టాలు అందించాని అలాగే త్వరలో ప్రభుత్వం గిరిజనులకు పోడు పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.రాష్ట్ర నీటి పారుదల,పౌర సరఫరా శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన లిఫ్ట్ లు,రోడ్లు ఈ ప్రాంతంలో కనబడుతున్నాయని 10 సంవత్సరాలు కొనసాగిన ప్రభుత్వం ప్రజలు,రైతులు ఎంతో నష్ట పోయారని విమర్శించారు.కాళేశ్వరం సమస్యలు చెప్పలేన్నని ఉన్నాయని ప్రజా ధనం ఎంతో దుబారా జరిగిందని అన్నారు.ఈ నెల 27 న త్వరలో మరో రెండు సీఎం రేవంత్ రెడ్డి, ప్రియాంక గాంధీ చేతుల మీదుగా రూ. 500 లకు గ్యాస్ సిలెండర్, పేద ప్రజలకు 200 యూనిట్లు ఉచితంగా అందిస్తామని అన్నారు.రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమిటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజలకు మెరుగైన సేవలందించాలని గత ప్రభుత్వం ప్రజలకు మెప్పించి చేపట్టిన పనుల్లో కమిషన్లు కక్కుర్తి పడ్డారని పేర్కొన్నారు.లిఫ్ట్ ద్వారా ఈ ప్రాంత రైతాంగ సాగు గణనీయంగా పెరుగుతుందని అలాగే త్వరలో రోడ్లను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.తదుపరి దొండపాడు లో రూ. 400 కోట్లతో చేపట్టే ఇన్నోవేరా ప్యాక్టరీ నిర్మాణానికి సహచర మంత్రులతో కలసి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే,నీటి పారుదల చీఫ్ ఇంజనీర్ రమేష్,అదనపు కలెక్టర్ ఏ.వెంకట్ రెడ్డి,అదనపు ఎస్పీ నాగేశ్వర రావు, ఆర్డిఓ జగదీశ్వర్ రెడ్డి,తహసీల్దార్ సురేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కోడింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

-మాజీ మంత్రి ఆర్డీఆర్

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి): నిరుద్యోగ యువత మెడికల్ కోడింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డులో మెడ్ సోల్ మెడికల్ కోడింగ్ సొల్యూషన్స్ శిక్షణ సంస్థను ఆయన ప్రారంభించి మాట్లాడారు.డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఇలాంటి శిక్షణ సంస్థలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలన్నారు. మెడిసోల్ మెడికల్ కోడింగ్ సంస్థ డైరెక్టర్ మాచర్ల కిరణ్ మాట్లాడుతూ మెడికల్ కోడింగ్ శిక్షణకు డిగ్రీ అపైన చదివిన విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులని అన్నారు.నిరుద్యోగ యువత మెడికల్ కోడింగ్ లో శిక్షణ తీసుకుంటే హైదరాబాద్, బెంగళూరు,చెన్నైలో ఉపాధి అవకాశాలు కల్పిస్తా మన్నారు. ప్రస్తుతం ఆన్ లైన్ లో కొనసాగుతున్న ఈ శిక్షణ మార్చి ఒకటి నుంచి ఆఫ్ లైన్ లో అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు.ఈ శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు దరావత్ వీరన్న నాయక్,దిలీప్ రెడ్డి,చింతమళ్ళ రమేష్, పంతంగి దశరథ,కౌన్సిలర్లు అభినయ్, పద్మ, నిర్వాహకులు కిరణ్, సిబ్బంది శిరీష, యమున తదితరులు పాల్గొన్నారు.

తనవంతు సహాయంగా పెన్షన్‌ని ప్రభుత్వానికి అందించిన రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్ గులాం జాఫర్ జాఫర్ ను అభినందించి సత్కరించిన జర్నలిస్టులు

ఖమ్మం ఆర్సి, ఫిబ్రవరి24 (జనంసాక్షి)

'మానవత్వం పరిమళించే మంచి మనసుకు స్వాగతం' అనే నాటి పాటకు సారూప్యమే 78 సంవత్సరాల రిటైర్డ్ ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్ గులాం జాఫర్ ప్రభుత్వ ఆర్థిక స్థితిని అర్థం చేసుకొని సంక్షేమ పథకాల అమలులో 'నేను సైతం' అనే దృక్పథంతో తనకు వచ్చే ఫిబ్రవరి నెల పింఛన్ రూ.20వేలను ఖమ్మం కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ఇవ్వనున్నట్లు విలేకరుల సమావేశంలో తన మానవత్వాన్ని చాటుకున్నారు.ఖమ్మం ప్రెస్ క్లబ్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖమ్మం నగరానికి చెందిన ఏఆర్ రిటైర్డ్ కానిస్టేబుల్ (పిసి 1336) గులాం జాఫర్ పాల్గొని మాట్లాడుతూ.. తాను 1981లో కానిస్టేబుల్ గా పదవీ విరమణ పొందానన్నారు. ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రానికి ఆర్థిక సహాయం అందించి ప్రజా సంక్షేమ పథకాల అమలుకోసం తన వంతుగా పాటుపడుతున్నానని అన్నారు. అలాగే జిల్లాలో ఆర్థికంగా ఉన్నటువంటి మేధావులు, విద్యావంతులు, డాక్టర్లు, ఆసుపత్రి యాజమాన్యాలు, వ్యాపారులు, రాజకీయ నాయకులు అధిక మొత్తంలో రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించి రాష్ట్రంలోనూ, దేశంలోనూ సాయం చేసుటలో ఖమ్మం జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సయ్యద్ సలీం పాల్గొన్నారు. రిటైర్డ్ కానిస్టేబుల్ జాఫర్ ను సన్మానించిన ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు : 78 ఏండ్ల వయసులో కూడా తనకు వచ్చే ఫిబ్రవరి నెల పింఛన్ మొత్తాన్ని మానవత్వంతో రాష్ట్ర ప్రభుత్వానికి సాయంగా అందిస్తున్న గులాం జాఫర్ ను ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, జర్నలిస్టులందరూ శాలువతో సత్కరించి అభినందించారు.

కలెక్టర్ గారూ.. డిగ్రీ కాలేజీని గాడిలో పెట్టరూ..!

- ఎన్ఎస్ఎస్ పేరిట భారీగా వసూళ్లు
- విద్యార్థులు పస్తులు
- ఆహ్వానం ఒకరోజు ముగింపు మరో రోజు
- ఎమ్మెల్యేకు సైతం అందని ఆహ్వానం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 24, (జనంసాక్షి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పినపాక నియోజకవర్గానికి ఉన్న ఏకైక డిగ్రీ కాలేజీలో నిర్లక్ష్యం, నిరాశావాదం, అరాచకం రాజ్యమేలుతోంది. ఆ పని ఈ పని అంటూ కబుర్లు చెబుతూ కాలం వెళ్లదీస్తూ మాటలతో కోటలు దాటించే కళాశాల పెద్ద చేస్తున్న ఆగడాలు నానాటికి శృతి మించుతున్నాయి. ఎన్ఎస్ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీమ్) అంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులపై చేస్తున్న బలవంతపు పైశాచిక కార్యక్రమాలు కళాశాల పరువును రోడ్డుకీడుస్తున్నాయి. అసు 'మతి' లేని ఎన్ఎస్ఎస్ పేరుతో దాతల నుండి చేసిన వసూళ్లు విద్యార్థులను పస్థులుంచి పెట్టిన అవస్థలు వెగటు పుట్టిస్తున్నాయి. ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ కనీసం నెలలో ఒక్కసారి అయినా కాలేజీని క్షేత్రస్థాయిలో సందర్శించకపోవడంతో ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తూ అడ్డగోలు పనులకు తెరలేపిన సారు లీలలను వింటూ ఆ కాలేజీ విద్యార్థులను దేవుడే కాపాడాలంటూ ప్రజలు ప్రార్థిస్తున్నారు.

చడీసప్పుడు లేకుండా మమ అనిపించి... ముగించేశారు...!

ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో వారం రోజుల పాటు పరిసరాల శుభ్రతతో పాటు విద్యార్థులకు తెలియని అంశాలను రికార్డు చేసి యూనివర్శిటీకి సమర్పించాల్సి ఉంటుంది. 12వ తేదీన మొదలైన క్యాంప్ 18వ తేదీన ముగించి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉంది. కానీ 23వ తేదీన మేడారం జాతర ప్రభుత్వ సెలవు ఉన్నప్పటికీ ఆ రోజు పిల్లలను ఆటోల్లో అశ్వాపురం మండలం గొందిగూడెం ఆశ్రమ పాఠశాలకు తీసుకెళ్లి ముగింపు కార్యక్రమం నిర్వహించారు. దాతల వద్ద 360 మంది విద్యార్థులు అని చెప్పి సాయం కోరిన సారు క్యాంపులో ఉన్న విద్యార్థులకు ఒక్కరోజు కూడా భోజనం ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. ముగింపు కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యేకు, అశ్వాపురం ప్రథమ పౌరురాలికి కూడా కనీస ఆహ్వానం అందకపోవడం గమనార్హం. జిల్లా ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా కేవలం కరపత్రానికే పరిమితం కావడం, నియోజకవర్గంలో ఏకైక డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్న తీరుకు అద్దం పడుతున్నాయి. గెజిట్ అధికారి, ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి దాతల సాయం కోరరాదని తెలిసి కూడా వెయ్యికి, రెండు వేలకు, క్వింటా బియ్యానికి చేయిచాపి వచ్చినవాటిని పక్కదారి పట్టించి, జేబులు నింపుకున్నట్టు బలమైన సమాచారం ఉంది. వారం రోజుల్లో ఒక్కరోజు కూడా ముద్ద అన్నం పెట్టకుండా విద్యార్థులను పస్తులుంచి తీవ్ర ఇబ్బందులకు గురించేశాడని తెలిసింది. వసూల్ రాజాపై మరోరోజు పూర్తి వివరాలతో **జనంసాక్షి**లో ప్రత్యేక కథనం.

లక్ష్యం సాధించాలంటే, చదువును ఇష్టంతో చదవాలి

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి)

విద్యార్థులు చదువు ను కష్టపడి కాకుండా ఎంతో ఇష్టపడి చదవటం వారికి ఎంతో అవసరమని ట్రస్మా ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుర్రం కాంతారావు, మామిల్లగుడెం కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు అన్నారు. నగరం లోని స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రం లో శుక్రవారం వి.డి.ఓ.స్. కాలనీ లోని తెలంగాణ నారాయణ స్కూల్ మరియు మామిళ్ళ గూడెం లోని మోంటెస్సోరి హై స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన పాఠశాలల వార్షికోత్సవాన్ని ట్రస్మా ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుర్రం కాంతారావు, ఖమ్మం కార్పోరేషన్ 49వ డివిజన్ కార్పోరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థుల్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ "ప్రతి విద్యార్థి తన జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని, దానిని సాకారం చేసుకునే దిశగా తన వంతు ప్రయత్నం చేయాలని, అలాగే చదువుతో పాటు ప్రతి విద్యార్థి ఆటలు మరియు కళలు పట్ల కూడా మక్కువ పెంచుకోవాలని" అన్నారు. పాఠశాల డైరెక్టర్లు లక్కీరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి, గన్నవరపు చంద్రశేఖర్ రావు మరియు కొదుమూరి నాగపవన్ లు మాట్లాడుతూ 'తమ పాఠశాలలలో రెగ్యులర్ చదువుతో పాటు ఫౌండేషన్ విద్య పై దృష్టి పెట్టి సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించామని, క్రీడలతో కూడా తగు ప్రాధాన్యం ఇస్తామని, తమ పూర్వ విద్యార్థులు ప్రస్తుతం దేశం లోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో సీట్లు సంపాదించుకున్నారని , అది తమ పాఠశాలలకు ఎంతో గర్వ కారణం అని " అన్నారు. పలు అంశాలలో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు ఉన్నత విద్యలో ప్రతిభ చూపిస్తున్న పూర్వ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన కళా రూపాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకొన్నాయి. వారు ప్రదర్శించిన బతుకమ్మ, బోనాలు, మేడారం జాతర విశిష్టత, రామాయణం లోని ముఖ్య ఘట్టాలు మరియు పిరమిడ్స్ అందరి ఒళ్ళు గగుర్పాటు చెందేలా చేశాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ నరేంద్ర వర్మ, వైస్ ప్రిన్సిపల్ సింహ రాజు మాంటిసోరి ఇన్చార్జెస్ సందీప్, నాగనాథ్, కమల మరియు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

తుమ్మలను-పొంగిలేటిని కలిసిన దొండపాటి

మధిర ఆర్ సి ఫిబ్రవరి 24 (జనంసాక్షి):

హైదరాబాదులో మినిస్టర్స్ క్వార్టర్స్ లో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన ఖమ్మం డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు. డిసిసిబి చైర్మన్ పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మర్యాదపూర్వకంగా రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు.అనంతరం దొండపాటి వెంకటేశ్వరరావు డిసిసిబి డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర్ రెడ్డి తో కలిసి వ్యవసాయ శాఖ మరియు సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ను కలిసి శాలువా కప్పి రాజీవ్ గాంధీ తుమ్మల నాగేశ్వరావు కలిసి ఉన్న ఫోటో ప్రేమను అందించారు.డిసిసిబి చైర్మన్ పదవి అలంకరించిన దొండపాటి వెంకటేశ్వరరావును ఇరువురు మంత్రులు అభినందించారు. ఈ సందర్భంగా దొండపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అభివృద్ధికి జిల్లాలో ముగ్గురు మంత్రుల సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. ఈ బ్యాంకు ద్వారా రైతులకు రుణాల విషయంలో మరియు ఈ బ్యాంకు ద్వారా పొందే అనేక సౌకర్యాలను రైతులకు అందించనున్నట్లు తెలిపారు.

న్యాయ వ్యవస్థ పై సన్నగిల్లుతున్న విశ్వాసం

- కుప్పకూలుతున్న ప్రజాస్వామిక వ్యవస్థలు
- ఆలస్యమవుతున్న తీర్పులు కొత్త న్యాయస్థానాల ఏర్పాటు
- అవినీతి లేని సమాజం కోసం ప్రయత్నించండి..
- న్యాయం పేదల పక్షాన నిలవాలి
- ఐఏఎల్ మహాసభలో జస్టిస్ చంద్రకుమార్

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 24 (జనంసాక్షి): పాలక వర్గాల, రాజకీయ నేతల జోక్యంతో న్యాయ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుందని రిటైర్డ్ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ చంద్రకుమార్ పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థ సమర్థవంతంగా, నిజాయితీగా పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం పరిడవిల్లుతుందని లేదంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆయన హెచ్చరిస్తూ ఛండీఘడ్ కార్పోరేషన్ ఎన్నికల ఫలితాలు సుప్రీం తీర్పును ఉదహరించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఉమ్మడి ఖమ్మంజిల్లా –తొమ్మిదవ మహాసభ శనివారం మేకల భాస్కరావు ప్రాంగణం డిపిఆర్సి లో జరిగింది. పెమ్మసాని పట్టాభి, ఉదయ్ భాస్కర్ – అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ మహాసభలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్లో ఉండటం శ్రేయస్కారం కాదని త్వరితగతిన తీర్పులు రావడం ద్వారా న్యాయస్థానాన్ని ఆశ్రయించే వారికి మేలు జరుగుతుందన్నారు. దాదాపు 50 శాతం కేసులు అనవసరమైనవిగా ఉంటున్నాయని ఇది బాధాకరమన్నారు. ప్రభుత్వాలు – అనవసర వ్యాజ్యాలకు పోయి సమయం, ప్రజా ధనం వృథా చేస్తున్నాయన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగి రూ. 20 వేల –ఆర్థిక లావాదేవీలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే రూ. 10 లక్షలు ప్రభుత్వం ఖర్చు పెడుతుందని కానీ ట్రిబ్యూనల్స్ తీర్పును –అంగీకరించడం లేదని ఇటువంటి ఉదహరణలు అనేకం ఉన్నాయన్నారు. దేశ వ్యాప్తంగా న్యాయ వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం సాగుతుందని న్యాయ వ్యవస్థకు సంబంధించిన అనేక చట్టాలను చర్చ లేకుండానే ఆమోదిస్తున్నారని న్యాయ మూర్తుల ఎంపికకు సంబంధించి ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టం అటువంటిదేనని, న్యాయ ప్రమేయం లేకుండా ప్రధాని మంత్రి –వర్గ సభ్యుడు, విపక్ష నేతతో కూడిన న్యాయమూర్తులను ఎంపిక చేయడం సమాంజసం కాదన్నారు. దేశంలో పెరిగిన జనాభాకు –అనుగుణంగా న్యాయస్థానాలు, సిబ్బంది పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని చంద్రకుమార్ సూచించారు. కేంద్ర బడ్జెట్లో న్యాయశాఖకు కేటాయింపులు రోజు రోజుకు తగ్గిపోతున్నాయని తెలిపారు. పదవీ విరమణ చేసిన వెంటనే రాజ్యసభ సభ్యులుగా, గవర్నర్లుగా నియమించబడటం ద్వారా తీర్పులలో అనుమానానికి తావిచ్చినట్లవుతుందన్నారు. న్యాయవాదులు బాధితుల పక్కన –నిలవాలన్న చంద్రకుమార్, నిజాయితీ, నిబద్ధత న్యాయవాద వృత్తికి ప్రధానమైనవన్నారు. సంపన్న వర్గాలు బ్యాంకులను లూటీ చేసి విదేశాలకు పారిపోతున్న పట్టించుకోని పాలకులు రైతు తీసుకున్న అప్పు చెల్లించకపోతే ఇల్లు, పొలం జప్తు చేస్తున్నారని ఇది –వేల కోట్ల అప్పు తీసుకున్న వారికి ఎందుకు వర్తింపజేయడం లేదని ప్రశ్నించారు. వేమన పద్యాన్ని ఉదహరించిన చంద్రకుమార్ – ఉన్నత స్థానాల్లో ఉన్న వారు కాసులకో, రాజకీయ ఒత్తిళ్లకో గురికావడం వల్లనే ఈ పరిస్థితి చోటు చేసుకుంటుందన్నారు. పాలక –వర్గాలు సక్రమంగా పనిచేయాలంటే ఎన్నికల్లో ప్రలోభాలను నిలువరించాలి. అందుకు నిజాయితీ గల ఎన్నికల కమిషన్ ఉండాలన్నారు. చట్టాల మార్పు సామాన్యులకే సానుకూలత ఇవ్వాలి కానీ మారుతున్న చట్టాలు గుదిబండలుగా –మారుతున్నాయన్నారు. రూ.14 లక్షల కోట్లు ఎగవేత దారులకు లేని చట్టం లక్ష అప్పు తీసుకున్న రైతుకు వర్తింపజేయడం ఎంత వరకు సమాంజనం అన్న ప్రశ్నకు ఊతం కావాలి. న్యాయవాద సంఘాలు, ముఖ్యంగా ఐఏఎల్ లాంటి సంస్థలు మరింత ొబాధ్యతాయుతంగా వ్యవహరించాలని చంద్రకుమార్ సూచించారు. జూనియర్ న్యాయవాదులు జాలి, దయ, కరుణ, పేదల పట్ల ఆపేక్ష, పట్టుదల, తపనతో పనిచేయాలని వాదనలు వినాలని, మనసుతో చదవాలని, సీనియర్లను, న్యాయమూర్తులను –గౌరవించాలన్నారు. కొత్తగూడెం డిస్ట్రిక్ సెషన్స్ జడ్జి పాటిల్ వసంత్, న్యాయవాదులు, న్యాయ వ్యవస్థ వృత్తి సమస్యలపై –మాట్లాడారు. జూనియర్ న్యాయవాదులకు సూచనలు అందజేశారు. మహాసభకు ముందు ఐఏఎల్ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షులు పోట్ల మాధవరావు ఆవిష్కరించగా మేకల భాస్కర్ చిత్ర పటానికి బొమ్మగాని ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐఏఎల్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి శేషగిరి ఆహ్వానితులను వేదికపైకి ఆహ్వానించగా ఈ మహాసభలలో దుస్సా జనార్ధన్, శ్రీనివాస్,మాధవరావు, అమర్చంద్, లతీఫ్, శివరామకృష్ణ, నవీన్, రామాంజనేయులు, కొల్లికొండ శరత్బాబు, రంజిత్ కుమార్,వెంకటగుప్తా, కాటమనేని రమేష్, రమేష్ కుమార్ మక్కడ్, మలీదు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'బ్రెడ్ విన్నర్' స్కీం అనే అర్ధాన్ని నిజం చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలి

కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి

ఖమ్మం ఆర్సి,ఫిబ్రవరి 24 (జనంసాక్షి)

బ్రెడ్ విన్నర్ స్కీంలో ఉద్యోగాల కల్పన– సర్వీసులో వుండి చనిపోయిన కార్మిక ఉద్యోగి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించే విషయంలో ఖాళీలతో నిమిత్తం లేకుండా అప్లికేషన్స్ పెండింగ్లో వున్న వారందరిని ఉద్యోగాలలోకి తీసుకొనేలా ఉత్తర్వులు ఇప్పించ వలసిందిగా కోరారు. టిఎస్ ఆర్టీసిలో సర్వీసు చేస్తూనే అనేకమంది మరణించారు. సంస్థలో అమలులో వున్న నిబంధనల ప్రకారం అలా చనిపోయిన కార్మికుడు ఉద్యోగి కుటుంబంలో అర్హత కలిగిన 'డిపెండెంట్' కు ఉద్యోగం కల్పించాలి. అయితే ప్రభుత్వంలో వున్న పద్ధతిలో 'సూపర్ న్యూమరీ పోస్ట్' సృష్టించి ఉద్యోగం కల్పించడం కాకుండా, ఆర్టీసిలో ఖాళీలు వుంటే, ఆ ఖాళీలలో మాత్రమే భర్తీ చేసేలా రెగ్యులేషన్స్ అమలులో వున్నాయి.గత దశాబ్ద కాలంగా ఆర్టీసి విస్తరణ ఆగిపోవడంతో చనిపోయిన కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం కల్పించే 'బ్రెడ్ విన్నర్ స్కీం'లో ఉద్యోగం కల్పించలేదు. 2023లో కొంతమందిని ఆర్టీసి కానిస్టేబుల్స్ గాను, కళాసీగాను తీసుకున్నారు. అది కూడా నిబంధనల ప్రకారం రెగ్యులర్ ప్రాతిపదికన కాకుండా, 3 సంఎఎల కన్సాలిడేటెడ్ పే తో మాత్రమే తీసుకున్నారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పేరుతో ఆర్టీసి బస్ లో మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతించిన తర్వాత ఆర్టీసిలో సిబ్బంది అవసరం పెరిగింది. ఆ నేపథ్యంలోనే బ్రెడ్ విన్నర్ స్కీం పైన ఉద్యోగం కోసం వేచి చూస్తున్న వారిలో 800 మందిని కన్సాలిడేటెడ్ వేతనంపై తీసుకుంటు న్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.అయితే నియామకం చేసే పోస్టులన్నీ రీజయన్ సీనియార్టీ పోస్టులు కాబట్టి ఆయా రీజియన్ లో వున్న ఖాళీల మేరకు రిక్రూట్మెంట్ జరుపుతామని అంటున్నారు. దీని ఫలితంగా కొన్ని రీజియన్లలో కొంతమందికి అర్హత ఉండి కూడా ఉద్యోగం పొందే అవకాశం లేకుండా పోతున్నది.సర్వీసులో వుండి చనిపోయిన కార్మిక ఉద్యోగి కుటుంబాలలో అర్హత కల్గిన వారికి ఒన్ టైమ్ సెటిల్మెంటుగానైనా ఉద్యోగావకాశాలు కల్పించేలా నిర్ణయము చేసి 'బ్రెడ్ విన్నర్' స్కీం అనే అర్ధాన్ని నిజం చేసేలా ఉత్తర్వులు ఇప్పించి ఆ కార్మిక ఉద్యోగి కుటుంబాలను ఆదుకొనేలా చూడాలని కోరుతూ విన్నవించారు.

ఇన్‌స్టంట్ రుణమా..?

ఈ విషయాలు తెలుసుకున్నాకే..!

రుణం తీసుకోవాలంటే ఒకప్పుడు బ్యాంకులు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేది. డిజిటల్ యుగంలో ఆ బాధ తప్పింది. రుణం తీసుకోవడం సులువైపోయింది. అనుకున్నదే తడవుగా ఇప్పుడు లోన్ లభిస్తోంది. సింగిల్ క్లిక్‌తో ఎటువంటి డాక్యుమెంట్లూ తీసుకోకుండానే పని పూర్తయిపోతోంది. సులువుగా ఇన్‌స్టంట్ రుణాలు లభిస్తుండడంతో ఈ తరహా లోన్లకు ఆదరణ పెరుగుతోంది. ఒకవేళ మీరూ ఈ తరహా రుణాలు తీసుకోవాలనుకుంటే.. అంతకంటే ముందు కొన్ని విషయాలు తెలుసుకోవడం తప్పనిసరి.

ఎంచుకోండి ఇలా..

ఇన్‌స్టంట్ లోన్ కోసం ఆన్‌లైన్‌లో వెతికితే ఎక్కువ సంఖ్యలో రుణ సంస్థలు దర్శనమిస్తాయి. అందులో రుణాలకు సంబంధించిన నియమ నిబంధనలు పాటిస్తున్న సంస్థను ఎంపిక చేసుకోండి. కస్టమర్ రివ్యూ, రేటింగ్‌లు చూస్తే రుణదాత గురించి మరిన్ని విషయాలు తెలుస్తాయి. పారదర్శక విధానాలు, సురక్షితమైన ఆన్‌లైన్ లావాదేవీలు, న్యాయమైన రుణ పద్ధతులు ఉంటే అది మంచి రుణ ప్లాట్‌ఫామ్‌గా గుర్తించొచ్చు. టర్మ్ అండ్ కండీషన్స్ చదవడం ముఖ్యం.

వడ్డీ రేట్లు

ఎలాంటి రుణానికైనా వడ్డీ రేట్లు చాలా కీలకం. తక్షణ రుణాలు పొందడం సులువైనప్పటికీ.. సాధారణ రుణాలతో పోలిస్తే ఎక్కువ మొత్తంలో వడ్డీ ఉంటుంది. వీటితో పాటు లేట్ పేమెంట్ ఫీజు, ప్రీ పేమెంట్ ఫీజు, ప్రాసెసింగ్ రుసుముల విధిస్తారు. ఈ రుసుంలు ఎంత మొత్తంలో ఉండబోతున్నాయనేది ముందుగానే తెలుసుకోవాలి.

పొడిగింపు ఉందా?

ఆర్థిక ఇబ్బందులు ఎప్పుడైనా ఎదురు కావొచ్చు. రుణం తిరిగి చెల్లించే సమయంలోనూ అలాంటి పరిస్థితులు ఎదురుకావొచ్చు. అలాంటప్పుడు ఆ రుణాన్ని పొడిగించుకునేందుకు ఆ సంస్థలో వెసులుబాటు ఉందో లేదో ఆరా తీయాలి. రుణ గ్రహీత సరైన కారణం చెబితే రుణదాతలు తిరిగి చెల్లించే సమయాన్ని పొడిగించొచ్చు. దీంతో ఆలస్య చెల్లింపులు, రుణ ఎగవేత ముద్ర నుంచి తప్పించుకోవచ్చు.

కస్టమర్ సపోర్ట్

ఆర్థిక లావాదేవీల విషయంలో కస్టమర్ సపోర్ట్ కీలకం. రుణం తీసుకునేటప్పుడు, తీసుకున్నాక కొన్నిసార్లు ప్రశ్నలు తలెత్తుతుంటాయి. వాటిని ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవడానికి మెరుగైన కస్టమర్ సపోర్ట్ కలిగిన రుణదాతల్ని ఎంచుకోండి. చాట్, ఫోన్‌కాల్స్, ఇ-మెయిల్స్.. వంటి బహుళ సాధనాల ద్వారా తక్షణమే పరిష్కరించే సామర్థ్యం ఉన్న ప్లాట్‌ఫామ్ అయితే మరీ మంచిది.

రుణం అవసరం ఎంత?

అత్యవసర పరిస్థితుల్లో మనకు రుణం అవసరం అవుతుంది. అలాంటప్పుడు ఎంత మొత్తంలో రుణాన్ని తీసుకోవాలో ముందుగానే నిర్ణయించుకోండి. సులువుగా లోన్ ఇస్తున్నారని అవసరానికి మించి తీసుకుంటే తిరిగి చెల్లించడం కష్టంగా మారొచ్చు. దీని కోసం నెలవారీ ఆదాయం, ఆర్థిక స్థిరత్వం వంటి విషయాలను ఓసారి సమీక్షించుకోండి. ఆ తర్వాతే రుణం విషయంలో ముందడుగు వేయండి.

కరిగిన ఫారెక్స్ రిజర్వులు

రెండు నెలల కనిష్ఠస్థాయికి నిల్వలు

ముంబై, ఫిబ్రవరి 23 జనం సాక్షి:

విదేశీ మారకం నిల్వలు తరిగిపోయాయి. గత కొన్ని వారాలుగా పెరుగుతూ వచ్చిన ఫారెక్స్ రిజర్వులు రెండు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ తగ్గడంతో గతవారాంతానికి ఫారెక్స్ రిజర్వులు 1.13 బిలియన్ డాలర్లు తగ్గి 616.10 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం వారంలో రిజర్వులు 5.3 బిలియన్ డాలర్లు తగ్గిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఆస్తుల విలువ 740 మిలియన్ డాలర్లు తరిగిపోయి 545.78 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. పసిడి రిజర్వులు 362 మిలియన్ డాలర్లు తరిగిపోయి 47.38 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి వద్ద ఉన్న నిల్వలు మిలియన్ డాలర్లు తగ్గి 4.83 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. సెప్టెంబర్ 2021లో రికార్డు స్థాయి 642.45 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ మార్కెట్లో కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో రిజర్వుబ్యాంక్ డాలర్లను కొనుగోలు చేసింది.

ఫోన్‌చేసేవారి పేరు కనిపిస్తుంది

సీఎన్ఏపీ అనుబంధ సేవలకు ట్రాయ్ సిఫారసు

దిల్లీ జనం సాక్షి:

ఫోన్ చేసిన వారి (కాలర్) పేరు మొబైల్‌పై కనిపించేలా కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్(సీఎన్ఏపీ) సప్లిమెంటరీ సర్వీస్‌ను అన్ని టెలికాం కంపెనీలు తమ వినియోగదార్లకు అందించాలని ట్రాయ్ సిఫారసు చేసింది. ప్రస్తుతం మనం నిక్షిప్తం చేసుకున్న నంబర్లకు సంబంధించిన వారి పేర్లే కనపడుతున్నాయి. తాజా సిఫారసులు అమలైతే, దేశీయంగా విక్రయించే అన్ని మొబైళ్లలో ఈ ఫీచరు ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేస్తుందని టెలికాం నియంత్రణాధికార సంస్థ పేర్కొంది. సిమ్ కనెక్షన్ తీసుకునేప్పుడు కస్టమర్ అప్లికేషన్ ఫామ్(సీఏఎఫ్)లో వినియోగదారు నమోదు చేసే పేరే, మొబైల్ తెరపై కనపడుతుంది. ఇప్పటికే ట్రూకాలర్, భారత్ కాలర్ ఐడీ, యాంటీ స్పామ్ వంటి థర్డ్ పార్టీ యాప్‌లు ఇలా కాలర్ పేరును చూపిస్తున్నా.. అవన్నీ క్లౌడ్ సోర్సెడ్ డేటా ఆధారిత సేవలుగా ఉన్నాయి కాబట్టి విశ్వసించలేమని ట్రాయ్ గుర్తు చేసింది. అంటే మన పేరును ఇతరులు తమ మొబైళ్లలో ఏ పేరుతో సేవ్ చేస్తే, అదే కనిపిస్తుంది మినహా అసలు పేరు కనిపించదు. వినియోగదార్ల విజ్ఞప్తిపై ఈ సీఎన్ఏపీ సేవలను అన్ని కంపెనీలు అందించాల్సి ఉంటుందని ట్రాయ్ తెలిపింది.

జీమెయిల్ మూసివేస్తారంటూ ప్రచారం

గూగుల్ క్లారిటీ

గూగుల్‌కు చెందిన ఇ-మెయిల్ సర్వీస్ జీమెయిల్ సేవలను నిలిపివేస్తారంటూ సోషల్‌మీడియాలో పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ఆగస్టు 1 నుంచి ఈ సర్వీసులు నిలిచిపోనున్నాయన్నది ఆ పోస్టుల సారాంశం. దీనిపై గూగుల్ స్పష్టతనిచ్చింది. తమ సేవలు యథాతథంగా కొనసాగుతాయని వెల్లడించింది. ఏళ్లుగా లక్షలాది మందికి ఇ-మెయిల్ సేవలు అందిస్తున్న జీమెయిల్ త్వరలో మూతపడబోతోందని, 2024 ఆగస్టు 1 నుంచి ఈ సర్వీసులు నిలిచిపోనున్నాయంటూ ఓ స్క్రీన్‌షాట్ సామాజిక మాధ్యమాల్లో కొన్ని రోజులుగా చక్కర్లు కొడుతోంది. ఇకపై మెయిల్స్ పంపించడం గానీ, పొందడం గానీ చేయలేరంటూ జీమెయిలే స్వయంగా ఓ యూజర్‌కు తెలియజేసినట్లు ఆ స్క్రీన్‌షాట్‌లో ఉంది. అది కాస్తా ఎక్స్, టిక్‌టాక్‌లో వైరల్‌గా మారింది. దీంతో చాలామంది జీమెయిల్ యూజర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రచారంపై గూగుల్ స్పందించింది. జీమెయిల్ అధికారిక ఎక్స్ ఖాతా నుంచే ఈ సేవలు కొనసాగుతాయంటూ ఓ పోస్ట్ పెట్టింది. తద్వారా సోషల్‌మీడియాలో జరుగుతున్న అబద్ధపు ప్రచారానికి చెక్ పెట్టింది. ఈ ప్రచారంపై టెక్ నిపుణులు సైతం ఆందోళన వ్యక్తంచేశారు. ఈ తరహా ప్రకటనలను ఆదిలోనే అంతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వాస్తవానికి ఈ ఏడాది జనవరి నుంచి జీమెయిల్ తన హెచ్‌టీఎంఎల్ వెర్షన్ సర్వీసులను మాత్రమే నిలిపివేసింది. నెట్‌వర్క్ సరిగా లేని సమయంలోనూ ఇ-మెయిల్స్ పొందడం ఈ సర్వీసుల ఉద్దేశం. రెగ్యులర్ ఇ-మెయిల్ సేవలు మాత్రం యథాతథంగా కొనసాగుతాయని టెక్ నిపుణులు చెబుతున్నారు.

జాతీయం అంతర్జాతీయం

‘మీ ఇంట్లో గొడవైతే.. నన్ను అనొద్దు’

మహిళలతో ప్రధాని సరదా సంభాషణ

వారణాసి జనం సాక్షి:

ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం తన సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించిన విషయం తెలిసిందే. నూతనంగా నిర్మించిన అమూల్ బనస్ డైరీ ప్లాంట్‌ను ప్రారంభించిన ఆయన.. స్థానికంగా పాల వ్యాపారం సాగిస్తున్న కొంతమంది మహిళలతో ముచ్చటించారు. పశువుల పోషణ, దాని వల్ల ఆర్థికంగా వారికి చేకూరుతున్న ప్రయోజనాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని వారితో సరదాగా మాట్లాడారు. గిర్ ఆవుల పెంపకంతో మా కుటుంబ ఆదాయం పెరిగింది. మేం స్వావలంబన సాధించాం. ఈ ఆవులు మా కుటుంబంలో భాగమయ్యాయి” అని మహిళలు సంతోషంగా చెప్పారు. దీనికి ప్రధాని స్పందిస్తూ.. పాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మహిళల ఖాతాలోనే జమ చేయాలనేది మా ఆలోచన. మీకు ఇప్పుడు ఆదాయం వస్తోంది కదా.. ఇంట్లో మీరు దాదాగిరి చేస్తున్నారా? అయితే, దీని వల్ల మీ ఇంట్లో ఏదైనా గొడవ జరిగితే మాత్రం.. మోదీ వల్లే అని అనకూడదు” అంటూ సరదాగా అన్నారు. ఆవులతో సెల్ఫీ తీసుకున్నారా? అని మోదీ అడగ్గా.. ఆ పని ఎప్పుడో చేశామంటూ మహిళలు బదులిచ్చారు. ఆ దృశ్యాలను ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ‘‘మహిళా సాధికారతకు మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుంది. గిర్ ఆవులు వచ్చిన తర్వాత వారణాసి తల్లులు, సోదరీమణుల జీవితాలు మారాయని తెలిసి ఎంతో సంతృప్తిగా ఉంది’’ అని రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గుజరాత్‌కు చెందిన మేలు జాతి రకమైన ‘గిర్’ ఆవులు భారత్‌తో పాటు అమెరికా, మెక్సికో వంటి దేశాల్లోనూ చాలా పాపులర్. ‘రాష్ట్రీయ గోకుల్ మిషన్’ కింద కేంద్ర ప్రభుత్వం వీటిని దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన కొంతమంది మహిళలకు అందిస్తోంది. తాజాగా ప్రధాని ముచ్చటించిన మహిళలు ఈ పథకం కింద గిర్ ఆవులను పోషిస్తున్న వారే.

పొత్తు ఖరారైన రోజే వైకాపా కాడి వదిలేసింది: చంద్రబాబు

అమరావతి జనం సాక్షి:

రాష్ట్ర భవిష్యత్ కోసం జనసేనతో పొత్తు పెట్టుకున్నామని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం, భావితరాల భవిష్యత్ కోసమే ఈ నిర్ణయమని చెప్పారు. తమ పొత్తు కుదిరిన రోజే వైకాపా కాడి వదిలేసిందన్నారు. భాజపా కలిసొస్తే తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ మేరకు తెదేపా-జనసేన ఉమ్మడి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అసెంబ్లీకి తెదేపా తరఫున పోటీ చేసే 94 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. ‘‘రాష్ట్ర భవిష్యత్ కోసమే జనసేనతో ఈ కలయిక. ఐదు కోట్ల ప్రజల కోసం రెండు పార్టీలు కలిసి పనిచేయాలని నిర్ణయానికొచ్చాం. రాష్ట్ర చరిత్రలో ఇదో మరిచిపోలేని రోజు. రాష్ట్ర విభజన తర్వాత కంటే వైకాపా పాలనలోనే ఎక్కువ నష్టం జరిగింది. బ్రాండ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌ను పూర్తిగా నాశనం చేశారు. జగన్ పాలనలో సామాన్యులు, నేతలు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పవన్ కల్యాణ్‌ను వైజాగ్‌లో ర్యాలీ చేస్తే అడ్డుకున్నారు. పొత్తు కుదిరిన రోజే మా విజయం ఖరారైంది. ఆ రోజే వైకాపా కాడి వదిలేసింది’’ అని చంద్రబాబు అన్నారు.

తెదేపా, జనసేన అభ్యర్థుల తొలి జాబితా విడుదల

నా రాజకీయ జీవితంలో అభ్యర్థుల జాబితా కోసం ఎప్పుడూ ఇంత కసరత్తు చేయలేదు. అభ్యర్థుల ఎంపిక కోసం వివిధ రూపాల్లో కోటి మంది అభిప్రాయం తీసుకున్నాం. ప్రజల మధ్యన ఉండే.. ప్రజలు కోరుకున్న వారిని అభ్యర్థులుగా నిలబెడుతున్నాం. తొలి విడతలో భాగంగా మొత్తం 118 మంది అభ్యర్థులను ఎంపిక చేశాం. యువత, మహిళలు, బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం. తెదేపా నుంచి పోటీ చేస్తున్న 94 మందిలో 23 మంది తొలిసారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ఇందులో ఉన్నత చదువులు చదువుకున్నవారూ ఉన్నారు. అదే వైకాపా అభ్యర్థులను చూస్తే.. ఎర్ర చందనం స్మగ్లర్లను వారు పోటీకి పెట్టారు. మేం మాత్రం ప్రజలకు జవాబుదారీతనంగా ఉండే అభ్యర్థులనే ఎంపిక చేశాం. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలి. ఇరు పార్టీల మధ్య ఓటు బదిలీ జరగాలి. కాబట్టి పార్టీ కార్యకర్తలు ఇరు పార్టీల గెలుపునకు కృషి చేయాలి” అని పిలుపునిచ్చారు.

స్ట్రైక్ రేట్ ముఖ్యం: పవన్

గెలిచే సామర్థ్యం ఉన్న అభ్యర్థులనే బరిలో నిలుపుతున్నామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఎక్కువ సీట్లు తీసుకుని ప్రయోగాలు చేసే బదులు, తక్కువ స్థానాలు తీసుకుని రాష్ట్ర భవిష్యత్ కోసం ముందుకెళ్లాలని నిర్ణయించామన్నారు. 98 శాతం స్ట్రైక్ రేటు ఉండేలా అభ్యర్థులను ఎంపిక చేశామని చెప్పారు. ఈ అరాచక పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు ముక్తి కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. 60, 70 స్థానాలు కావాలని కొందరు అంటున్నారని, గత ఎన్నికల్లో 10 స్థానాలు గెలిచి ఉంటే ఎక్కువ స్థానాలు అడిగేందుకు అవకాశం ఉండేదని చెప్పారు. 24 అసెంబ్లీ స్థానాలు, 3 పార్లమెంట్ స్థానాల్లో జనసేన పోటీ చేస్తుందన్నారు. భాజపాతో కలిసి ముందుకెళ్లాలన్న ఉద్దేశంతో కొన్ని స్థానాలను త్యాగం చేసినట్లు పేర్కొన్నారు. పొత్తులో భాగంగా త్యాగాలకు పాల్పడిన వారికి తెదేపా-జనసేన ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి పొరపొచ్చాలు వచ్చినా అవన్నీ దాటుకుని తెదేపా- జనసేన గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

5 గంటలు విమానంలోనే..

ఊపిరాడక చిన్నారులకు అస్వస్థత

ముంబయి జనం సాక్షి:

ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ మారిషస్‌కు చెందిన ఓ విమానంలో శనివారం సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో ప్రయాణికులు కొన్ని గంటల పాటు ఉండిపోయారు. ఈ క్రమంలోనే పలువురు చిన్నారులు ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారు. మహారాష్ట్ర రాజధాని ముంబయి నుంచి ఎంకే 749 విమానం ఈ తెల్లవారుజామున 4.30 గంటలకు మారిషస్ బయల్దేరాల్సి ఉంది. 3.45 గంటల నుంచి ప్రయాణికులందరిని ఎక్కించారు. అయితే టేకాఫ్ చేస్తుండగా ఇంజిన్‌లో సమస్య ఏర్పడింది. దీంతో విమానాన్ని రన్‌వేపైనే ఉంచారు. కానీ, ప్రయాణికులను మాత్రం కిందకు దిగేందుకు అనుమతించలేదు. దాదాపు 5 గంటలపాటు వారు అందులోనే ఉండాల్సి వచ్చింది. ఆ సమయంలో ఏసీలు పనిచేయకపోవడంతో ప్రయాణికుల్లోని పలువురు చిన్నారులు, వృద్ధులు అస్వస్థతకు గురయ్యారు. వారు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటంతో వెంటనే వారిని కిందకు దించి చికిత్స అందించినట్లు తోటి ప్రయాణికులు మీడియాకు తెలిపారు. ప్రస్తుతం విమానాన్ని రద్దు చేసి ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఘటనపై ఎయిర్‌పోర్టు అధికారులు గానీ, ఎయిర్ మారిషస్ గానీ ఎలాంటి ప్రకటన చేయలేదు.

విమానంలో భద్రతకు ‘క్లాసికల్’ టచ్

ఎయిరిండియా ఐడియా అదుర్స్

ముంబయి జనం సాక్షి:

విమాన ప్రయాణాల్లో భద్రతా సూచనలు పాటించాలంటూ ఎయిర్ హోస్ట్, మైక్‌ల ద్వారా ప్రయాణికులకు ఆయా సంస్థలు చెబుతుంటాయి. ఈ నేపథ్యంలోనే ఎయిరిండియా ఓ విన్నూత ఆలోచన చేసింది. తమ ప్రయాణికుల రక్షణ నిమిత్తం ఈ భద్రతకు క్లాసికల్ టచ్ ఇచ్చింది. భారత్‌లో ప్రముఖ సంప్రదాయ నృత్యాలైన భరతనాట్యం, బిహు, కథాకళి, కథక్, మోహినియాట్టం, ఒడిస్సీ, ఘూమర్‌లను సమ్మిళితం చేసి ఒక వీడియోను రూపొందించింది. సీటు బెల్టు ఎలా పెట్టుకోవాలి, ఎమర్జెన్సీ ల్యాండింగ్ వేళ ఏం చేయాలి.. ఇలా అనేక అంశాలను విమానం ఎక్కిన మొదలు దిగేంత వరకు ఎలా పాటించాలో నృత్యం రూపంలో వివరించింది. ఈ వీడియోను మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా దర్శకుడు భరత్ బాల, గాయకుడు శంకర్ మహదేవన్, మోక్‌కాన్ వరల్డ్ గ్రూప్‌కు చెందిన ప్రసూన్ జోషి చిత్రీకరించారు. ఎయిరిండియా ఈ వీడియోను తొలుత ఎ350 విమానంలో ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రయాణికులు దీన్ని ఎన్ని సార్లైనా చూసే విధంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. త్వరలో ఈ వీడియోను తమ విమానాల్లో ప్రదర్శించనున్నట్లు ఎయిరిండియా ఓ ప్రకటనలో వెల్లడించింది.

ఘోర ప్రమాదం.. చెరువులో పడిన యాత్రికుల ట్రాక్టర్.. 15 మంది మృతి

లఖ్‌నవూ జనం సాక్షి:

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. యాత్రికులను తీసుకెళ్తున్న ఒక ట్రాక్టర్ చెరువులో పడిపోయింది. ఈ ఘటనలో దాదాపు 15 మంది మృతి చెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులున్నారు. ఆ యాత్రికులంతా హరిద్వార్ వెళ్తుండగా కాస్‌గంజ్‌లో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. మాఘ పూర్ణిమను పురస్కరించుకొని గంగా నదిలో పవిత్ర స్నానమాచరించేందుకు వారంతా హరిద్వార్ వెళ్తుండగా.. ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులో బోల్తాపడింది. గమనించిన స్థానికులు తక్షణమే స్పందించి కొంతమందిని కాపాడారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షల పరిహారం ప్రకటించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
25 ఫిబ్రవరి 2024

గండ్ర వర్సెస్ గండ్ర

- కాలీ అవుతున్న బీఆర్ఎస్ టీమ్
- ఎన్నికల షెడ్యూల్లోపు చేరికలకు కసరత్తు
- ఎంపీ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహం
- ఒక్కోక్కరిగా సత్తన్నను కలుస్తున్న బీఆర్ఎస్ మైన్ లీడర్లు
- మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు సహా ఆయా శాఖల చైర్మన్లు

రేగొండ, ఫిబ్రవరి24 (జనంసాక్షి): లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ దగ్గర పడుతున్న తరుణంలో మండలంలోని రాజకీయాల్లో తీవ్ర మార్పులు సంభవించ బోతున్నాయి. మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వర్గం నుండి సీనియర్ నాయకులు పెద్ద మొత్తంలో ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు వ్యక్తిగతంగా ఒక్కొక్కరిగా ఎమ్మెల్యే తో టచ్ లో ఉన్నట్లు తెలుస్తోంది.

లోక్‌సభ ఎన్నికల గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహం:

లోక్ సభ ఎన్నికల్లో తమ విజయ పతాకం ఎగుర వేయాలని కంకణం కట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ఎమ్మెల్యేలకు తగు సూచనలివ్వగా స్థానిక ఎమ్మెల్యే లు సైతం తమకు అందివచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. అందులో భాగంగానే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ప్రతికూలంగా వ్యవహరించిన బీఆర్ఎస్ లీడర్లను సైతం తమ పార్టీలో చేర్చుకొనుటకు కాంగ్రెస్ వర్గాలు సుముఖం గానే ఉన్నారన్నది సత్యం.

మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు సహా ఆయా శాఖల చైర్మన్లు:

తాజా మాజీ సర్పంచులు,ఎంపీటీసీ లు మండల స్థాయి చైర్మన్, కో-ఆప్షన్ సభ్యులు కూడా చేరికల లిస్టులో ఉన్నట్లు విశ్వాసనీయ వర్గాల సమాచారం. ఇంతకు పర్యాయం ప్రజా ప్రతినిదులు చేసిన అభివృద్ధి పనుల బిల్లులు కేసిఆర్ ప్రభుత్వం చెల్లించక పోవడం వల్ల గత్యంతరం లేక పార్టీ మారక తప్పడం లేదంటున్న వారు కొందరైతే ,రాజకీయ భవిష్యత్ కోసం మార్పు తప్పదంటున్న వారు ఇంకొందరు. అయితే మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీలో చేరడానికి మంత్రి శ్రీధర్ బాబు తో సన్నాహాలు జరుపుతున్నారనీ,అందుకే ఈ మేరకు ముందస్తుగానే లీడర్లు పార్టీ మరుతున్నరన్న అపోహలు సైతం మండలంలో చర్చకు దారితీస్తున్నాయి.

పది,పన్నెండు వార్షిక పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వన్

నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి 24, జనంసాక్షి: పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులకు ఆదేశించారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లతో కలిసి ఆయన పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలపై చీఫ్ సూపెరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రశాంత వాతావరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నెల 28 నుండి మార్చి 19 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 23 కేంద్రాలలో 13345 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారని అన్నారు. అలాగే మార్చి 18 నుండి ఏప్రిల్ 02 వరకు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయని, ఇందుకోసం జిల్లాలో 47 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి కేంద్రంలో సి.సి.కేమేరాల నిఘాలో పరీక్షలు కొనసాగుతాయని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కు అవకాశం ఇవ్వకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. మారుమూల గ్రామాలనుండి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయా రూట్లలో అవసరమైన బస్ లను నడపాలని ఆర్.టి.సి అధికారులను ఆదేశించారు. కేంద్రాలలో త్రాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించాలని, మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు పరీక్షా సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకునేలా చూడాలని, అలాగే పరీక్షా సమయం పూర్తి అయినా తరువాతనే విద్యార్థులను బయటకు పంపాలన్నారు. స్మార్ట్ ఫోన్లు, మొబైల్స్, స్మార్ట్ వాచీలు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రాలలో అనుమతించరాదనీ సూచించారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలనీ ఆదేశించారు. పటిష్ట బందోబస్తు మధ్యన ప్రశ్న, జావాబు పత్రాలను సంబంధిత కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పరీక్షా సమయాలలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలనీ అన్నారు. సమస్యాత్మక కేంద్రాలలో అదనపు పోలీసు బలగాలను ఏర్పాటుచేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పరీక్షలను నిర్వహించాలని, విధులలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో డి.ఆర్.ఓ గంగయ్య, ఆర్డీఓలు రత్నకల్యాణి, కోమల్ రెడ్డి, డి.ఐ.ఓ పరశురామ్, చీఫ్ సూపెరింటెండెంట్లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మక్క-సారలమ్మ జాతర..

జనం నుంచి వనంలోకి తల్లి బిడ్డలు

గోదావరిఖని, ఫిబ్రవరి 24, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా రామగుండం నగరపాలక సంస్థ పరిధి గోదావరినది తీరాన ఈ నెల 21వ తేదీ నుంచి 24వరకు శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర కన్నుల పండువగా జరిగింది. సమ్మక్క-సారలమ్మ జాతరను ఆలయ కమిటి ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా నిర్వహించారు. భక్తులు పిల్లపాపలతో అమ్మ వార్లను దర్శించుకుని మొక్కలు సమర్పించుకున్నారు. ఎత్తు బంగారాన్ని కూడా వనదేవతలకు సమర్పించారు. కొబ్బరికాయలు, ఎత్తు బెల్లాలు, హుండీలలో కానుకలు వేశారు. గత నాలుగు రోజులుగా లక్షలాది మంది భక్తులు శ్రీసమ్మక్క-సారలమ్మ దేవతలను దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం నుంచి కాకుండా ఇతర రాష్ట్రాలు, చుట్టుపక్కల జిల్లాలు, గ్రామాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. గోదావరినది తీరాన జరిగే జాతరను మినీమేడారంగా పిలుస్తారు. మేడారం జాతరను తలపించే విధంగా ఇక్కడ జాతర జరగడం సంతోషకరమని పలువురు భక్తులు తెలిపారు. ఈ నెల 21న రాత్రి నుంచి 23 రాత్రి వరకు ఇసుకపోస్తే రాలనంత మంది భక్తులు జాతరను సందర్శించారు. శనివారం సుమారు 4.30 గంటల ప్రాంతంలో అమ్మ వార్లను అలయ కమిటి ఆధ్వర్యంలో కోయపూజార్లు జనం నుంచి వనానికి తీసుకెళ్లారు. భక్తుల మధ్య డప్పు చప్పుళ్లతో తల్లి బిడ్డలను జనగామ గ్రామంలోకి తీసుకెళ్లారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు. ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి సంస్థ, రామగుండం నగరపాలక సంస్థ సంయక్తంగా జాతరలో అన్ని ఏర్పాట్లకు సహకరించారు. ప్రధానంగా సింగరేణి

ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ నేతృత్వంలో సింగరేణి సివిల్ విభాగం జాతర ఏర్పాట్లలో ప్రధానభూమిక పోషించింది. అదే విధంగా ట్రాన్స్‌కో అధికారులు కూడా ఏర్పాట్లలో పాలు పంచుకున్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా మూడు రోజుల పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు నానాయాతన పడ్డారు. అయినా ఎక్కడ ఎలాంటి చిన్న సంఘటనలు కూడా చోటుచేసుకోకుండా రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాసులు నేతృత్వంలో గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ ఆధ్వర్యంలో గోదావరిఖని వన్‌టౌన్, టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావు పోలీసు సిబ్బందితో పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.

పెద్దపల్లి పార్లమెంటులో బిజెపి అభ్యర్థిని గెలిపించండి..

కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి..

నస్పూర్, ఫిబ్రవరి 24, (జనంసాక్షి) : సింగరేణి కార్మికుల సమస్యలపై పార్లమెంట్ లో మీ గళాన్ని వినిపించాలంటే పెద్దపల్లి పార్లమెంట్ లో బిజెపి అభ్యర్థిని గెలిపించాలని కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి 3 గని ఆవరణలో బిజెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మరొకసారి నరేంద్ర మోడీ ప్రభుత్వమే వస్తుందని తెలిపారు. బిజెపి ఎంపీ ఉంటేనే సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని, కాబట్టి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిని గెలిపించాలన్నారు. సింగరేణి కార్మికుల ప్రధాన సమస్య అయిన ఇన్కమ్ టాక్స్ పై కచ్చితంగా న్యాయం జరిగేలా కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాజకీయాల్లో మార్పు రావాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిస్వార్థంగా పనిచేసే వ్యక్తులనే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, నస్పూర్ పట్టణ బిజెపి అధ్యక్షుడు సత్రం రమేష్, ప్రధాన కార్యదర్శి కుర్రె చక్రవర్తి, సీనియర్ నాయకుడు కమలాకర్ రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మారకద్రవ్యాలపై ప్రజలకు అవగాహన..

రామగుండం, ఫిబ్రవరి 24, (జనంసాక్షి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచారం ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, డ్రగ్స్, మారకద్రవ్యాల పై తెలంగాణ సంస్కృతిక సారధి కళాబృందం అంతర్గం మండలంలోని గోలివాడ గ్రామంలో ఆటపాటల ద్వారా శనివారం అవగాహన కల్పించడం జరిగినది. కళాకారులు దయానర్సింగ్, బుర్ర శంకర్ గౌడ్, సానుకొండ రవీందర్, ఢిల్లీ వెంకటస్వామి, నారగోని సరిత, స్వప్న, స్పందన, శ్వేత, స్పందన తదితరులు పాల్గొన్నారు.

29న మాదిగ మహాగర్జన విజయవంతం చేయండి..

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాసర్ల రాజుకుమార్..

రామగుండం, ఫిబ్రవరి 24, (జనంసాక్షి) : ఎమ్మార్పీఎస్ పిలుపు మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ ఆదేశాల ప్రకారం ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు యాసర్ల రాజుకుమార్ (తిమోతి) ఆధ్వర్యంలో మహాగర్జన కరపత్రాలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన మహాగర్జన సభను తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి మాదిగజాతి సోదరులు, యువకులు, విద్యావంతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మాదిగల వృత్తి డప్పు కొట్టేవారికి, చెప్పులు కుట్టే వారికి ప్రభుత్వం నుండి పెన్షన్ ఇవ్వాలని, గత ప్రభుత్వం అన్ని కులస్తులను గౌరవించి వారికి అన్ని రకాల సహాయసహకారాలు అందించాయని, అలాగే మాదిగలను కూడ గుర్తించి వారికి ప్రభుత్వం తరపున అందే ఫలాలు అందించాలని డిమాండ్ చేశారు. గత టీఆరెస్ ప్రభుత్వం దళిత సంక్షేమం కోసం అమలు చేసిన దళితబంధు పథకాన్ని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను చిన్నచూపు చూస్తుందని, తక్షణం దళితబంధు పథకం అమలు చేయాలని, అలాగే ఎన్నో సంవత్సరాలుగా గ్రామాల్లో పట్టణాల్లో రోడ్లు ఉడుస్తూ, మలమూత్రాలు ఎత్తిపోస్తూ జీవనం సాగిస్తున్న దళిత పారిశుద్ధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని యాసర్ల రాజుకుమార్(తిమోతి) ప్రభుత్వానికి సూచించారు. ఎబిసిడి వర్గీకరణ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టాలని, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని మాదిగలను మోసం చేసారని, మాదిగలకు నిష్పత్తి ప్రకారం అందే ప్రయోజనాలు, సంక్షేమఫలాలు అందించేందుకు వర్గీకరణ అవసరమని ఈ సందర్భంగా వారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు కొట్టేపల్లి దుర్గాప్రసాద్, వడ్లూరి శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు మాచర్ల శ్రీనివాస్, ఈర్ల ప్రేమ్‌కుమార్, మేడి ప్రవీణ్, మహిళ నాయకురాలు సుందిళ్ళ రేణుక, కండే శ్వేతా, రోజా తదితరులు హాజరయ్యారు.

26న సమ్మక్క-సారలమ్మ హుండీల లెక్కింపు..

గోదావరిఖని, ఫిబ్రవరి 24, (జనంసాక్షి) : రామగుండం నగరపాలక సంస్థ పరిధి గోదావరినది తీరాన ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహించారు. జాతరలో భక్తులు హుండీల్లో వేసిన నగదును ఈ నెల 26 లెక్కించ నున్నట్టు సమ్మక్క-సారలమ్మ ఆలయ ఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖని జీఎం కార్యాలయ సమీపాన ఉన్న బి-గెస్ట్ పక్కన శ్రీసమ్మక్క -సారలమ్మ ఆలయంలో ఉదయం 10గంటలకు 44 హుండీల లెక్కింపు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆలయ కమిటి సభ్యులు, భక్తులు సకాలంలో హాజరై హుండీ లేక్కంపు కార్యక్రమంలో పాల్గొనాలని ఈఓ తెలిపారు.

బిఆర్ఎస్‌తో కాంగ్రెస్ లోపాయకారి ఒప్పందం

బిజెపి నేత లక్ష్మణ్ ఆరోపణ

హైదరాబాద్, ఫిబ్రవరి 24, (జనంసాక్షి) : తెలంగాణ సంపద దోచుకున్న బీఆర్ఎస్ నేతలతో కాంగ్రెస్ ప్రభుత్వం లోపాయికారి ఒప్పందం చేసుకుందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. శనివారం నాడు బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.... తెర వెనుక కుట్రలు, కుమ్మక్కు రాజకీయాలు బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు అలవాటు అయ్యాయని ఆరోపించారు. బీజేపీ చెప్పిందే చేస్తుందని.. ఏ విషయనైనా బహిరంగంగా చెబుతుందని అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాళేశ్వరం ప్రాజెక్టు, ధరణిపై సీబీఐతో విచారణ చేయిస్తామని రేవంత్ చెప్పారని.. ఇప్పుడెందుకు కాలయాపన చేస్తున్నారని నిలదీశారు. బీఆర్ఎస్‌తో బీజేపీ ఎప్పటికీ పొత్తు ఉండదని... పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. గెలిచే గుర్రాలను 17 ఎంపీ స్థానాల్లో నిలపెట్టబోతున్నామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చరిష్మాతో కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.

317 జిఓ ను పరిశీలించి ఉపాధ్యాయులకు తగిన న్యాయం చేయాలి

నల్గొండటౌన్, ఫిబ్రవరి 24(జనంసాక్షి)

317 జీవోను పరిశీలించి బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయడం కోసం ప్రభుత్వం సబ్ కమిటీ ఏర్పాటు చేయడంపై పి ఆర్ టి యు తెలంగాణ నల్లగొండ జిల్లా శాఖ పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నాం ముందు నుంచి 317 జి ఓ పై పోరాటం చేస్తూ కమిటీ ఏర్పాటుకు కృషిచేసిన టిపిసిసి అధికార ప్రతినిధి మరియు పి ఆర్ టీ యూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు గాల్ రెడ్డి హర్ష వర్ధన్ రెడ్డి కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. అనంతరం హర్షం వ్యక్తం చేసిన వారిలో పి ఆర్ టి యు తెలంగాణ నల్లగొండ జిల్లా శాఖ అధ్యక్షులు కందిమల్ల కృష్ణారెడ్డి అధ్యక్షులు చిలుముల బాల్రెడ్డి ప్రధాన కార్యదర్శి కొడదల శంకర్ తదితరులు ఫాల్గున్నారు.

చక్కెర ఫ్యాక్టరీల అంతర్జాతీయ విధివిధానాలపై

కేంద్రంతో ఐక్య ఉద్యమం చేపడుదాం

అఖిల భారత ప్రగతిశీలరైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. ప్రభాకర్

బోధన్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : నేడు చెరుకు పంటను పండిస్తున్న రైతాంగానికి మరియు చక్కెరను ఉత్పత్తి చేసే పరిశ్రమలకు నష్టాల పాలు చేసే విధంగా కేంద్రం అనుసరిస్తున్న అంతర్జాతీయ మార్కెట్ విధానాలపై ఐక్య ఉద్యమాన్ని చేపడుదామని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. నేడు నిజాం షుగర్ ఫ్యాక్టరీని పరిశీలించడానికి వచ్చిన కేబినెట్ సబ్ కమిటీ కి వామపక్ష పార్టీల బృందం తరపున వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వి. ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో రాష్ట్రము ఏర్పడితే ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ రంగంలోనే నడిపిస్తామని హామీ ఇచ్చిన (టిఆర్ఎస్)బీ ఆర్ ఎస్ పార్టీ రైతాంగాన్ని మోసం చేసిందని అట్లాగే మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కవిత ఫ్యాక్టరీ ఆస్తులను కాజేయటానికి, తానే ఫ్యాక్టరీని నడుపుకోవటానికి కుట్రలు పన్ని నడిచే ఫ్యాక్టరీని బందు చేశారని గుర్తు చేశారు. ఈ ఫ్యాక్టరీ లో గల యంత్రాలను గోకరాజు గంగరాజు గారు రాత్రిపూట తరలించకు పోయారని వాటిని చిత్రీకరించినటువంటి కొంతమంది విలేకరుల పైన ఒత్తిడి చేశారని జ్ఞాపకం చేశారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రజా పాలనలో రైతుల,ప్రజల, కార్మికుల అభిప్రాయాలను గౌరవించే విధంగా పాలన కొనసాగాలని అభిప్రాయపడ్డారు. చెరుకును పండించే రైతాంగానికి సీడ్స్ ను, ఎరువులను, మందులను సబ్సిడీ పైన ఇచ్చి, టన్నుకు రూ: 4,500 లు చెల్లించి ఫ్యాక్టరీని నడుపుటకు కృషి చేయాలన్నారు. సారంగాపూర్ లో సహకార రంగంలో కొనసాగినటువంటి చక్కెర ఫ్యాక్టరీని కొందరు వ్యక్తులు రైతుల పేరుతో వ్యాపారం చేయటానికి చూస్తున్నారని, అలా రైతులకు ఇవ్వ కుండా కలెక్టర్ ను చైర్మన్ గా నియమించి నడిపించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ (ఎం-ఎల్) ప్రజా పంథా జిల్లా నాయకులు బి.మల్లేష్, బోధన్ మండల కార్యదర్శి పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, సిపిఎం పార్టీ నాయకులు జే.శంకర్ గౌడ్, యేషాల గంగాధర్,గోపి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు పి.వరదయ్య, డి.పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

జనం వీడి వనం బాట పట్టిన తల్లులు

మేడారం/మంగపేట ఫిబ్రవరి 24 (జనంసాక్షి): బుధవారం సారలమ్మ రాక తర్వాత మహాజాతర లాంఛనంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజు సమ్మక్కను గద్దెపైకి తీసుకురాగా.. శుక్రవారంనాడు అశేష భక్త జనం వన దేవతలకు మొక్కులు సమర్పించారు. భక్తులు పోటెత్తడంతో మేడారం జనజాతరను తలపించింది. భక్తులు జంపన్న వాగులో పుణ్య స్నానాలు చేసి.. బంగారం తులా భారం, మొక్కులు సమర్పించారు. శని వారం ఇద్దరు తల్లులు నేటి సాయంత్రమే వన ప్రవేశం చేసారు. కన్నెపల్లికి సారలమ్మ, చిలకలగుట్టకు సమక్కలు చేరుకోవడంతో జాతర ముగిసింది. జాతర నేపథ్యంలో భక్తిశ్రద్ధలతో వనదేవతలకు దేశం నలుమూలల నుండి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించారు. శనివారం సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను గద్దెలపై నుంచి ఆదివాసీ పూజారులు వారి వారి ఆలయాలకు తీసుకెళ్లారు. సమ్మక్క ప్రతిరూపమైన కుంకుమభరిణెతో సాయంత్రం ప్రారంభమై సూర్యాస్తమయం తర్వాత పూజారులు రాత్రి 7.27 నిమిషాలకు వన ప్రవేశం చేయడంతో జాతర ముగిసింది.

'ఖని'లో బీజేపీ విజయ సంకల్పయాత్ర..

- మరొకసారి మోడీ నాయకత్వాన్ని బలపరిచాలి..
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి పిలుపు..

గోదావరిఖని, ఫిబ్రవరి 24, (జనంసాక్షి) : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) విజయ సంకల్పయాత్ర గోదావరిఖనికి చేరింది. శనివారం గోదావరిఖనికి చేరిన విజయ సంకల్పయాత్రకు బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జీ కందుల సంధ్యారాణి స్వాగతం పలికారు. సంకల్పయాత్రలో మహిళలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి గోదావరిఖని చౌరస్తా వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. కందుల సంధ్యారాణి మాట్లాడుతూ అంబానికి అయినా సామాన్యునికి అయినా ఓటు విలువ ఒకటే అని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి 3 నెలల్లోనే ఎప్పుడు పడని కష్టాలు చూస్తున్నామన్నారు. విలువైన ఓటుని గోదావరిపాలు చేయొద్దని అన్నారు. 500 ఏళ్లుగా పోరాడుతున్న సమస్యకు పరిష్కారం ఒక్క బీజేపీతోనే సాధ్యం అయ్యిందన్నారు. ముఖ్యఅతిథి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ కాళేశ్వరం పేరు చెప్పి లక్షన్నర కోట్లు మింగితే..కాంగ్రెస్ గెలిచిన 3 నెలల నుండి దొంగ..దొంగ..అనుకుంటూ డబ్బులు సంపాదించుకుందాం అనే యావ తప్ప ప్రజలకు చేస్తున్నది ఏంలేదన్నారు. అన్ని ఫ్రీ ఫ్రీ ఫ్రీ అని 3 నెలలు అయినా ఒక బస్సు ఫ్రీ తప్ప ఏది ఇవ్వలేదన్నారు. 17 ఎంపీ సీట్లు గెలిస్తే కానీ ఇవ్వమని చెబుతున్నారన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఓటుతో కర్రుకాల్చి వాత పెడితే కానీ ప్రభుత్వం పని చేసేలా లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ ప్రభారి కొప్పు భాష, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, రావుల రామ్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్క, ఎస్.కుమార్, సీనియర్ నాయకులు బల్మూరి వనిత, మెరుగు హనుమంతుగౌడ్, వడ్డేపల్లి రాంచందర్, రావుల రాజేందర్, క్యాతం వెంకటరమణ, మిట్టపల్లి రాజేందర్, మాతంగి రేణుక, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం అంటే దాడులా

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపణలు

హైదరాబాద్, ఫిబ్రవరి 24, (జనంసాక్షి) : తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతుంది అని కాంగ్రెస్ చెప్తోందని, నిజంగానే ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. ప్రశ్నిస్తే దాడులు, నిర్బంధాలు, ఎదురిస్తే కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ మండిపడ్డారు. ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'జర్నలిస్ట్ శంకర్‌పైన దాడి చేసి హత్య చేసే ప్రయత్నం చేశారు. సాయి రామ్ రెడ్డి హస్తినాపురం కాంగ్రెస్ ప్రెసిడెంట్‌కి చెందిన అనుచరుడు. పథకం ప్రకారం శంకర్‌ను చంపాలని చూశారు. గొడవపడినట్టు ఇద్దరు మహిళలను పెట్టి పథకం ప్రకారం చేశారు. పాశవికంగా శంకర్‌పై దాడి జరిగింది. ఈ దాడిని అందరూ ఖండించాలి. ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?. అక్షరంతో ప్రశ్నిస్తే అయుధంతో దాడులు చేస్తారా?. హత్యలు చేయటమే ఇందిరమ్మ రాజ్యమా?'అని బాల్క సుమన్ ప్రశ్నించారు. ఇది ప్రజా పాలన లాగా లేదు, ప్రతీకారంతో జరుగుతున్న పాలన లాగా కనిపిస్తుంది. సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రమేయం లేకుండా తెలంగాణ వచ్చిందనే ప్రతీకారం ఉన్నట్టు ఉంది. అనేక మందిపై కేసులు నమోదు చేస్తున్నారు. ప్రజలు ఇలాంటి దాడులు గమనించాలి. ప్రజలకు సుపరిపాలన అందించే ఉద్దేశ్యం లేదు. ఇలాంటి దాడులను ఖండిస్తున్నాం'అని క్రాంతి మండిపడ్డారు.

సెంచరీల మోత

బ్రాడ్‌మన్, గవాస్కర్‌ల సరసన యశస్వీ

వీరేంద్ర సెహ్వాగ్ 16 ఏళ్ల రికార్డును బద్దలుకొట్టిన యశస్వీ జైస్వాల్

600 పరుగులు చేసిన తొలి భారత ఎడమ చేతి బ్యాటర్

- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 353 ఆలౌట్
- 161 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన టీమిండియా
- 73 పరుగులు చేసిన యశస్వి జైస్వాల్
- 4 వికెట్లతో టీమిండియా టాపార్డర్ ను దెబ్బతీసిన ఇంగ్లండ్ స్పిన్నర్ బషీర్

రాంచీ: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా కష్టాల్లో పడింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 7 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది.

క్రీజులో ధృవ్ జురేల్(30), కుల్దీప్ యాదవ్(17) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా ఇంకా 134 పరుగులు వెనుకబడి ఉంది. ఒకానొక దశలో 177 పరుగులకే 7 వికెట్లు కోల్పోయినప్పటికీ ధృవ్ జురేల్, కుల్దీప్ యాదవ్ ఆదుకున్నారు. కాగా ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 353 పరుగులు చేసింది. జోరూట్(122బి) అజేయ సెంచరీతో చెలరేగాడు. భారత బ్యాటింగ్ యూనిట్‌లో యశస్వీ జైస్వాల్ మినహా మిగతా బ్యాటర్లు రాణించలేకపోయారు. సూపర్ ఫామ్‌లో ఉన్న జైస్వాల్(73) మరోసారి హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. ప్రధానంగా ఇంగ్లండ్ స్పిన్నర్లను ఎదుర్కొలేక మన బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూకట్టారు. ఇంగ్లండ్ స్పిన్నర్లు షోయబ్ బషీర్(4/84), టామ్ హార్ట్‌లీ (2/47) భారత్‌ను దెబ్బతీశారు.

తొలి ఇన్నింగ్స్ ప్రారంభంలోనే భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ(2) వికెట్ కోల్పోయింది. ఈ క్రమంలో వన్‌డౌన్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి రెండో వికెట్‌కు జైస్వాల్ 84 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కానీ స్పిన్నర్ షోయబ్ బషీర్ టీమిండియాను దెబ్బకొట్టాడు. వరుస విరామాల్లో 3 కీలక వికెట్లు తీశాడు. గిల్, జైస్వాల్ భాగస్వామ్యాన్ని 25వ ఓవర్‌లో విడదీశాడు. 38 పరుగులు చేసిన గిల్‌ను లెగ్‌బైస్‌లో పెవిలియన్ చేర్చాడు. ఆ కాసేపటికే రజత్ పటీదార్(17)ను కూడా లెగ్‌బైస్‌లో ఔట్ చేశాడు. 2 సిక్సులతో మంచి టచ్‌లో కనిపించిన జడేజా(12)ను పెవిలియన్ చేర్చాడు. దీంతో 130 పరుగులకే టీమిండియా 4 వికెట్లు కోల్పోయింది. 44 పరుగుల వ్యవధిలోనే టీమిండియా 3 వికెట్లు కోల్పోయింది. అయితే ఒకవైపు వికెట్లు పడుతున్న జైస్వాల్ మాత్రం ఒంటరి పోరాటం చేశాడు. ఈ క్రమంలో హాఫ్ సెంచరీని కూడా పూర్తి చేసుకున్నాడు. కాసేపటికే తర్వాత మరోసారి చెలరేగిన బషీర్.. జైస్వాల్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో 161 పరుగులకు భారత జట్టు సగం వికెట్లు కోల్పోయింది. 8 ఫోర్లు, ఒక సిక్సుతో 117 బంతుల్లో జైస్వాల్ 73 పరుగులు చేశాడు. సర్ఫరాజ్ ఖాన్(14), రవిచంద్రన్ అశ్విన్ (1)ను మరో స్పిన్నర్ టామ్ హార్ట్‌లీ తక్కువ స్కోర్లకే ఔట్ చేశాడు. దీంతో 177 పరుగులకే టీమిండియా 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. భారత జట్టు 200 పరుగుల మార్కు అయినా చేరుకుంటుందో లేదో అనే అనుమానం కల్గింది. ఇలాంటి సమయంలో ధృవ్ జురేల్, కుల్దీప్ యాదవ్ మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. వీరిద్దరు టీమిండియా స్కోర్‌ను 200 దాటించారు. ఎనిమిదో వికెట్‌కు అజేయంగా 42 పరుగులు జోడించారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు 7 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది.

కాగా అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 353 పరుగులకు ఆలౌట్ అయింది. 302/7 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు మంచి ఆరంభం లభించింది. ఒలీ రాబిన్సన్ హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. టెస్టుల్లో రాబిన్సన్‌కు ఇదే తొలి హాఫ్ సెంచరీ. 103వ ఓవర్ నుంచి టీమిండియా స్పిన్నర్ రవీంద్ర జడేజా చెలరేగాడు. రాబిన్సన్(58)ను ఔట్ చేసి భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాడు. రూట్, రాబిన్సన్ కలిసి ఎనిమిదో వికెట్‌కు 100 పరుగులు జోడించారు. ఆ తర్వాత షోయబ్ బషీర్, జేమ్స్ అండర్సన్‌ను డకౌట్ చేశాడు. దీంతో 6 పరుగుల వ్యవధిలో ఇంగ్లీష్ జట్టు తమ చివరి 3 వికెట్లను కోల్పోయింది. సెంచరీ చేసిన రూట్ 122 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 4, ఆకాష్ దీప్ 3, సిరాజ్ 2, అశ్విన్ ఒక వికెట్ తీశారు.

ఇంగ్లండ్ సిరీస్‌లో దంచికొడుతున్న భారత యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ రికార్డుల దుమ్ము దులుపుతున్నాడు. వరుసగా రెండో డబుల్ సెంచరీతో చరిత్ర సృష్టించిన యశస్వీ.. రాంచీ టెస్టులో హాఫ్ సెంచరీ కొట్టాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా 73 పరుగులతో రాణించి ఈ సిరీస్‌లో 600 పరుగుల మార్క్ దాటాడు. తద్వారా ఒకే సిరీస్‌లో అత్యధిక పరుగులతో క్రికెట్ దిగ్గజాలు గ్యారీ సోబర్స్, డాన్ బ్రాడ్‌మన్ సరసన నిలిచాడు. ఒకే టెస్టు సిరీస్‌లో ఆరొందలకు పైగా రన్స్ కొట్టిన సునీల్ గవాస్కర్, గ్రేమ్ స్మిత్, జార్జ్ హెడ్లే, నీల్ హార్వేతో కూడిన ఎలైట్ క్లబ్‌లో చోటు దక్కించుకున్నాడు. క్రికెట్ లెజెండ్ బ్రాడ్‌మన్ 1930లో ఇంగ్లండ్‌పై ఓ రేంజ్‌లో చెలరేగాడు. వీరబాదుడు బాదిన అతడు ఏకంగా 974 రన్స్ కొట్టాడు. వెస్టిండీస్ మాజీ క్రికెటర్ గ్యారీ సోబర్స్ రెండో స్థానంలో నిలిచాడు. 1957-58 మధ్య పాకిస్థాన్‌పై 824 పరుగులు బాదాడు. భారత దిగ్గజం సునీల్ గవాస్కర్ 1970-71లో వెస్టిండీస్‌పై 774 రన్స్ కొట్టి థర్డ్ ప్లేస్ సంపాదించాడు.

సునీల్ గవాస్కర్, గ్రేమ్ స్మిత్

దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ 2003లో ఇంగ్లండ్‌పై 714 రన్స్ బాదాడు. జార్జ్ హెడ్లే ఇంగ్లండ్‌పై 703 పరుగులతో ఐదో స్థానంలో నిలవగా.. నీల్ హార్వే దక్షిణాఫ్రికాపై 660 రన్స్ సాధించాడు. యశస్వీ 618 పరుగులతో ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్ సిరీస్ ముగిసే లోపు అతడు టాప్-4లోకి దూసుకెళ్లినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు.

రంజీ ట్రోఫీ, ఇండియన్ ప్రీమియర్ లీగ్ 16వ సీజన్ ప్రదర్శనతో టీమిండియా జెర్సీ వేసుకున్న యశస్వీ పరుగుల వరద పారిస్తున్నాడు. నిరుడు టెస్టుల్లో అరంగేట్రం చేసిన యశస్వీ.. ఇప్పటివరకూ ఏడు ఇన్నింగ్స్‌ల్లో 103 సగటుతో 618 రన్స్ కొట్టాడు. కెరీర్ మొదలెట్టిన కొన్ని రోజుల్లోనే ఈ యంగ్‌స్టర్ 2 సెంచరీలు, రెండు ఫిఫ్టీలు సాధించి భారత భావితారగా ప్రశంసలు అందుకుంటున్నాడు. బలమైన ఫుట్‌వర్క్, షాట్ సెలెక్షన్‌లో కచ్చితత్వం, అలవోకగా బౌండరీలు, సిక్సర్లు బాదగల నైపుణ్యంతో యశస్వీ భారత క్రికెట్‌కు తరగని ఆస్తిలా మారుతున్నాడు.

మాట నిలబెట్టుకున్న సచిన్..

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కశ్మీర్ పర్యటనలో సరదాగా, సందడిగా గడుపుతున్నాడు. స్థానిక కుర్రాళ్లతో గల్లీ క్రికెట్ ఆడుతూ.. మంచు వర్షాన్ని ఆస్వాదిస్తూ మస్త్ ఎంజాయ్ చేస్తున్న మాస్టర్ బ్లాస్టర్ తాజాగా తన వీరభిమానిని కలిశాడు. దివ్యాంగుడైన క్రికెటర్ అమిర్ హుస్సేన్ లోనె ను కలసి అతడికి బ్యాట్‌ను కానుకగా ఇచ్చాడు. క్రికెట్ లెజెండ్ తనను కలవడమే కాకుండా గుర్తుండిపోయే బహుమతి ఇవ్వడంతో అమిర్ గాల్లో తేలిపోతు న్నాడు. సచిన్, అమిర్‌తో మాట్లాడుతున్న వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది.

హాకీ జట్టు చీఫ్ కోచ్ రాజీనామా

గౌరవం లేదనే వైదొలిగిందా?

భారత మహిళల హాకీ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. చీఫ్ కోచ్‌గా ఉన్న జన్నెకె స్కాప్‌మన్ శనివారం తన పదవికి రాజీనామా చేసింది. భారత్‌లో మహిళలకు తగిన గౌరవం లేదంటూ సంచలన వ్యాఖ్యలు చేసిన రెండు రోజులకే ఆమె పదవి నుంచి వైగొలగడం గమనార్హం.

భారత మహిళల సీనియర్ హాకీ జట్టు చీఫ్ కోచ్ పదవి నుంచి వైదొలుగుతున్నా. హాకీ ఇండియా, సాయ్‌లకు ఒక నెల ముందస్తు నోటీస్ పంపిస్తున్నా. మార్చి 23వ తేదీన నా పదవి ముగుస్తుంది. నాకు రావాల్సిన బకాయిలను త్వరగా చెల్లించాలని కోరుతున్నా. భారత జట్టుతో తాను కొనసాగిన సమయం ఎప్పటికీ గుర్తుండిపోతుం ది' అంటూ స్కాప్‌మన్ వెల్లడించింది. ఈ ఏడాది ఆగస్టు వరకు హాకీ ఇండియాతో కాంట్రాక్ట్ ఉంది. ప్యారిస్ ఒలింపిక్స్ తర్వాత 46 ఏండ్ల స్కాప్‌మన్ జట్టును వీడాల్సి ఉంది. కానీ, అనూహ్యంగా ఐదు నెలల ముందే ఆమె రాజీనామా సమర్పించింది.

ఆసియా క్రీడల్లో కాంస్య పతకం నెగ్గిన భారత జట్టు

అయినా సరే స్కాప్‌మన్‌ను కొనసాగించాలని హాకీ ఇండియా భావించింది. కానీ, ఆ మె వారం క్రితం హాకీ ఇండియాపై తీవ్ర ఆరోపణలు చేసింది. తనను ఎవరూ గౌర వించడం లేదని, భారత్‌లో మహిళలకు తగిన ప్రాధాన్యం లేదని స్కాప్‌మన్ అంది. దాంతో, ఆమె కోచ్ పదవికి రాజీనామా చేసే చాన్స్ ఉందనే ఊహగానాలు వినిపిం చాయి. అనుకున్నట్టుగానే స్కాప్‌మన్ పదవి నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించింది.

గుండెపోటుతో యువ క్రికెటర్ మృతి

ఇటీవలే కాలంలో గుండెపోటు మరణాలు కలచివేస్తున్నాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా అనేకమంది ప్రజలు గుండెపోటుతో చనిపోతున్నారు. అంత వరకూ బానే ఉన్న వాళ్లు ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు వదులుతున్నారు. తాజాగా గుండెపోటు కారణంగా ఓ యువ క్రికెటర్ మరణించాడు. కర్ణాటక మాజీ క్రికెటర్ కే.హెూయసల గుండెపోటుతో కన్నుమూశాడు. కేవలం 34 ఏళ్ల వయసులోనే అతడు మైదానంలోనే కుప్పకూలి చనిపోయాడు. 'ఏజిస్ సౌత్ జోన్ టోర్నమెంట్'లో భాగంగా బెంగళూరులోని ఆర్ఎస్ఐ క్రికెట్ మైదానంలో తమిళనాడు, కర్ణాటక మధ్య మ్యాచ్ ముగిసిన అనంతరం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ మ్యాచ్ గెలిచిన కర్ణాటక ఆటగాళ్లు సెలబ్రేషన్స్ లో మునిగిపోయారు. ఆ సమయంలో తీవ్రమైన ఛాతినొప్పితో హెూయసల మైదానంలోనే కుప్పకూలిపోయాడు.

గమనించిన తోటి ఆటగాళ్లు, సిబ్బంది హుటాహుటిన అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే హెూయసల గుండెపోటు కార ణంగా మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషాద ఘటన ఫిబ్రవరి 22న జరగ్గా తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న పలువురు క్రికెటర్లు, అభిమానులు హెూయసల మృతికి సోషల్ మీడియా ద్వారా సంతాపం తెలుపుతూ పోస్టులు పెడుతున్నారు. కాగా మిడి ల్ ఆర్డర్ బ్యాటర్‌గా, బౌలర్‌గా అండర్-25 విభాగంలో కర్ణాటక జట్టుకు హెూయసల ప్రాతినిధ్యం వహించాడు. కర్ణాటక ప్రీమియర్ లీగ్‌లో కూడా ఆడాడు.

ముగ్గురు భామల క్రూ

బాలీవుడ్ భామలు టబు, కరీనా కపూర్ ఖాన్, నేషనల్ అవార్డు విన్నర్ కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'క్రూ'. లూటొకేస్' ఫేమ్ రాజేష్ కృష్ణన్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను ఏక్తాకపూర్, రియాకపూర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను మార్చి 29న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ముగ్గురు ఎయిర్ హోస్టెస్ గెటప్‌లో కనిపిస్తున్నారు. టబుతో ప్రమాదం అని, కరీనాను దొంగ అని, కృతి సనన్‌ను నకిలీ అని పోస్టర్స్‌కు క్యాప్షన్ ఇవ్వడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఎయిర్‌హోస్టెస్‌గా పనిచేస్తున్న ముగ్గురు మహిళల జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. ఇక ఈ చిత్రంలో పంజాబీ యాక్టర్ దిల్జీత్ దోసాంజ్, కపిల్ శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

విజయం కోసం వరుణ్ ఎదురుచూపు

విజయం కోసం పరితపిస్తున్న యువనటుల్లో మెగా కుటుంబం నుండి వచ్చిన వరుణ్ తేజ్ ఒకరు. వరుణ్ కి ఒక మంచి బ్రేక్ వచ్చి చాలా సంవత్సరాలు అయింది. ఐదేళ్ల క్రితం చేసిన 'గద్దలకొండ గణేష్' అనే సినిమా పరవాలేదు బాగానే ఆడింది అని అన్నారు, అంతే ఆ తరువాత వరుణ్ కొన్ని సినిమాలు చేసినా విజయం మాత్రం వరించలేదు. ఆ సినిమా తరువాత పాండెమిక్ రావటం, కొంచెం విరామం తీసుకోవటం జరిగింది. 'గద్దలకొండ గణేష్' చేసిన మూడేళ్ళ తరువాత 'ఘని' అని బాక్సింగ్ నేపథ్యంలో వచ్చిన సినిమా చేశారు, కానీ అది తీవ్ర నిరాశే మిగిల్చింది. విడుదలైన రెండో రోజుకే ఆ సినిమాని కొన్ని థియేటర్స్ నుండి తీసేసారు. ఆ తరువాత వరుణ్ ఎక్కువ సినిమాలు ఒప్పుకోలేదు అనే చెప్పాలి. ఆ తరువాత వచ్చిన 'ఈ3: ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్' ముందు వచ్చిన 'ఎఫ్ 2' కి సీక్వెల్ గా వచ్చింది. ఇందులో వెంకటేష్ ఇంకో కథానాయకుడిగా వేశారు, కానీ ఈ సినిమా మొదటి సినిమా అంత విజయం సాధించలేదనే చెప్పాలి. గత సవంత్సరం 'గాండీవధారి అర్జున' అనే గూఢచారి, యాక్షన్ నేపథ్యం వున్న సినిమా చేశారు. ప్రవీణ్ సత్తారు దీనికి దర్శకుడు. అయినా ఈ సినిమా కూడా డిజాస్టర్ గా నిలిచింది. గత సంవత్సరం తన సహచరి నటి లావణ్య త్రిపాఠి ని వివాహం చేసుకున్నారు. ఇప్పుడు 'ఆపరేషన్ వాలెంటైన్' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఇది తెలుగు, హిందీ భాషల్లో విడుదలవుతోంది. ఇది ఎయిర్ ఫోర్స్ నేపథ్యంలో కొన్ని నిజ సంఘటనల ఆధారంగా మలిచిన చిత్రం అని చెపుతున్నారు. దీనికి హిందీ దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ హడ దర్శకత్వం వహించారు. అయితే ఇది మరి తెలుగు ప్రేక్షకులకు ఆసక్తికరంగా ఉంటుందా అని ఒక చిన్న సందేహం అని పరిశ్రమలో టాక్. అలాగే ఈ సినిమా వార్ నేపథ్యం కూడా ఉంటుంది అని చెపుతున్నారు.ఇలాంటి నేపథ్యం వుండే సినిమాలు తీసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి, ఇంతకు ముందు వరుణ్ తేజ్ 'అంతరిక్షం' అనే సినిమా ఒకటి చేశారు. కానీ ఇది ప్రేక్షకులకి అంతగా ఎక్కలేదు. మరి ఈ 'ఆపరేషన్ వాలెంటైన్' అనే సినిమా తెలుగు ప్రేక్షకులకి ఆసక్తికరంగా ఉంటుందా? ఎందుకంటే ఈ సినిమా టైటిల్ ఇంగ్లీష్ లో వుంది, మరి ఇలాంటి టైటిల్ పెడితే మాస్ ప్రేక్షకులు థియేటర్స్ కి వస్తారా అని ఒక సందేహం కూడా వుంది అని చర్చ. అదీ కాకుండా ఈమధ్య పాన్ ఇండియా కథలంటూ తెలుగు నటులు చాలామంది ప్రయత్నాలు చేశారు, కానీ ఎవరూ సఫలం కాలేదు. మరి వరుణ్ సినిమా ఎంతవరకు విజయం సాధిస్తుందో చూడాలి. ఈ సినిమా మార్చి 1 న ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

సినిమా

'గామి' నుంచి 'గమ్యాన్నే'

టాలీవుడ్ యువ నటుడు విశ్వక్ సేన్ హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం 'గామి'. చాందిని చౌదరి కథానాయిక నటిస్తున్న ఈ సినిమాకు విద్యాధర్ కాగిత దర్శకత్వం వహిస్తున్నాడు. క్రౌడ్ ఫండింగ్‌లో భాగంగా చేసిన ఈ సినిమాకు కార్తీక్ శబరీష్ నిర్మాత. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు గామి టీజర్ వీడియో విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి మేకర్స్ మ్యూజికల్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ నుంచి గమ్యాన్నే.. ది క్వెస్ట్ సాంగ్ అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేశారు. సొమ్మసిల్లిపోయి కూలింది కాలం.. సత్తువంతు లేక ఇంకెంత కాలం.. సన్నగిల్లకుంది ఈ వింత దూరం దిక్కుతోచకుండా ఇంకెంత దూరం అంటూ సాగిన ఈ పాట ఫుల్ ఎమోషనల్‌గా సాగింది. సనపతి భరద్వాజ్ పాత్రుడు సాహిత్యం అందించిన ఈ పాటకు అనురాగ్ కులకర్ణి, స్వీకర్ అగస్తి, సుగుణమ్మ కలిసి పాడరు. స్వీకర్ అగస్తీ సంగీతం అందించాడు.

అనుపమ అందాల ఆరబోత

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ అనుపమ పరమేశ్వరన్ హీరోహీరోయిన్లుగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తోన్న చిత్రం 'టిల్లు స్క్వేర్' మల్లిక్‌రామ్ దర్శకుడు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ సినిమా ఓటీటీ రైట్స్ రికార్డ్ ప్రైస్‌కు అమ్ముడయినట్లుగా తెలుస్తోంది. నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఈ సినిమా ఓటీటీ హక్కులను రూ. 35 కోట్లకు సొంతం చేసుకున్నట్లుగా టాలీవుడ్ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. ఇది నిజమైతే మాత్రం ఈ మధ్యకాలంలో ఏ యంగ్ హీరోకి లేని రికార్డ్‌ను సిద్ధు జొన్నలగడ్డ క్రియేట్ చేసినట్లే. ఎలా అంటే, ఈ మధ్య కాలంలో ఏ కుర్ర హీరో చిత్రానికీ ఈ రేంజ్‌లో హక్కులు అమ్ముడవలేదు. 'డీజే టిల్లు' సక్సెస్ తర్వాత వస్తున్న ఈ సీక్వెల్‌పై మంచి అంచనాలు అయితే ఉన్నాయి కానీ.. ఈ రేంజ్‌లో ఓటీటీ హక్కులు అమ్ముడవుతాయని మాత్రం ఎవరూ ఊహించి ఉండరు. అందుకు కారణం మాత్రం అనుపమ అందాలే అని చెప్పకోవాలి. ఇప్పటి వరకు పక్కింటి అమ్మాయిలా కనిపించిన అనుపమ.. ఈ సినిమా విషయంలో మాత్రం ఓ రేంజ్‌లో రెచ్చిపోయి కనిపిస్తోంది. ప్రేమికుల రోజున విడుదలైన ట్రైలర్‌లో ఆ విషయం స్పష్టంగా తెలిసిపోయింది. ట్రైలర్ తర్వాత ఈ సినిమా స్వరూపమే మారిపోయింది. అది ఇలా హక్కుల రూపంలో కనిపిస్తోంది. సిద్ధు జొన్నలగడ్డ కూడా తనదైన నటనతో మరోసారి సినిమాపై అంచనాలను పెంచేశారు. ట్రైలర్‌లో ఆయన చెప్పే ఒక్కో డైలాగ్.. క్రిస్పీ అన్నట్లుగా ఉంది. మొత్తంగా అయితే.. ఓటీటీ రైట్స్‌తో 'టిల్లు స్క్వేర్' మరోసారి వార్తలలో వైరల్ అవుతోంది. మార్చి 29న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మరి ట్రైలర్‌తో ఇంత హీట్ పుట్టించిన అనుపమ.. సినిమాలో ఇంకేం చేసి ఉంటుందో తెలియాలంటే మాత్రం.. మార్చి 29 వరకు వెయిట్ చేయక తప్పదు.

సరిపోదా శనివారం

నానిహీరోగా నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం' వివేక్ ఆత్రేయ దర్శకుడు. డి.వి.వి.ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై డి.వి.వి. దానయ్య నిర్మిస్తున్నారు. శనివారం నాని పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. నానికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ నిర్మాణ సంస్థ సమవర్తి.. సమవర్తి అంటూ ఇందులో నాని సూర్య అనే పాత్రలో నటిస్తున్నాడు. 'కోపాలు రకరకాలు. ఒక్కో మనిషిలో ఒక్కోలా ఉంటుంది. కానీ ఆ కోపాన్ని క్రమబద్ధంగా, ఓ పద్ధతిగా వారంలో ఒక్కరోజు మాత్రమే చూపించే పిచ్చి నా కొడుకుని చూశారా? నేను చూశా... పేరు సూర్య... రోజు శనివారం' అంటే హీరో పాత్రను ప్రతినాయక పాత్ర పోషిస్తున్న ఎస్.జె.సూర్య పరిచయం చేశారు. గ్లింప్స్‌లో హీరో ఇంట్రడక్షన్ ఇచ్చిన తీరు బావుంది. నాని మాస్ లుక్‌లో ఆకట్టుకుంటు న్నారు. ప్రియాంక అరుళ్ మోహన కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజాయ్ సంగీతం అందిస్తున్నారు. చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది.

సమంత గ్లామర్ డోస్

టాలీవుడ్ అగ్ర హీరోయిన్ సమంత మరోసారి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తరుచూ తన రొటీన్ లైఫ్ ఫొటోలను అభిమానులతో పంచుకునే సమంత తాజాగా విడుదల చేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెద్ద రచ్చనే లేపుతున్నాయి. ప్రస్తుతం మలేసియాలో ఓ గ్రాండ్ రిసార్ట్‌లో వేకేషన్ ఎంజాయ్ చేస్తున్న సమంత అక్కడ ఓ చిన్న పాండ్‌లో బికినీలో స్విమ్ చేస్తూ దిగిన ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయగా క్షణాల్లోనే తెగ వైరల్‌గా మారాయి. దీంతో చాలామంది హాలీడేస్ ఎంజాయ్ చేయండి అంటూ కామెంట్స్ పెడుతుండగా మరికొందరు సమంత ఏంటి విడాకుల తర్వాత రోజురోజుకు గ్లామర్ డోస్ పెంచుతుందంటూ నోరెళ్ల బెడుతున్నారు. ఇదిలాఉండగా అనారోగ్య సమస్యలతో ట్రీట్మెంట్ తీసుకున్న సమంత ప్రస్తుతం బయటి దేశాల్లో ఎక్కువగా గడుపుతూ విశ్రాంతి తీసుకుంటుంది. ఇక ఆమె తాజాగా నటించిన బాలీవుడ్ వెబ్ సిరీస్ సిటాడెల్ త్వరలో విడుదల కానుంది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
25 ఫిబ్రవరి 2024

భూమాత కోసం ఆర్వోఆర్ చట్ట సవరణ?

● ప్రభుత్వానికి ధరణి కమిటీ సిఫార్సు



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 23 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో భూమాతను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. భూమాత కోసం ఆర్వోఆర్ చట్టం సవరణకు ధరణి కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థ వల్ల రాష్ట్రంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని విషయాన్ని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ దాని స్థానంలో భూమాతను తీసుకొస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణి సమస్యలపై అధ్యయనానికి ధరణి కమిటీ వేసింది. ఈ కమిటీ వివిధ శాఖల అధికారులతో అనేక సమావేశాలను నిర్వహించారు. దరఖాస్తులు పెండింగ్ ఉండడానికి కారణాలను పరిశీలించారు. ధరణి పేరు మార్పు చేయాలన్నా ముందుగా చట్టసవరణ చేయాలని ప్రభుత్వానికి చెప్పేందుకు కమిటీ సిద్ధమవుతున్నది. తెలంగాణ రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదారు పాస్ బుక్స్ యాక్ట్ - 2020(ఆర్వోఆర్ యాక్ట్)లోనే ధరణి పోర్టల్ ప్రస్తావన ఉండడం మూలాన ఉన్నపళంగా భూమాతగా తీసుకొచ్చే ఆస్కారమే లేదు. ఈ క్రమంలో ఇప్పటికిప్పుడు భూమాత అందుబాటులోకి వచ్చే అవకాశాలు లేవని తెలుస్తోంది.

మార్పులు, చేర్పులతో కొత్తగా..

ధరణి కమిటీ వివిధ శాఖల అధికారులతో సంప్రదింపులు జరిపింది. కమిటీ సభ్యుల్లో ఒకరైన ఎం.సునీల్ కుమార్ ఇప్పటికే అనేక గ్రామాల్లో భూ న్యాయ శిబిరాలు నిర్వహించారు. ధరణి పోర్టల్, కొత్త ఆర్ఓఆర్ చట్టం అమలుకు ముందు, ఆ తర్వాత వాస్తవాలను గ్రౌండ్‌లో పర్యటించి తెలుసుకున్నారు. ఆయన ప్రాతినిధ్యం వహించే లీఫ్స్ అనే సంస్థ ద్వారా ధరణి సృష్టించిన సమస్యలపై అధ్యయనం కూడా చేయించారు. ఇక ఎం.కోదండరెడ్డి కూడా కొన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి కలెక్టర్ దగ్గర ప్రస్తావించారు. ఈ క్రమంలో క్షేత్ర పర్యటన అవసరం పెద్దగా లేదని కమిటీ నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఇప్పటి దాకా సాగిన అధ్యయనం ఆధారంగానే కమిటీ పలు సిఫారసులను ప్రభుత్వం ముందుంచే అవకాశం కనిపిస్తోంది.

తెలంగాణలో మేలైన భూ పరిపాలన 1948, 1971 పాటు ఇతర అన్ని రాష్ట్రాల విధానాలను కమిటీ సభ్యులు అధ్యయనం చేస్తున్నారు. సమకాలీన పరిస్థితులకు తగ్గట్లుగా మార్పులు చేర్పులతో కొత్త చట్టాన్ని రూపొందించాలన్న సూచనలను త్వరలో చేయనున్నట్లు తెలిసింది. భూ సమస్యలకు పరిష్కార మార్గాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రీకృతం చేసింది. తహశీల్దార్ చేసే పనినీ సీసీఎల్ఎకి అప్పగించింది. దీంతో భూమాతను అమలు చేస్తే అధికార వికేంద్రీకరణ అనివార్యమని కమిటీ తేల్చేసింది. దీన్ని కేటగిరీలుగా విభజించనున్నట్లు తెలిసింది. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో చేసే పనులను గుర్తించనున్నట్లు సమాచారం. ఉదాహరణకు విరాసత్ గ్రామస్థాయిలోనే పూర్తవుతుంది. వారసులెవరో ఆ ఊరిలోనే తేల్చేయొచ్చు. చిన్న చిన్న క్లరికల్ మిస్టేక్స్ మండల స్థాయిలోనే చేయవచ్చు. ఇలా అన్నింటినీ విడదీసేందుకు ప్లాన్ చేస్తున్నారు. అలాగే భూమాతకు ముందే గ్రామ సభల ద్వారా రెవెన్యూ డేటాను సరిదిద్దాలన్న సంకల్పంతో ఉన్నారు. అక్కడికక్కడే సమస్యల పరిష్కారాన్ని చూపడం ద్వారానే మెరుగైన భూ పరిపాలన వ్యవస్థ ఏర్పడుతుందని కమిటీ భావిస్తోంది.

కమిటీ చేసే సూచనలివే...

దేవాదాయ శాఖ, వక్ఫ్ భూముల ఆస్తులపై ముందు సమాచారం రావాలి. ఆ శాఖల్లో ట్రిబ్యునళ్లు లేకుండా జారీ చేసిన ఎన్వోసీలపై విచారణ జరగాలి. సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్న గెజిట్ నోటిఫికేషన్‌పై సమీక్ష జరగాల్సిందే. అలాగే ఆస్తుల పరిరక్షణకు వారి ల్యాండ్ పార్శిళ్లకు జియోట్యాగింగ్ చేయాలి. ఫారెస్ట్ ల్యాండ్ వివరాలపై అటవీ శాఖ లెక్కలకు, రెవెన్యూ శాఖ డేటా మధ్య తేడా నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా గెజిట్ నోటిఫికేషన్ ద్వారా సూచించిన భూములను ధరణి పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు.డీమ్డ్ ఫారెస్ట్ పేరిట అటవీ శాఖ గుర్తించిన భూములపై పేచీ ఉంది. ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయకుండానే డీమ్డ్ ఫారెస్ట్ పేరిట లెక్కలు రాసుకున్నారు. అభ్యంతరాల స్వీకరణ చేయకుండానే గుర్తింపు ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే చాలా చోట్ల ప్రభుత్వ, పట్టా భూములకు, ఫారెస్ట్ ల్యాండ్‌ల సరిహద్దు వివాదాలు, విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయి. వీటికి అనాదిగా సూచిస్తున్నట్లుగా జాయింట్ సర్వే వెంటనే మొదలు పెట్టాలి. ఇలాంటి అనేక సూచనలను కమిటీ రికమండ్ చేయనున్నట్టు తెలుస్తోంది.

రాష్ట్రాన్ని పొత్తిళ్లలో పెట్టుకుని కాపాడుకుంటాం

దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : అమ్మవారి కుంకుమ భరిణె అంత పవిత్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను పొత్తిళ్ళలో పెట్టుకుని కాపాడుకుంటామని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. జాతరను విజయవంతం చేయడంలో సహకరించిన ముఖ్యమంత్రికి, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, , పోలీసులు, దేవాదాయ శాఖ, శానిటేషన్ సిబ్బంది, ఇతర శాఖలకు చెందిన ప్రతి ఉద్యోగికి, సిబ్బందికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. జాతర ఏర్పాట్లు, నిర్వహణలో అన్ని శాఖలు పరస్పర సహకారంతో, సమన్వయంతో వ్యవహరించి, చిత్తశుద్ధిని కనబరచి ఈ మహా జాతరను దిగ్విజయవంతంగా పూర్తి చేసాయని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జాతర పనులను ముందు నుండే ప్రణాళికాబద్ధంగా చేపట్టడంతో భక్తులు అమ్మవార్లను ప్రశాంతంగా దర్శించుకొని, మొక్కులు చెల్లించుకొని, సంతృప్తితో తిరుగు ప్రయాణమయ్యారని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం భక్తులకు అడుగడుగునా అన్ని వసతులను కల్పించేందుకు శాయశక్తులా ప్రయత్నం చేసిందని మంత్రి స్పష్టం చేశారు. కోట్లాదిగా పోటెత్తిన ఈ మహాజాతరలో తెలిసీ తెలియక భక్తులు ఏమైనా ఇబ్బందులకు గురైతే పెద్ద మనసుతో క్షమించాలని మంత్రి విన్నవించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా మొదటిసారి మేడారం జాతర నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతను పూర్తి నిష్టతో చేపట్టినట్లు మంత్రి తెలిపారు. అమ్మవారి దయతో అనారోగ్యాన్ని జయించి, త్వరగా కోలుకొని అమ్మవార్లు గద్దెలకు చేరుకున్నాక దర్శించుకునే భాగ్యం కలిగిందని మంత్రి అన్నారు. సమ్మక్క సారలమ్మల దయ తెలంగాణ ప్రజల పై సదా వుండాలని ఆకాంక్షించారు.

టీఎస్పీఎస్సీ గ్రూప్ 1 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి24 (జనంసాక్షి) : తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) గ్రూప్ 1 రిక్రూట్‌మెంట్ 2024 దరఖాస్తు ప్రక్రియను ప్రారంభమైంది. తెలంగాణ పీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష 2024 మే, జూన్‌లో జరిగే అవకాశం ఉంది. టీఎస్పీఎస్సీ ప్రిలిమినరీ ఎగ్జామ్ 2024 కోసం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ రిక్రూట్‌మెంట్ పరీక్ష కోసం దరఖాస్తు ప్రక్రియను కమిషన్ ప్రారంభించింది.డిప్యూటీ కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారితో సహా మొత్తం 563 ఖాళీల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ దరఖాస్తులకు అభ్యర్థులందరూ అప్లికేషన్ ఫీజూ రూ.200 చెల్లించాలి. పరీక్ష ఫీజు కాకుండా రూ.120 చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగ దరఖాస్తుదారులందరికీ పరీక్ష ఫీజు మినహాయింపు ఉంటుంది. 26 ఏప్రిల్ 2022 తేదీ నోటిఫికేషన్ నంబర్ 04/2022 కోసం గతంలో దరఖాస్తు చేసిన, ఫీజు చెల్లించిన అభ్యర్థులు ఈ నోటిఫికేషన్ కోసం మళ్లీ దరఖాస్తు చేయవలసిన అవసరం లేదు.టీఎస్పీఎస్సీ గ్రూప్ 1 పరీక్ష 2024 ఎంపిక ప్రక్రియలో మూడు రౌండ్‌లు ఉంటుంది. ఇందులో ప్రీ, మెయిన్స్, డాక్యుమెంట్‌ల వెరిఫికేషన్ రౌండ్స్ ఉంటాయి. టీఎస్పీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలో ఒక పేపర్ ఉంటుంది, దీనిలో 150 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 మార్కు తొలగిస్తారు. ప్రిలిమినరీ పరీక్ష 2.5 గంటలు, ప్రధాన పరీక్ష పేపర్ 3 గంటల పాటు ఉంటుంది.

జీవో 317 సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు పట్ల పిఆర్‌టియు తెలంగాణ హర్షం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : ప్రభుత్వం 317 బాధిత ఉపాధ్యాయ ఉద్యోగులకు న్యాయం చేయడానికి ఉప సంఘాన్ని నియమించడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గార్లపాటి ఉమాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 అమలులో భాగంగా ఉద్యోగుల శాశ్వత కేటాయింపు కోసం గత ప్రభుత్వం తీసుకువచ్చిన 317 జీవో లోని అసంబద్ధమైన మార్గదర్శకాల కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని వారు తెలిపారు. క్యాడర్ లో జూనియర్‌లు అందరూ స్థానిక, సొంత జిల్లాలను వదిలి పరాయి జిల్లాలకు కేటాయించారని, భార్యాభర్తలైన ఉద్యోగ, ఉపాధ్యా యులు వేరువేరు జిల్లాలకు కేటాయించారని గుర్తు చేశారు. నిబంధనల ప్రకారం భార్యాభర్తలను ఒకే జిల్లాలో బదిలీ చేయాల్సి ఉండగా కేవలం 19 జిల్లా లకు మాత్రమే అనుమతించి మిగతా 13 జిల్లాలను బ్లాక్ చేశారని, దీంతో భార్య ఒక చోట ఉండి, భర్త ఒక చోట ఉండి, వారి పిల్లలు మరొకచోట ఉంటూ అనుభవించిన బాధలు వర్ణాతీతమని ఉర్తు చేశారు. ఈ విషయాలన్నీ గ్రహించిన పిఆర్‌టియు తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు, టిపిసిసి అధికార ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఈ జీవో వెలువడిన 2021 డిసెంబర్ 6న మరుసటి రోజే జీవో ప్రతులను చించి వేస్తూ నిరసన వ్యక్తం చేశారని, 317 బాధిత ఉపాధ్యా య, ఉద్యోగులు అనుభవిస్తున్న బాధను తీర్చడానికి కాంగ్రెస్ మేనిఫెస్టోలో 317 బాధిత సమస్యను చేర్చేలా హర్షవర్ధన్ రెడ్డి కృషి చేయడమే కాకుండా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి, తద్వారా ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా ఉపసంఘం ఏర్పాట్లు చేయడంలో కీలక పాత్ర గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి పోషించారని తెలిపారు.

కాంగ్రెస్ గూటికి డిప్యూటీ మేయర్ శ్రీలత

● బీఆర్ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్ష పదవికి రాజీనామా

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ఆ పార్టీకి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. బీఆర్ఎస్ నాయకులు వరుసగా పార్టీని వీడటం గమనార్హం. ఫిబ్రవరి 13న తార్నాక డివిజన్ కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన విషయం తెలిసింది. కొంత కాలంగా బీఆర్ఎస్‌తో అసంతృప్తిగా ఉన్న డిప్యూటీ మేయర్ శ్రీలత రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జీ దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆ పార్టీలోకి చేరనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేతలకు రాజీనామ సమర్పించినట్లు తెలుసుంది. శ్రీలతతో పాటు బీఆర్ఎస్ నాయకులు మరో ఆరు మంది కాంగ్రెస్‌లోకి చేరనునట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపునుంచి బరిలో నిలిచేందుకు శ్రీలత సిద్ధమైనట్లు సమాచారం. అందులో భాగంగానే సికింద్రాబాద్ టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తున్నప్పటికీ.. దీనిపై ఎలాంటి స్పష్టత రాలేదు. భవిష్యత్తులో దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణా రెడ్డి, ఆయన కోడలు రంగారెడ్డి జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డి ముఖ్యమంత్రిని కలిశారు. త్వరలో వీరిద్దరూ బీఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ చేరనున్నట్లు సమాచారం. ఇక ఇప్పటికే పట్నం మహేందర్ రెడ్డి సతీమణి వికారాబాద్ జెడ్పీ ఛైర్మన్ పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ క్రమంలోనే త్వరలో మరింత మంది కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు క్యూ కట్టనున్నారు.

గంగుల అనుచరుడిపై మరో కేసు

● నందెల్లి మహిపాల్‌పై మానకొండూరు పీఎస్‌లో నమోదు

కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 24 (జనం సాక్షి) : వివాదంలో ఉన్న భూమిని విక్రయించటమేగాక చంపుతానని బెదిరింపులకు పాల్పడినందుకు మానకొండూరు పోలీసు స్టేషన్ లో మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మానకొండూరు ఇన్స్పెక్టర్ రాజు కుమార్ తెలిపారు. (ఎ1) గా ఉన్న దుర్గం జగన్ గౌడ్ ని ఒకరిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించగా, (ఎ2)గా బి.ఆర్.ఎస్. నాయకుడు, ఉమ్మడి జిల్లా ఒలంపిక్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్ పై మరో కేసు నమోదు కాగా, (ఎ3) సింగిరెడ్డి వెంకటరమణా రెడ్డి పరారిలో ఉన్నాడు. భూమి విక్రయంలో మోసం చేయటమే కాకుండా చంపుతానని బెదిరింపులకు పాల్పడిన ఘటనలో జ్యోతినగర్ లో నివాసం ఉంటున్న దుర్గం జగన్ గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు, ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, సదాశివపల్లికి చెందిన సింగిరెడ్డి వెంకటరమణారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు మానకొండూర్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం ఎన్టీపీసీలో ఉద్యోగం చేసి పదవివిరమణ పొంది ప్రస్తుతం కరీంనగర్ భగత్ నగర్ లో నివాసం ఉంటున్న ఎల్లాల అజేందర్ రెడ్డి 2019లో మానకొండూర్ మండలం సదాశివపల్లిలోని సర్వే నెంబరు 442, 447/2, 443 లలోని 3 ఎకరాల అరగుంట భూమిని కొతపల్లి మండలం బావుపేటకు చెందిన దుర్గం జగన్ గౌడ్, తిరుపతి అనే వ్యక్తి ద్వారా కొనుగోలు చేశాడు. ఆ తరువాత ఆ భూమిలోకి వెల్లిన అజేందర్ రెడ్డి, సింగిరెడ్డి వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి అడ్డుకుని ఆ భూమి తనదేనని చెప్పటంతో ఇద్దరి మద్య భూవివాదం తలెత్తింది. ఈ విషయంపై మాట్లాడేందుకు అజేందర్‌రెడ్డిని సదాశివపల్లికి పిలిచిన దుర్గం జగన్ గౌడ్, నందెల్లి మహిపాల్, సింగిరెడ్డి వెంకట రమణారెడ్డిలు ముగ్గురు కలిసి అజేందర్ రెడ్డిని చంపుతానని బెదిరించారు. మోసపోయిన బాధితుడు అజేందర్‌రెడ్డి శుక్రవారం మానకొండూర్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు ముగ్గురు నిందితులపై ఐపీసీ 420, 467, 386, 506, 120-బి ఆర్/డబ్లు 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ కేసులో దుర్గం జగన్ ను శుక్రవారం అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హజరుపరచగా జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్ కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.

బిజెఎంసిలో రూ.64.12.8 లక్షల అంచనా బడ్జెట్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 24(జనం సాక్షి) : బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థలో శుక్రవారం మేయర్ బి.మహేందర్ గౌడ్ అధ్యక్షతన అంచనా బడ్జెట్ 2024-25 సమావేశం నిర్వహించామని తెలిపారు. ఈ సమావేశంలో నిర్వహణ వివిధ అభివృద్ధి పనులకు గాను రూ.64.12.08 లక్షలతో అంచనా బడ్జెట్‌ను తెలిపారు. జీతాలు/వేతనాల ఖర్చు, అద్దె/ పెనాలిటీ ఆదాయం సానిటేషన్ విభాగం ఖర్చు, ట్రేడ్ లైసెన్స్/ పెనాలిటీల ఆదాయం, కరెంట్ ఛార్జీల ఖర్చు, టౌన్ ప్లానింగ్ ఆదాయం, గ్రీన్ బడ్జెట్ ఖర్చు, పరిపాలన నిర్వహణ ఖర్చు లుగా కమీషనర్ బి.శరత్ చంద్ర తెలిపారు. ఈ సమావేశానికి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు మున్సిపల్ కార్పొరేషన్ లో పాల్గొన్నారు.

లాస్య నందిత మరణ వార్త విని షాకయ్యా

● చంద్రబాబు ఎమోషనల్ ట్వీట్



అమరావతి, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : రోడ్డు ప్రమాదంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణ వార్త విని షాక్ కు గురి చేసింది అని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తండ్రి సాయన్న చనిపోయిన ఏడాదిలోపే ఆమె మృతి చెందడం దురదృష్టకరం అని పేర్కొన్నారు. ఆమె ముందు ఉజ్వల భవిష్యత్తు ఉండగా.. విధి మరొకటి తలచింది అన్నారు. లాస్య నందిత కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలియజేస్తున్నాను అని ఆయన తెలిపారు. అయితే, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత ఇవాళ తెల్లవారుజామున పటాన్ చెరు దగ్గరలోని ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సంఘటన ప్రదేశంలోనే మృతి చెందారు. లాస్య నందిత మృతిపై ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి.. అలాగే, మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మాల్లారెడ్డి లు సంతాపం వ్యక్తం చేశారు.

బీజేపీ సొంతగా 370 సీట్లు సాధించలేదు

● వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్

● ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి24 (జనంసాక్షి) : లోక్‌సభ ఎన్నికలు ముంచుకు వస్తున్నాయి. వచ్చే నెలలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది. ఈసారి బీజేపీనే స్వతహాగా 370 సీట్లను సాధిస్తుందని, ఎన్డీయే కూటమి 400కి మించి సీట్లను గెలుస్తుందని ప్రధాని మోడీతో పాటు కేంద్ర నాయకత్వం చెబుతోంది.ఇదిలా ఉంటే ఓ జాతీయ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 370 సీట్ల సంఖ్య కేవలం పార్టీ కార్యకర్తలకు బీజేపీ నిర్దేశించిన లక్ష్యం మాత్రమే అని అన్నారు. అయితే, ఇది బీజేపీకి ప్రతిష్టాత్మక లక్ష్యమని చెప్పారు. బీజేపీ సొంతంగా 370 సీట్లు గెలువలేదని అన్నారు.కాగా.. బీజేపీ 370 సీట్ల గెలుపుపై అమిత్ షా ఇటీవల వారి వ్యూహాన్ని ప్రకటించారు. ఆర్టికల్ 370ని తొలగించామని అందుకే తాము 370 సీట్లను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. జమ్మూ కాశ్మీర్ అభివృద్ధికి ప్రతిబంధకంగా మారిన ఆర్టికల్ 370ని 2019లో కేంద్రం తొలగించింది. భారత రాజ్యాంగం, చట్టాలు నేరుగా ఆ ప్రాంతానికి వర్తించేలా బీజేపీ మార్గం సుగమం చేసింది.

న్యూయార్క్‌లో టైమ్స్ స్క్వేర్ ప్రదర్శన

● శ్రీనుబాబు జన్మదిన వేడుకలు

మల్హార్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోదరుడు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు జన్మదినాన్ని న్యూయార్క్ లోని విశ్వవిఖ్యాత టైమ్స్ స్క్వేర్ లో అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీను బాబు ఆప్త మిత్రులు శివ గౌడ్ (యు ఎస్ ఎ) కళ్లెం మహేందర్ రెడ్డి, సందడి శ్రీకాంత్ రెడ్డి, శచీంద్ర రాజవరం ఆధ్వర్యంలో ప్రద ర్శించారు.మండల కాంగ్రెస్ నాయకులు ఎంపిపి చింతల పల్లి మలహాల్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బడితల రాజయ్య, పిఎసిస్ డైరెక్టర్ ఇప్ప మొండయ్య, మండల యూత్ అధ్యక్షులు క్రాంతి, మండల పెఠిక సంఘం అధ్యక్షులు రాజు, బొబ్బిలి రాజుగౌడ్,కుంట సదానందం ముదిరాజ్, ఆకుల ఓదెలు,కేసారపు సురేందర్, బండిసుధాకర్,దుద్దిళ్ల శ్రీను బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ప్రభుత్వ పాఠశాల లో పిల్లలకు పరీక్ష పాడ్ లు పెన్నులు,కాంగ్రెస్ నాయకులు తమ అభిమాన నాయకుని పుట్టినరోజు సందర్భంగా పంపిణీ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, బొంతు రామ్మోహన్

-హైదరాబాద్, ఫిబ్రవరి 24 (జనంసాక్షి) :

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Sy.No. 210, Padmanagar, Chinthakunta, Karimnagar Dist, Telangana - 505462 Published at Janam Sakshi Office, Bawazeer Estate, Beside HUDA High School, Civil Hospital Road, Karimnagar - 505001, Telangana. Editor : M.M.RAHMAN RNINo.